సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 18

బుధవారం 10-4-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'



సన్‌రైజర్స్ విజయం

2 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్‌ను ఓడించిన హైదరాబాద్ -12లో



తొలిసారి 75,000కి సెన్సెక్స్

రికార్డు స్థాయిలో లాభాల స్వీకరణ నష్టాల్లో ముగిసిన మార్కెట్లు -13లో



రాముడిని అవమానించిన కాంగ్రెస్

అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణాన్ని నిలిపివేయడానికి కాంగ్రెస్ ఎన్నో ప్రయత్నాలు చేసిందని ప్రధాని మోదీ ఆరోపించారు.

వివరాలు 6లో ▸



సీఈసీకి జెడ్ కేటగిరీ భద్రత

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) రాజీవ్‌కుమార్‌కు కేంద్రం జెడ్ కేటగిరీ భద్రతను కల్పించింది.

వివరాలు 6లో ▸



ఎంవీఏలో సీట్ల పంపిణీ ఖరారు

మహారాష్ట్రలోని 48 స్థానాలకుగాను శివసేన (ఉద్ధవ్) 21 సీట్లలో, కాంగ్రెస్ 17, ఎన్సీపీ (పవార్) 10 స్థానాల్లో పోటీ చేయనున్నాయి.

వివరాలు 6లో ▸



ఈ ఏడాది సాధారణ వర్షపాతమే!

దేశంలో ఈ ఏడాది సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని స్కైమెట్ మంగళవారం వెల్లడించింది.


వివరాలు 6లో ▸

అక్రమాల మార్గదర్శికి గూబ గుయ్యిమనిపించిన సుప్రీం..

డిపాజిట్ల నిగ్గు తేలాల్సిందే

అధీకృత అధికారి కృష్ణరాజు ఫిర్యాదును కొట్టివేస్తూ.. ఉమ్మడి హైకోర్టు చివరి రోజున జస్టిస్ రజని ఇచ్చిన తీర్పు రద్దు

- విచారణ సమయంలో నిర్దిష్ట విధానాన్ని పాటించలేదని సుప్రీంకోర్టు ఆక్షేపణ
- హైకోర్టు తీర్పు ఏకపక్షం.. అందరి వాదనలు వినలేదని స్పష్టీకరణ
- అన్ని అంశాలపై తిరిగి లోతుగా విచారించాలని తెలంగాణ హైకోర్టుకు ఆదేశం
- ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు, ఉండవల్లితో సహా అందరి వాదనలు వినండి
- మార్గదర్శి ఫైనాన్షియర్స్ డిపాజిట్లపై నిగ్గు తేలాలి.. సమగ్ర పరిశీలన చేయండి
- ఆర్నెల్లలో విచారణ పూర్తి చేయాలి
- తెలంగాణ హైకోర్టుకు పంపొద్దని పలుమార్లు కోరిన రామోజీ న్యాయవాదులు
- తోసిపుచ్చిన సుప్రీంకోర్టు ధర్మాసనం
- కేసు గురించి మాట్లాడకుండా ఆదేశాలివ్వాలన్న సిద్ధార్థ లూథ్రా
- అదెలా సాధ్యం? ఎలాంటి గ్యాగ్ ఉత్తర్వులు ఇవ్వలేమని సుప్రీం స్పష్టీకరణ



కోర్టు తీర్పుల్ని ఒక్కొక్కరు ఒక్కోలా స్వీకరిస్తారు. విమర్శించరాదంటూ లక్ష్మణ రేఖ ఎలా గీయగలం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఈనాడు వ్యతిరేకంగా ఉంది. ఈనాడుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యతిరేకంగా ఉంది. ఈనాడుకు వ్యతిరేకంగా ఉండొద్దని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని మేం ఆదేశించలేం.

\- సుప్రీం కోర్టు

సాక్షి, అమరావతి: రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిబంధనలకు విరుద్ధంగా రూ.వేల కోట్లను అక్రమంగా డిపాజిట్ల రూపంలో ప్రజల నుంచి స్వీకరించిన కేసులో మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని యజమాని రామోజీరావుకు సుప్రీంకోర్టు గట్టి షాక్‌నిచ్చింది. చట్ట ఉల్లంఘనకు పాల్పడినందుకు రామోజీరావు, మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ప్రాసిక్యూట్ చేయాలని కోరుతూ అధీకృత అధికారి కృష్ణరాజు నాంపల్లి కోర్టులో ఇచ్చిన ఫిర్యాదును కొట్టివేస్తూ ఉమ్మడి హైకోర్టు జడ్జి జస్టిస్ తేలప్రోలు రజని ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు రద్దు చేసింది. డిపాజిట్లు తిరిగి ఇచ్చేసినందున తమపై కేసులు కొట్టేయాలంటూ రామోజీ, మార్గదర్శి ఫైనాన్షియర్స్ చేసిన అభ్యర్థనలను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. చట్ట విరుద్ధంగా వసూలు చేసిన సొమ్ములను వెనక్కి ఇచ్చేశామంటే ఎంతమాత్రం సరిపోదని వ్యాఖ్యానించింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ ద్వారా చట్ట విరుద్ధ డిపాజిట్ల సేకరణపై నిగ్గు తేలాల్సిందేనని తేల్చి చెప్పింది. మార్గదర్శి, రామోజీకి అనుకూలంగా

మిగతా 3వ పేజీలో ▶

జనం సొమ్ముతో గురివింద విందు!

పండిన రామోజీ పాపాలు

'మార్గదర్శి' అక్రమ డిపాజిట్ల నిగ్గు తేలాల్సిందేనన్న సుప్రీంకోర్టు

- వివరాలు 3లో

పార్టీలు.. పంచాంగాలు

మరింత మంచి పాలన

వంద రోజుల్లోనే కాంగ్రెస్ సర్కార్ ప్రజాదరణ పొందిందని, రాబోయే రోజుల్లో మరింత అద్భుతంగా పాలన సాగుతుందని పండితులు చెప్పారు.

2లో

కేసీఆర్ ఎత్తులు ఫలిస్తాయి

కేటీఆర్ జాగ్రత్తగా వ్యవహరిస్తే ఎన్నికల్లో పట్టు సాధిస్తారని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన పంచాంగ శ్రవణంలో పండితులు తెలిపారు.

2లో

మళ్లీ బీజేపీదే అధికారం

ఈ ఏడాది అంతా మంచే జరుగుతుందని బీజేపీ కార్యాలయంలో జరిగిన ఉగాది పంచాంగ శ్రవణంలో పండితులు చెప్పారు.

2లో

న్యూస్‌రీల్

విజిలెన్స్ డీజీ రాజీవ్ రతన్ హఠాన్మరణం



సీనియర్ ఐపీఎస్ అధికారి, తెలంగాణ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ రాజీవ్ రతన్ (59) హఠాన్మరణం చెందారు. పంజాబ్‌కు చెందిన రాజీవ్ రతన్ ఈ ఏడాది సెప్టెంబర్‌లో రిటైర్ కావాల్సి ఉంది.

- వివరాలు 5లో▶

అమెరికాలో కిడ్నాపైన నాచారం విద్యార్థి మృతి



అమెరికాలో కిడ్నాప్ అయిన హైదరాబాద్ విద్యార్థి అబ్దుల్ అర్ఫాత్(25) ఓహాయోలోని క్లీవ్‌ల్యాండ్‌లో మృతి చెందాడు. అక్కడి సరస్సులో లభ్యమైన మృతదేహం నడుము చుట్టూ పాస్‌పోర్ట్, మొబైల్‌ఫోన్ కట్టి ఉన్నాయి.

- వివరాలు 14లో▶

రోడ్డు స్వరూపం మార్చేశారు!



టీడీపీ నేత మాండ్ర శివానందరెడ్డి అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఆయన కొత్తగా వేస్తున్న వెంచర్ కోసం గతంలో నిర్మించిన విల్లాల్లోని ప్రైవేటు రోడ్డును పబ్లిక్ రోడ్డుగా మార్చేశారు. ఓ నాలాపై అనుమతుల్లేకుండానే వంతెన నిర్మించారు.

- వివరాలు 5లో▶

106 మంది ఉద్యోగులపై వేటు



ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ బీఆర్ఎస్ సమావేశంలో పాల్గొన్న 106 మంది ప్రభుత్వ ఉద్యోగులపై వేటు పడింది. సిద్దిపేట జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి మను చౌదరి వారిపై సస్పెన్షన్ విధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

- వివరాలు 2లో▶

ఇంటింటికీ బీజేపీ

14 నుంచి ఓటర్ల ఇళ్ల వద్ద పార్టీ ప్రచారం

18న ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా మొదటి విడత పూర్తి

ప్రతి కుటుంబాన్ని మొత్తం మూడుసార్లు కలిసేలా ప్రణాళిక

అగ్రనేతల పర్యటన సందర్భంగా మాత్రమే పెద్ద బహిరంగ సభలు



బీజేపీలో చేరిన నేతలతో కిషన్‌రెడ్డి. చిత్రంలో చింతల, లక్ష్మణ్, బీబీ పాటిల్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో బీజేపీ దూకుడు పెంచుతోంది. దేశంలో మూడో విడత పార్లమెంట్ ఎన్నికల కోసం ఈ నెల 18న ఈసీ నోటిఫికేషన్ జారీ చేయనున్న విషయం తెలిసిందే. ఈ నోటిఫికేషన్ వెలువడేలోగా రాష్ట్రంలో తొలివిడత 'ఓటర్స్ ఔట్ రీచ్'పూర్తిచేయాలని పార్టీ జాతీయ నాయకత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమం కింద ఈ నెల 14 నుంచి 'ఇంటింటికీ బీజేపీ' పేరిట ఓటర్లను వారి ఇళ్ల వద్దే పార్టీ కార్యకర్తలు కలుసుకోనున్నారు. 17వ తేదీలోగా రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్ల పరిధిలోని ప్రతి పోలింగ్ బూత్‌లోని ప్రతి ఇంటికీ వెళ్లనున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగిసే (మే 11)లోగా ప్రతి కుటుంబాన్ని మొత్తంగా మూడుసార్లు కలిసి మద్దతు కోరాలని బీజేపీ భావిస్తోంది.

ప్రతి ఇంటి తలుపు తట్టేలా..

తొలి విడత లక్ష్యంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని పోలింగ్ బూత్ కేంద్రాల్లో విస్తృత స్థాయి ప్రచారాన్ని బీజేపీ చేపట్టనుంది. ప్రతి ఇంటి తలుపు తట్టి, ఆ కుటుంబ సభ్యులను కలుసుకుని ఈసారి బీజేపీకి ఓటేయాలని కోరనుంది. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ కరపత్రం, ప్రచారానికి సంబంధించిన స్టిక్కర్, పార్టీ జెండా, ఓటర్లకు ఎంపీ అభ్యర్థి విజ్ఞప్తి పత్రం (అప్పీల్) వంటివి వారికి అందించనున్నారు. ఈ ప్రచార ప్రక్రియకు సంబంధించిన మొత్తం మెటీరియల్ ఇప్పటికే సిద్ధమై పార్టీ

మిగతా 2వ పేజీలో ▶

కర్ణాటకలో మాదిరిగానే దగా

కాంగ్రెస్ పార్టీపై కిషన్‌రెడ్డి ఫైర్

హామీలు అమలు చేసే పరిస్థితిలో ప్రభుత్వం లేదు.. మరోసారి వెన్నుపోటు పొడిచేందుకు సిద్ధం

బీజేపీలో చేరిన జహీరాబాద్, నల్లగొండ నేతలు, కార్యకర్తలు

2లో

కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

23 వరకూ పొడిగిస్తూ ఢిల్లీ కోర్టు ఆదేశాలు

- బెయిల్ ఇస్తే సాక్ష్యాలు తారుమారవుతాయన్న ఈడీ
- చార్జిషీటులో ఆమె పాత్రపై స్పష్టత ఇచ్చేందుకు మరో 14 రోజుల గడువుకు వినతి.. ఈడీ వాదనతో ఏకీభవించిన కోర్టు..
- స్వీయ వాదనకు కవిత వినతి.. నిరాకరించిన జడ్జి

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ స్కాంలో మనీలాండరింగ్ జరిగిందన్న అభియోగాలకు సంబంధించిన కేసులో ఈడీ అరెస్టు చేసిన ఎమ్మెల్సీ కవితకు ఢిల్లీ కోర్టులో ఊరట లభించలేదు. ఈ కేసులో ఆమెను మరో 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీకి అనుమతిస్తూ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఆదేశించిన 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో మంగళవారం కవితను ఈడీ అధికారులు ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. ఈడీ తరపు న్యాయవాది వాదిస్తూ దర్యాప్తు కీలక దశలో ఉందని.. ఈ సమయంలో

మిగతా 10వ పేజీలో ▶

ఈ కేసులో నేను బాధితురాలిని..

ఇందులో నా ప్రమేయం లేదు

ఎలాంటి ఆర్థిక ప్రయోజనం పొందలేదు



రౌస్ అవెన్యూ కోర్టు వద్ద కవిత

- అయినా దర్యాప్తు సంస్థలకు పూర్తిగా సహకరించా
- నాపై తీవ్ర చర్యలు వద్దని సుప్రీంకోర్టు చెప్పింది
- ఆధారాల్లేకున్నా ఈడీ అరెస్టు చేసింది
- ఈడీ, సీబీఐ కేసుల్లో 95% ప్రతిపక్షాల పైనే ఉన్నాయి..
- నిందితులు బీజేపీలో చేరితే దర్యాప్తు ఆకస్మికంగా నిలిచిపోతోంది
- పరీక్షల వేళ నేను దగ్గరలేకపోవడం కుమారుడిపై ప్రభావం చూపుతుంది
- అందుకే బెయిలివ్వాలని మళ్లీ కోరుతున్నా..
- కోర్టులో స్వయంగా ప్రస్తావించేందుకు రాసుకొచ్చిన 4 పేజీల లేఖలో కవిత
- నిరాకరించడంతో మీడియాకు విడుదల

10లో

అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు సబబే



- నిబంధనల ఉల్లంఘన జరగలేదు.. ఈడీ వద్ద సాక్ష్యాధారాలున్నాయి
- ఆయనను ఈడీ కస్టడీకి అప్పగించడం చట్టవిరుద్ధం కాదు
- ఢిల్లీ హైకోర్టు తీర్పు.. కేజ్రీవాల్ పిటిషన్ కొట్టివేత

- వివరాలు 6లో

ఇదండీ సంగతి



నా కోసం తినకుండా ఉండకు! ప్రచారం చేసుకొని అటు నుండి అటు ఇఫ్తార్ విందుకెళ్లొస్తా!

'టెట్' దరఖాస్తు గడువు పెంపు!


- ప్రభుత్వానికి విద్యా శాఖ ప్రతిపాదన..
- ఎన్‌సీటీఈ స్పష్టత కోసం నిరీక్షణ
- తగ్గిన టెట్ దరఖాస్తులు
- ముందుకు రాని సర్వీస్ టీచర్లు
- గడువు పెంచితే దరఖాస్తులు పెరిగే అవకాశం
- నేడు ఉత్తర్వులు!

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీఎస్ టెట్)కు దరఖాస్తు గడువు పెంచాలని అధికారులు నిర్ణయించినట్టు తెలిసింది. టెట్ దరఖాస్తు గడువు ఈ నెల 10(నేటి)తో ముగుస్తుంది. దీన్ని మరో వారం రోజుల పాటు పెంచాలని భావిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనను విద్యాశాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి పంపింది. దీనిపై బుధవారం అధికారిక ఉత్తర్వులు వెలువడే వీలుంది. సర్వీస్ టీచర్ల నుంచి వస్తున్న ఒత్తిడి నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. మరోవైపు టెట్ రాసే వారి సంఖ్య గణనీయంగా తగ్గింది.

3లక్షలు వస్తాయనుకుంటే 2లక్షలు కూడా దాటలేదు

టెట్‌కు ఇప్పటి వరకూ 1,93,135 దరఖాస్తులొచ్చాయి. 2016లో 3.40 లక్షలు, 2017లో 3.29 లక్షలు, 2022లో 3.79 లక్షలు, 2023లో 2.83 లక్షల

మిగతా 10వ పేజీలో ▶



జూన్ వరకు నీటి సమస్య రాదు



తాగునీటి సరఫరాపై ప్రభుత్వం ప్రకటన

- అత్యవసర పనుల కోసం రూ.వందకోట్లు విడుదల
- కరీంనగర్, ఖమ్మం కార్పొరేషన్లతోపాటు మరో పది మున్సిపాలిటీల్లో నీటి ఎద్దడి కాస్త ఎక్కువే
- 67 మున్సిపాలిటీల్లో వంద ఎల్పీడీ కంటే తక్కువ నీటి సరఫరా
- వీటిల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడి
- 23,839 గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా

సాక్షి, హైదరాబాద్: ఎండల తీవ్రత ముదురుతున్నా.. వచ్చే జూన్ వరకు రాష్ట్రంలో తాగునీటి సమస్య అధికం కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఖమ్మం, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో తాగునీటి ఎద్దడి కాస్త అధికంగా ఉన్నట్లు గుర్తించామనీ, అలాగే 67 మున్సిపాలిటీలను సమస్యాత్మకంగా ఉన్నట్లు గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించింది. తాగునీటి సమస్యపై ప్రతీరోజు ఉన్నతస్థాయిలో సమీక్షిస్తూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించింది. తాగునీటి సమస్య పర్యవేక్షణకు ఉమ్మడి పది జిల్లాలకు సీనియర్ ఐఏఎస్

మిగతా 10వ పేజీలో ▶

చాక్లెట్లా? మందులా..?

- కొందరు డాక్టర్లు ఎడాపెడా మందులు రాస్తున్నారన్న ఐసీఎంఆర్ స్టడీ
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు మొదలు ఎయిమ్స్ వరకు ఇదే తీరు
- కాంబినేషన్‌లో రెండు మూడురకాల మందుల వల్ల సైడ్ ఎఫెక్ట్స్

సాక్షి, హైదరాబాద్: వైద్యులపై విశ్వాసంతో రోగులు వారి వద్దకు వెళుతుంటారు. చిన్నాచితకా అనారోగ్య సమస్యల్ని సైతం వారికి చెప్పుకుంటారు. కానీ కొందరు డాక్టర్ల అవగాహన రాహిత్యం రోగుల పాలిట శాపంగా మారుతోంది. అవసరం లేకున్నా ఎడాపెడా మందులు రాస్తున్నారని భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) పరిశోధనలో వెలుగు చూసింది. దేశంలో పేరెన్నికగన్న ఎయిమ్స్ వంటి ఆసుపత్రులు మొదలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో డాక్టర్లు రాస్తున్న ప్రిస్క్రిప్షన్లలో నిబంధనల అతిక్రమణ జరుగుతున్నట్లు పరిశోధన తేల్చింది. ఈ మేరకు ఐసీఎంఆర్ అనుబంధ జర్నల్ ఐజేఎంఆర్‌లో తాజాగా ఓ నివేదికను ప్రచురించింది.

పీజీ విద్యార్థుల నుంచి అనుభవజ్ఞుల వరకు..

వైద్యులు రాసిన ప్రిస్క్రిప్షన్లు ఏ మేరకు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయన్న దానిపై ఐసీఎంఆర్ పరిశోధన చేసింది. మొత్తం 4,838 ప్రిస్క్రిప్షన్లను

మిగతా 5వ పేజీలో ▶



బీసీల అభివృద్ధిపై బీజేపీ వైఖరేంటో తేల్చిచెప్పాలి

ప్రధాని మోదీకి ఆర్.కృష్ణయ్య లేఖ



సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం బీజేపీ ఎలాంటి వైఖరి అనుసరిస్తుందో వెల్లడించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ప్రధాని మోదీకి కృష్ణయ్య లేఖ రాశారు. బీసీ సంక్షేమానికి చేపట్టే కార్యక్రమాలను బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చాలని కోరారు. దేశంలో బీసీ వ్యక్తి ప్రధానమంత్రిగా ఉన్నప్పటికీ బీసీ డిమాండ్లు మాత్రం అమలుకు నోచుకోవడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జనగణనలో కులగణన, విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేస్తామని స్పష్టం చేయడం స్వాగతించదగ్గ విషయమని పేర్కొన్నారు. బీసీ సంక్షేమంలో ఏపీ ముందు వరుసలో ఉందని, పలు రాష్ట్రాలు కూడా ఇదే తరహాను అనుసరించాలని కృష్ణయ్య సూచించారు.

కర్ణాటకలో మాదిరిగానే దగా

కాంగ్రెస్ పార్టీపై కిషన్‌రెడ్డి ఫైర్

- హామీలు అమలు చేసే పరిస్థితిలో ప్రభుత్వం లేదు
- మరోసారి వెన్నుపోటు పొడిచేందుకు సిద్ధం
- బీజేపీలో చేరిన జహీరాబాద్, నల్లగొండ నేతలు, కార్యకర్తలు
- సికింద్రాబాద్ ప్రచార రథాలను ప్రారంభించిన కేంద్రమంత్రి

సాక్షి, హైదరాబాద్: కర్ణాటకలో మాదిరిగా తెలంగాణలోనూ ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఇచ్చిన ఏ హామీనీ అమలు చేసే పరిస్థితిలో ప్రభుత్వం లేదని, నిధుల సమీకరణ ఎజెండా కూడా కాంగ్రెస్ వద్ద లేదని అన్నారు. దొంగలు పోయి గజదొంగలు వచ్చినట్లు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లు తయారైందని విమర్శించారు. పరిపాలనలో, దోపిడీలో మార్పురాలేదని, ప్రజలను వెన్నుపోటు పొడవడంలో మార్పు రాలేదని ధ్వజమెత్తారు. ఎంపీ బీబీ పాటిల్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి ఆంజనేయులు, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే పండరి, జెడ్పీటీసీ రాజు రాథోడ్, మాజీ జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, నల్లగొండ జిల్లాకు చెందిన రామరాజు, ఇతర నాయకులు మంగళవారం బీజేపీలో చేరారు. పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కిషన్‌రెడ్డి వారికి బీజేపీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ఉగాది రోజున పలువురు నాయకులు, కార్యకర్తలు, బీసీ, అంబేడ్కర్ సంఘాల ప్రతినిధులు బీజేపీలో చేరడం శుభసూచకమని కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.



మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన చేరికల కార్యక్రమంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ దొందూ దొందే

రాష్ట్రంలో కేవలం ఒక పార్టీ పోయి మరో పార్టీ అధికారంలోకి వచ్చిందని, బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ దొందూ దొందేనని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇటీవల తుక్కుగూడ సభలో రాహుల్‌గాంధీ పాత గ్యారంటీల గురించి మాట్లాడకుండా, ఎప్పుడు అమలు చేస్తారో చెప్పకుండా.. కొత్త హామీలు ఇచ్చిపోయారని విమర్శించారు. రాహుల్‌గాంధీ వంద రోజుల్లో గ్యారంటీలు అమలు చేస్తానని చెప్పి ప్రజలను వెన్నుపోటు పొడిచారని, తాజాగా పార్లమెంటు ఎన్నికల్లో మరోసారి వెన్నుపోటు పొడిచేందుకు సిద్ధమయ్యారని ధ్వజమెత్తారు. అయితే తెలంగాణ ప్రజలు చైతన్యవంతులని కాంగ్రెస్‌ని నమ్మే పరిస్థితిలో లేదని కిషన్‌రెడ్డి చెప్పారు.

రేవంత్‌కు కాంగ్రెస్ నుంచే ప్రమాదం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సొంత పార్టీ కాంగ్రెస్ నుంచే ప్రమాదం పొంచి ఉందని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం సికింద్రాబాద్ పార్టీ ప్రచార రథాలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తనను పదవి నుంచి తప్పించేందుకు కుట్ర జరుగుతోందని రేవంత్‌రెడ్డి చెబుతున్నారని, అయితే ఆయనకు బీజేపీతో ఎలాంటి అపాయం లేదని కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రభుత్వానికి తామెలాంటి అంతరాయం కలిగించబోమని అన్నారు. సీఎంకు ఏదైనా ప్రమాదం ఉందంటే అది కాంగ్రెస్ వారి నుంచే అని ఆయన గుర్తించాలని సూచించారు. తాము బహిరంగంగానే ప్రజల మద్దతు కూడగట్టి కాంగ్రెస్‌ను ఓడిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీజేపీ అత్యధిక సంఖ్యలో ఎంపీ సీట్లను గెలుచుకుంటుందనే ధీమాను వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ రాష్ట్రంలో ఇప్పటికే నాలుగు సభల్లో పాల్గొన్నారని, భవిష్యత్తులో మరిన్ని సభల్లో పాల్గొంటారని తెలిపారు. బీజేపీ ఎంపీ అభ్యర్థులు సైతం ఇప్పటికే మండల స్థాయి వరకు ప్రచారం నిర్వహిస్తున్నారని చెప్పారు.

ఆర్‌జీ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజల నుంచి ఆర్‌జీ ట్యాక్స్ (రాహుల్‌గాంధీ ట్యాక్స్) వసూలు చేస్తోందని, బిల్డర్లు, కాంట్రాక్టర్లను ఎవ్వరినీ వదలడం లేదని కిషన్‌రెడ్డి ఆరోపించారు. కర్ణాటకలో 25 ఎంపీ సీట్లలో బీజేపీ గెలవబోతోందని, తెలంగాణలో కూడా ప్రజలు మోదీకి అండగా నిలబడి 17 సీట్లలో విజయాన్ని అందించాలని కోరారు.

ఇంటింటికీ బీజేపీ

▶ మొదటి పేజీ తరువాయి

యంత్రాంగానికి అందుబాటులోకి తెచ్చినట్టు బీజేపీ వర్గాలు తెలిపాయి.

మూడురోజులు సన్నాహక సమావేశాలు

పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లడానికి ముందు ఈ నెల 11, 12, 13 తేదీల్లో మండల స్థాయిలో దీనికి సంబంధించిన సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నారు. వీటికి సమాంతరంగా ఈ నెల 15వ తేదీలోగా 17 ఎంపీ నియోజకవర్గాల్లో పార్లమెంట్ సమ్మేళనాలు పూర్తి చేయనున్నారు. వీటిల్లో పోలింగ్ బూత్‌ల కోఆర్డినేటర్లు మొదలు రాష్ట్రస్థాయి వరకు నాయకులు పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే చేవెళ్ల, తదితర చోట్ల ఈ సమ్మేళనాలు పూర్తికాగా, 15 వరకు మిగతా పార్లమెంట్ సీట్ల పరిధిలో నిర్వహించనున్నారు.

ప్రత్యేక 'కాస్ట్ ఔట్ రీచ్' ప్రోగ్రామ్

వివిధ సామాజిక వర్గాలను కలుసుకునేందుకు ప్రత్యేకంగా 'కాస్ట్ ఔట్ రీచ్'కార్యక్రమాన్ని కూడా బీజేపీ చేపట్టనుంది. జిల్లాలు, పార్లమెంట్ నియోజకవర్గాలు, అసెంబ్లీల స్థాయిల్లో వివిధ కుల సంఘాలతో సమ్మేళనాలు, యువత, మహిళ, రైతులు, ఎస్సీలు, ఎస్టీలు ఇలా వివిధ వర్గాల వారితో ఎక్కడికక్కడ వేర్వేరుగా సమావేశాలు నిర్వహించాలని నాయకత్వం నిర్ణయించింది.

నామినేషన్ల సమయంలో ర్యాలీలు

ఈనెల 25న రాష్ట్రంలో నామినేషన్ల ప్రక్రియ ముగిసేలోగా వివిధ రూపాల్లో ప్రచార కార్యక్రమాల వేగం పెంచనున్నారు. 18వ తేదీ తర్వాత లోక్‌సభ ఎంపీ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు సందర్భంగా ర్యాలీలు నిర్వహించనున్నారు. 25వ తేదీ తర్వాత మే 13వ తేదీ పోలింగ్ వరకు ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, జాతీయ అధ్యక్షుడు జేపీనడ్డా వంటి అగ్రనేతల పర్యటనల సందర్భంగా మాత్రమే పెద్ద బహిరంగ సభలను నిర్వహించాలని నిర్ణయించారు. మిగతాఎన్నికల ప్రచారమంతా ఇంటింటికీ వెళ్లడం, కార్నర్ మీటింగ్‌లు లాంటి స్వయంగా ఓటర్లను కలుసుకునే 'ఓటర్ ఔటర్ రీచ్'కార్యక్రమాలకే నాయకత్వం ప్రాధాన్యతనివ్వనుంది.

పీకే మాటలకు విలువే లేదు

ఆయన్ను నమ్మే పరిస్థితి లేదు

- బతుకుదెరువు కోసం ఏదో మాట్లాడుతుండు
- ఓ రోజు బీజేపీ అంటడు, ఇంకోసారి కాంగ్రెస్ అంటడు
- పార్టీ ఫిరాయింపులపై నేను మాట్లాడను.. నేనే పార్టీలు మారినోన్ని
- మీడియాతో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వ్యాఖ్యలు

సాక్షి, హైదరాబాద్: దేశంలో ప్రశాంత్‌కిషోర్ (పీకే) మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని, బతుకు దెరువు కోసం సర్వే సంస్థ పేరుతో రోజుకో మాట మాట్లాడుతాడని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఇటీవల పీకే సర్వేల పేరిట చెపుతున్న జోస్యాలను కొట్టిపారేశారు. పీకే మాటలకు విలువ లేదని తేల్చి చెప్పారు. దేశంలో గెలిచేది బీజేపీ అని ఓసారి, ఇంకోసారి కాంగ్రెస్ అని అంటాడని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ అధికారంలోకి వస్తారని చెప్పాడని, కానీ కాంగ్రెస్ గెలిచిందని గుర్తు చేశారు. పీకే సర్వేలకు, మాటలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 12 నుంచి 14 ఎంపీ సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.



రేవంత్ పాలనకు వంద మార్కులు

రేవంత్ పాలనకు వంద మార్కులు వేస్తున్నట్లు జగ్గారెడ్డి చెప్పారు. రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఒక్కరే ఉంటే బాగుంటుందనే రేవంత్‌రెడ్డి కొనసాగుతున్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌లో కింగ్, కింగ్ మేకర్ రాహుల్ గాంధీనే అని స్పష్టం చేశారు. కరువు కాంగ్రెస్‌తో వచ్చిందని మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులకు వర్షాలు ఎప్పుడు వస్తాయో కూడా తెలుసుకునే తెలివి లేదా అని విమర్శించారు. కేసీఆర్ ఇంకా ఓటమి ఫ్రస్ట్రేషన్‌లోనే ఉన్నారన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఏ విషయంపైనా కనీస అవగాహన ఉండదని విమర్శించారు.

బీజేపీ బౌండరీలో మంద కృష్ణ రాజకీయాలు

బీజేపీ బౌండరీలో ఉండి మంద కృష్ణ మాదిగ రాజకీయాలు మాట్లాడుతున్నారని జగ్గారెడ్డి ఆరోపించారు. న్యూట్రల్‌గా ఉంటే ఆయన ఏం అడిగినా సమాధానం చెప్పేవాళ్లమన్నారు. బీజేపీ తెలంగాణలో మాదిగను రాజ్యసభ సభ్యుడిని చేయమని గానీ కేంద్ర మంత్రిని చేయాలని గానీ మంద కృష్ణ అడిగారా అని ప్రశ్నించారు. బంగారు లక్ష్మణ్‌ని నవ్వులపాలు చేసినప్పుడు మంద కృష్ణ కనీసం స్పందించలేదని గుర్తు చేశారు.పార్టీ ఫిరాయింపులపై తాను మాట్లాడలేనని, ఎందుకంటే తానే పార్టీలు మారి వచ్చానని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు.

రాష్ట్రం పాడి పంటలతో కళకళలాడాలి

రాజ్‌భవన్‌లో ఉగాది వేడుకల్లో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఆకాంక్ష



సాక్షి, హైదరాబాద్: శ్రీ క్రోధినామ సంవత్సరం మరింత సంతోషాన్ని, పురోభివృద్ధిని, సమృద్ధిని తీసుకురావాలని... మంచి వర్షాలు, పాడిపంటలతో రాష్ట్రం కళకళలాడాలని తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఆకాంక్షించారు. తెలుగు కొత్త సంవత్సరం ప్రజలందరికీ మరింత సానుకూలంగా ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. మంగళవారం రాజ్‌భవన్‌లో శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. 'భరతమాత పాద పద్మాలకు ప్రణమిల్లుతూ మీ అందరికీ క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు'అంటూ గవర్నర్ రాధాకృష్ణన్ తెలుగులో ప్రసంగించారు. నూతన సంవత్సరంలో ప్రజలందరికీ ధనం, ఆరోగ్యం, సంతోషాలను దేవుడు చేకూర్చాలని కోరుకున్నారు. ప్రగతిశీల సుసంపన్న తెలంగాణ రాష్ట్రాన్ని నిర్మించడానికి సంకల్పిద్దామని గవర్నర్ పిలుపునిచ్చారు. ఈ ఉగాది పర్వదినాన తెలంగాణ, దేశ సర్వతోముఖాభివృద్ధి, పురోగతి, స్వావలంబన కోసం ప్రత్యేకంగా ప్రార్థిస్తున్నానన్నారు. ఉగాది పంచాంగాన్ని దత్తాత్రేయ శర్మ పఠించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు రానివ్వం: కోమటిరెడ్డి

సాక్షి,హైదరాబాద్: రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూస్తానని రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం ఉదయం ఆర్ఆర్ఆర్‌లో భూములు కోల్పోతున్న గజ్వేల్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 500 మంది రైతులు మంత్రిని బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిశారు. తాము ఇప్పటికే మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టుల నిర్మాణాలతో భూనిర్వాసితులం అయ్యామని, మళ్లీ మిగిలిన కొద్దిపాటి భూములు ఆర్ఆర్ఆర్‌లో పోతే తాము జీవనాధారం కోల్పోతామని వారు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు. అప్పటి వరకు రైతులు ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు.

నరసింహస్వామి వారి ఆదాయం 02, వ్యయం 08

ఈ ఏడాది ఎండలు మెండు.. వర్షాలు దండి

యాదాద్రిలో వైభవంగా పంచాంగ శ్రవణం



ఆలయ తూర్పు మాఢ వీధిలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో, శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శ్రీ క్రోధి నామ ఉగాది వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వయంభూలు కొలువైన ప్రధానాలయంలో భక్ష్యాలు తయారుచేసి, షడ్రుచులతో చేసిన పచ్చడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీస్వామి అమ్మవార్లకు నివేదించారు. సాయంత్రం వేళ ముఖ మండపంలో శ్రీస్వామి వారి సేవను అలంకరించి మాఢ వీధుల్లో సేవోత్సవం జరిపించారు. తూర్పు రాజగోపురం ముందు మాఢ వీధిలో అధిష్టించి పంచాంగ శ్రవణాన్ని అర్చకులు వినిపించారు. యాదాద్రి నృసింహస్వామిది తుల రాశి కాగా.. ఈ ఏడాది శ్రీస్వామి వారికి 02 ఆదాయం, 08 వ్యయం, శ్రీలక్ష్మీ అమ్మవారిది మేషరాశి కాగా.. ఆదాయం 08, వ్యయం 14, ఆండాల్ అమ్మవారు సింహ రాశి కాగా.. ఆదాయం 02 వ్యయం 14 ఉన్నట్లు పండితులు పేర్కొన్నారు. శ్రీ క్రోధి సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారన్నారు. ఈ వేసవిలో ఎండలు బాగా ఉంటాయని, ఈ ఏడాది మంచి వర్షాలు కురుస్తాయని వెల్లడించారు. అంతే కాకుండా ధాన్యం ధరలు పెరిగే అవకాశం ఉన్నట్లు చెప్పారు. దేవాలయాలు, పర్యాటక క్షేత్రాలు అభివృద్ధి బాటలో నడుస్తాయని, దేశ రక్షణ రంగం మెరుగ్గా ఉంటుందని చెప్పారు. వేడుకల్లో ఆలయ ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, అర్చకులు, పండితులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

భద్రాద్రిలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

ఆలయంలో పంచాంగ పఠనం.. రామయ్య ఆదాయం 14, వ్యయం 02



ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం గావిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో 'వసంత పక్ష ప్రయుక్త తిరుకల్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాల'కు మంగళవారం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. పవిత్ర గోదావరి నది నుంచి జలాలు తీసుకొచ్చి మృత్సంగ్రహణం జరిపి వేడుకలకు శ్రీకారం చుట్టారు. తొలుత ఉదయం బేడా మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం జరిపి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం బేడా మండపంలో క్రోధినామ తెలుగు సంవత్సరాది ఉత్సవాలు నిర్వహించి పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఈ ఏడాది ఆదాయం 14, వ్యయం 02, రాజ్యపూజ్యం, అవమానం 06గా ఉందని.. సీతమ్మ వారి ఆదాయం, వ్యయం 05గా, రాజ్యపూజ్యం 05, అవమానం 02గా ఉందని పండితులు వెల్లడించారు.

106 మంది ఉద్యోగులపై వేటు

- బీఆర్ఎస్ సమావేశానికి హాజరైన వారిపై చర్యలు
- సస్పెన్షన్ విధిస్తూ సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి ఉత్తర్వులు

సిద్దిపేట రూరల్: లోక్‌సభ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ బీఆర్ఎస్ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న 106 మంది ప్రభుత్వ ఉద్యోగులపై వేటు పడింది. మంగళవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి మిక్కిలినేని మను చౌదరి వారిపై సస్పెన్షన్ విధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఆదివారం రాత్రి సమయంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి ఎన్నికల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని రెడ్డి సంక్షేమ భవనంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ 106 మంది సెర్ప్, ఉపాధి హామీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఎన్నికల కమిషన్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫంక్షన్ హాల్‌లోని సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా సమావేశంలో పాల్గొన్న 106 మందిని గుర్తించారు. ఈ నివేదికను ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి.. కలెక్టర్‌కు అందజేశారు. ఇందులో సెర్ప్ ఉద్యోగులు 38 మంది, ఈజీఎస్ అధికారులు 68 మందిపై శాఖా పరమైన చర్యల్లో భాగంగా సస్పెన్షన్ వేటు వేశారు. సోమవారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి, స్థానిక నాయకులపై కేసు నమోదు కావడం తెలిసిందే.

నవ వసంతంలో అందరికీ మేలు జరగాలి

మంత్రి జూపల్లి కృష్ణారావు

- రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది వేడుకలు



ఉగాది వేడుకల్లో మంత్రి జూపల్లి. చిత్రంలో సీఎస్ శాంతికుమారి, సంతోష్‌కుమార్ శర్మ తదితరులు

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): క్రోధినామ సంవత్సరంలో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో క్రోధినామ ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. రైతు కుటుంబాలలో పున్నమి వెన్నెలను నింపడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఉగాది వేడుకల్లో భాగంగా బ్రహ్మశ్రీ బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి పంచాగ పఠనం చేశారు. భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సీఎం ఓఎస్‌డీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మరింత మంచి పాలన

గాంధీభవన్‌లో ఉగాది వేడుకలు



పంచాంగం వినిపిస్తున్న శ్రీనివాసమూర్తి. చిత్రంలో జూపల్లి, జగ్గారెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు

సాక్షి, హైదరబాద్: క్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం గాంధీభవన్‌లో ఘనంగా జరిగాయి. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు, వర్కింగ్ ప్రెసిసెంట్ జగ్గారెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితుడు శ్రీనివాసమూర్తి పంచాంగ పఠనం చేశారు. ప్రజాభీష్టం మేరకు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అద్భుతంగా పాలన సాగిస్తుందన్నారు. వంద రోజుల్లోనే ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీలు అమలు చేసి, ప్రజాదరణ పొందారని, రాబోయే రోజుల్లో మరింత అద్భుతంగా పాలన సాగుతుందని జోష్యం చెప్పారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఈ క్రోధి నామ సంవత్సరంలో కోపం తగ్గించుకొని కాంగ్రెస్ కార్యకర్తలు పాజిటివ్ దృక్పథంతో ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, కాంగ్రెస్ నాయకులు కుమార్‌రావ్, నిరంజన్, చల్లా నర్సింహారెడ్డి, మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



నేనున్నా.. అధైర్యపడకండి

- పార్టీ శ్రేణులకు ఉగాది నాడు ధైర్యం చెప్పిన కేసీఆర్
- వ్యవసాయ క్షేత్రానికి పోటెత్తిన నేతలు, కార్యకర్తలు
- ఉగాది శుభాకాంక్షలు తెలిపిన వారికి అధినేత అభివాదం

మర్కూక్(గజ్వేల్): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం సందడి నెలకొంది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సిద్దిపేట జిల్లా మర్కూక్ ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో రెండు నియోజకవర్గాల నుంచి సుమారు నాలుగు వేల మంది తరలి వచ్చారు. ఉదయమే ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రావు తదితరులు కేసీఆర్‌ను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వేల సంఖ్యలో కార్యకర్తలు తరలిరావడంతో వ్యవసాయ క్షేత్రం కిక్కిరిసిపోయింది. కేసీఆర్‌ను కలిసేందుకు నాయకులు పోటీ పడ్డారు.

మీ ఆశీర్వాదం ఉండాలి: కేసీఆర్

వ్యవసాయ క్షేత్రంలో భారీ సంఖ్యలో ప్రజాప్రతినిధులు, నాయకులు తరలిరావడంతో కేసీఆర్ బయటకు వచ్చి అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. మీ ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. అందరికీ అందుబాటులో ఉంటానని, ఎవరూ అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. కాగా, సీఎం కేసీఆర్ అంటూ నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది.



మంగళవారం తనను కలిసేందుకు వచ్చిన ప్రజలు, నేతలకు అభివాదం చేస్తున్న కేసీఆర్. చిత్రంలో హరీశ్‌రావు, ప్రభాకర్‌రెడ్డి

మళ్లీ బీజేపీదే అధికారం

- ఈ ఏడాది అంతా మంచే జరుగుతుంది
- సమష్టి విజయం సిద్ధిస్తుంది
- ప్రపంచానికి భారత్ ఆదర్శంగా నిలుస్తుంది
- బీజేపీ ఆఫీసులో సూర్యనారాయణ మూర్తి ఉగాది పంచాంగ పఠనం



పంచాంగం వినిపిస్తున్న సూర్యనారాయణమూర్తి. చిత్రంలో కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: దేశంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రాబోతోందని పంచాంగ శ్రవణకర్త కాకునూరి సూర్యనారాయణ మూర్తి జోస్యం చెప్పారు. –ఈ ఏడాది అంతా మంచే జరుగుతుందనీ, పార్టీ నాయకుల్లో ఐక్యత పెరుగుతుందనీ, సమష్టి విజయం సాధించాలనే సంకల్పం సిద్ధిస్తుందన్నారు. తమ శక్తి మేర ప్రజలకు వ్యయం చేస్తే నాయకులకు పేరు వస్తుందన్నారు. వృద్ధుల సహకారం ఉంటేనే యువకులు విజయం పొందుతారని తెలిపారు. ప్రపంచానికి భారత్ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. తాను 14 ఏళ్ల క్రితం బీజేపీ కార్యాలయంలో ఉగాది పంచాంగ శ్రవణంలో పాల్గొని అయోధ్యలో శ్రీరామమందిర నిర్మాణం తర్వాత మళ్లీ కలుసుకుందామని చెప్పినట్టు మూర్తి గుర్తుచేశారు. అంతకు ముందు పార్టీ కార్యాలయంలో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి దంపతులు హోమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంటరీ బోర్డుసభ్యుడు డా.కె. లక్ష్మణ్ , ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్‌బాబు, రాష్ట్రపార్టీ ప్రధానకార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్ తివారీ, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ పాల్గొన్నారు.

మోదీ సర్కార్‌నే ప్రజలు కోరుకుంటున్నారు: కిషన్‌రెడ్డి

పంచాంగ శ్రవణం అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. శ్రీ క్రోధి నామ సంవత్సరం చాలా ప్రాధాన్యత కలిగిన సంవత్సరమని, మోదీ నాయకత్వంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం రావాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. మంచి వర్షాలతో, పాడిపంటలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నామని తెలిపారు. మోదీ నేతృత్వంలో మరింత సుస్థిర, స్థిరమైన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. దేశం కోసం పనిచేస్తున్న మోదీ నాయకత్వానికి మద్దతు తెలిపి లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి పోటీచేస్తున్న బీజేపీ అభ్యర్థులందరినీ గెలిపించాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రయత్నిస్తే మంచి ఫలితమే

- క్రోధి నామ సంవత్సరంలో కేసీఆర్ ఎత్తులు ఫలిస్తాయి
- కేటీఆర్ జాగ్రత్తగా వ్యవహరిస్తే ఎన్నికల్లో పట్టు
- బీఆర్ఎస్ కార్యాలయంలో పంచాంగ పఠనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో అధికార పక్షానికి కష్టతరంగా ఉండే అవకాశం ఉందని తెలంగాణ భవన్‌లో పంచాంగ శ్రవణం సందర్భంగా పండితులు జోస్యం చెప్పారు. ప్రతిపక్షాలు ప్రయత్నిస్తే ఈ ఎన్నికల్లో విజయం పొందే అవకాశం ఉందన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. అక్కడ నిర్వహించిన పంచాంగ శ్రవణంలో పండితులు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. క్రోధి నామ సంవత్సరంలో రాజు కుజుడుగా ఉన్నాడని, శని మంత్రిగా ఉన్నాడని పండితులు తెలిపారు. కుజుడు అధిపతిగా ఉండటం వల్ల వాహన, అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయని, ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని పేర్కొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పాడి పంటలు మంచిగా పడుతాయని చెప్పారు. అయితే ధరలు అధికమవుతాయన్నారు.

ఈ ఏడాదంతా కేసీఆర్‌కు బాగుంటుంది

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాశి కర్కాటకం అని.. ఈ రాశి వారికి ఆదాయం 14, వ్యయం 2 గా, రాజపూజ్యం 6, అవమానం 6గా ఉందని తెలిపారు. గురుడు మంచి స్థానంలో ఉన్నందున ఈ సంవత్సరమంతా కేసీఆర్‌కు బాగుంటుందని తెలిపారు. కర్కాటక రాశి వాళ్లు వేసే ఎత్తుగడలు ఫలిస్తాయని, వారి నిర్ణయాలకు ప్రజాబలం లభిస్తుందన్నారు. వ్యక్తిగతంగా కూడా మంచి ప్రతిష్ఠ ఉంటుందన్నారు. వారి మాటకు, గమనానికి ఈ ఏడాది అడ్డు ఉండదని చెప్పారు. అయితే ఆరోగ్యపరంగా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



తెలంగాణ భవన్‌లో జరిగిన ఉగాది వేడుకల్లో కేటీఆర్, పోచారం, సబిత తదితరులు

అలా ఉంటే కేటీఆర్ ప్రజాభిమానాన్ని పొందుతారు

కేటీఆర్‌ది మకర రాశి అని, ఈ రాశి వారు ఏ పనిచేసినా బ్యాలెన్స్‌గా చేయాలని సూచించారు. ఈ రాశి వారికి ఆదాయం 14, వ్యయం 14 ఉందని, రాజపూజ్యం 3, అవమానం 1గా ఉందని పండితులు తెలిపారు. మాటను కట్టడి చేసుకొని మృదువుగా మాట్లాడం వల్ల , చక్కటి ఉపకారాన్ని, అభిమానాన్ని పొందగలుగుతారని అన్నారు. జాగ్రత్తగా ఉంటే ఎన్నికల్లో మంచి పట్టు సాధించే అవకాశం ఉందని పండితులు తెలిపారు.

డిపాజిట్ల నిగ్గు తేలాల్సిందే

▶ మొదటి పేజీ తరువాయి


హైకోర్టు న్యాయమూర్తి ఏకపక్షంగా ఇచ్చిన తీర్పును పక్కనపెడుతున్నామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేసు లోతుల్లోకి వెళ్లి అందరి వాదనలు వినాలని తెలంగాణ హైకోర్టుకు స్పష్టం చేసింది. సీనియర్ న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించాలని, తాజాగా విచారణ చేపట్టి ఆర్నెళ్లలో ముగించాలని హైకోర్టుకు సూచించింది. స్వీకరించిన డిపాజిట్లకు సంబంధించి పబ్లిక్ నోటీసు ఇవ్వాలని పేర్కొంది. డిపాజిట్లు వెనక్కి తీసుకోని వారి సమస్యలు విని నివేదిక ఇచ్చేందుకు జ్యుడీషియల్ అధికారిని నియమించాలని హైకోర్టుకు సూచించింది. ఉమ్మడి హైకోర్టు విభజన చివరి రోజున అందరూ హడావుడిగా ఉన్న సమయంలో జస్టిస్ రజని ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఉండవల్లి అరుణ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో పాటు మార్గదర్శి, రామోజీ దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లను అత్యున్నత న్యాయస్థానం పరిష్కరించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రూ.5 వేలు డిపాజిట్‌దారులు కోర్టుకొచ్చి పోరాడగలరా..?

ఈ సమయంలో న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుంటూ... సొమ్మంతా ఇచ్చేశారా? లేదా? ఫిర్యాదు చేశారా లేదా? అనే విషయాలు సమస్య కాదు. తీర్పులో హైకోర్టు ఏం చెప్పిందన్నదే ఇక్కడ ముఖ్యం. మొత్తం డిపాజిటర్లు ఇంత మంది ఉన్నారు.. ఇంత మొత్తం సొమ్ము ఉంది.. ఇస్తానన్న వడ్డీ, డివిడెంట్‌తో కలిపి ఇంత మొత్తం అయింది. ఆ తర్వాత సొమ్ములు ఇచ్చేశారు అనే విషయాలు తీర్పులో ఎక్కడున్నాయి? అని ప్రశ్నించారు. ఇలాంటి అంశాల్లో బయటకు రాలేని వ్యక్తుల సమస్యలు కూడా ఆలోచించాలన్నారు. రూ.5 వేలు డిపాజిట్ చేసిన వారు వేల రూపాయిలు ఖర్చు చేసి కోర్టుకు వచ్చి పోరాడగలరా? అని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న డిపాజిటర్ల గురించి హైకోర్టు పబ్లిక్ నోటీసు ఎందుకు ఇవ్వలేదో చూడాల్సిన అవసరం ఉందన్నారు.

మార్గదర్శిపై ఫిర్యాదులు లేవు...

మార్గదర్శిపై ఇప్పటి వరకూ ఫిర్యాదులు లేవని, ఇప్పుడు వస్తాయని సింఘ్వీ పేర్కొనగా.. సొమ్ములు మీవద్దే ఉంటే ఫిర్యాదు చేయడానికి ఎవరు ముందుకొస్తారని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. హైకోర్టుకు పంపడానికి ఏమీ లేదని, ఇక్కడే ఆదేశాలు ఇవ్వాలని సింఘ్వీ గట్టిగా కోరారు. ఈ సమయంలో నిరంజన్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ కొత్త పరిణామాలు ఏమీ లేకుండా ఒకసారి హైకోర్టు తోసిపుచ్చిన అంశాలతోనే క్వాష్ పిటిషన్ దాఖలు చేశారని గుర్తు చేశారు. హైకోర్టు ముందు వాదనలు జరిగిన సమయంలో తెలంగాణ నుంచి పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఒక్కరే హాజరయ్యారన్నారు. విభజన తర్వాత రెండు రాష్ట్రాలు ఏర్పడగా ఆ సమయంలో కోర్టు మాత్రం ఒక్కటే ఉందన్నారు. ఉల్లంఘనలు బయటకు రాగానే ఆ సమయంలో కొన్నాళ్లు డిపాజిట్లు నిలుపుదల చేసి మళ్లీ రూ.2,600 కోట్లు వసూలు చేశారని నిరంజన్‌రెడ్డి ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమయంలో సింఘ్వీ జోక్యం చేసుకొని ఇదంతా ప్రస్తుతం అనవసరమన్నారు.



ఏపీ ప్రభుత్వ వాదన కూడా వినాలి కదా...!

సింఘ్వీ తన వాదనలు కొనసాగిస్తూ.. ఫిర్యాదుదారు ఏపీ ప్రభుత్వం నియమించిన అ. దీకృత అధికారి కృష్ణరాజు అని, ప్రాసిక్యూట్ స్టేట్ తెలంగాణ ఒక్క ఫిర్యాదు కూడా చేయలేదన్నారు. సుప్రీంకోర్టుకు రావడానికి ఏపీ ప్రభుత్వం 1,236 రోజులు ఆలస్యం చేసిందనడంతో జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుంటూ డిపాజిటర్లు ఏపీలో కూడా ఉంటారు కదా? వారి వాదన ఆ రాష్ట్రం ద్వారానే కదా వినాలి? అని ప్రశ్నించారు. అయితే ఏపీ ప్రభుత్వం తొలుత రాలేదని సింఘ్వీ పేర్కొన్నారు. హైకోర్టు తీర్పునిచ్చే సమయంలో నిర్దిష్ట విధానాన్ని అనుసరించలేదనే విషయాన్ని తాము ప్రశ్నిస్తున్నామని జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు. కేసు పూర్వాపరాల్లోకి, లోతుల్లోకి వెళ్లడం లేదని, అందరికీ అవకాశాలు తెరిచే ఉంచుతామన్నారు. హైకోర్టులో ప్రతివాదులందరూ వాదనలు వినిపించలేదని గుర్తు చేశారు. ఈ కేసును తిరిగి హైకోర్టుకు పంపుతామని తేల్చి చెప్పారు.

హైకోర్టు కేసు లోతుల్లోకి వెళ్లలేదు...

ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ.. మీ తరపున ముగ్గురు దిగ్గజాలు (సింఘ్వీ, రోహత్గీ, లూథ్రా) ఉన్నారంటూ వ్యాఖ్యానించింది. హైకోర్టు కేసు లోతుల్లోకి వెళ్లలేదని అభిప్రాయపడింది. గతంలో జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వులను సింఘ్వీ ప్రస్తావిస్తుండగా.. అదంతా తమకు తెలుసునని, ఆ ఉత్తర్వులను పరిశీలించామని ధర్మాసనం పేర్కొంది. దీంతో ఇదేమీ సహారా, ఆమ్రపాలి తరహా కేసు కాదని, రూ.5.31 కోట్లు మినహా మిగతా సొమ్ము అంతా వెనక్కి ఇచ్చేశామని, మొత్తం 70 వేల పేజీల రికార్డు సుప్రీంకోర్టుకు అందజేశామని సింఘ్వీ పేర్కొన్నారు. మొత్తం డిపాజిటర్లు ఎంత మంది? అని ధర్మాసనం ప్రశ్నించడంతో 2.7 లక్షల మంది అని సింఘ్వీ సమాధానమిచ్చారు.

చెల్లించారో లేదో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలి..

తొలుత ముందుకు రాని ఏపీ ప్రభుత్వం సడన్‌గా ఎందుకు వచ్చిందో కూడా అర్థం చేసుకోగలమని, అయితే దానిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయబోమని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఈ కేసును తిరిగి తెలంగాణ హైకోర్టుకు పంపుతామని, అక్కడ ఏపీ ప్రభుత్వం కూడా వాదనలు వినిపిస్తుందని, విచారణ పరిధి తెలంగాణ హైకోర్టుకు ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. రూ.2,600 కోట్లు తిరిగి చెల్లించేశామని సింఘ్వీ మరోసారి ప్రస్తావించడంతో... ఈ వాదన రాష్ట్ర ప్రభుత్వం నుంచి హైకోర్టుకు నివేదించాల్సి ఉందని న్యాయమూర్తి తెలిపారు. ఉమ్మడి హైకోర్టులో తెలంగాణ వాదనే విన్నారని, అయితే హైకోర్టు ఏ ప్రక్రియ అనుసరించిందనేది పరిశీలించాలని జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. పబ్లిక్ నోటీసు కన్నా మిన్నగానే తిరిగి చెల్లింపులు చేశామని, భవిష్యత్ మార్గదర్శకాలు ఇవ్వాలని సింఘ్వీ ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఆర్‌బీఐ స్టేటస్ రిపోర్టు ఇచ్చిన అంశాన్ని ఆయన గుర్తుచేయగా.. దాన్నేం మార్చలేం కదా? ఇప్పుడు అది అప్రస్తుతం అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

ఏమున్నా తెలంగాణ హైకోర్టులోనే..

సింఘ్వీ వాదనలు కొనసాగిస్తూ.. అదృష్టమో, దురదృష్టమో రామోజీరావు ఈనాడు పబ్లిషర్ కావడంతో చాలా విషయాలను ఆయన ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. రాష్ట్రంలో ఈనాడు చాలా పాత పేపరని, ఈటీవీ కూడా ఉందన్నారు. నాలుగేళ్లుగా ఈనాడు తమపై వార్తలు రాస్తోందనే కారణంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసులో ముందుకు వచ్చిందని ఆరోపించారు. ఇదంతా హైకోర్టులో చెప్పుకోవాలని ధర్మాసనం తేల్చి చెప్పింది. తిరిగి చెల్లించాల్సిన డిపాజిట్లు రూ.5 కోట్లు మాత్రమే ఉన్నందున ఉండవల్లి పిటిషన్‌ను కొట్టివేసి, భవిష్యత్తు మార్గదర్శకాలు ఇవ్వాలని సింఘ్వీ మరోసారి కోరగా హైకోర్టు ఎదుటే చెప్పుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది.



అక్కడొద్దు.. మీరే పరిష్కారం చూపండి

ఈ సమయంలో మార్గదర్శి తరపు మరో సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ.. ఈ కేసును తెలంగాణ హైకోర్టు పంపొద్దని అభ్యర్థించారు. ఈ కేసు చాలా పాతదని, సుప్రీంకోర్టులోనే పరిష్కార మార్గం చూపాలని కోరారు. తగిన మార్గదర్శకాలు సూచిస్తూ ఆదేశాలు ఇవ్వాలన్నారు. అయితే తాము కేసు లోతుల్లోకి వెళ్లడం లేదని, నిర్దిష్ట కాలపరిమితితో కేసును పరిష్కరించాలని తెలంగాణ హైకోర్టుకు సూచిస్తామని ధర్మాసనం పేర్కొంది. అనంతరం మార్గదర్శి తరపు మరో సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా వాదనలు ప్రారంభిస్తుండగా... ఆ పిటిషన్ ఏమిటని ధర్మాసనం ప్రశ్నించింది. హైకోర్టు ఆర్డర్‌లో హెచ్‌యూఎఫ్ విషయంలో వచ్చిన తప్పును సవాల్ చేశామని లూథ్రా తెలిపారు. ఇది ప్రస్తుతం అవసరం లేదని ధర్మాసనం అభిప్రాయపడింది.

తెలంగాణ హైకోర్టు అందరి వాదనలు వినాలి..

"పిటిషన్ దాఖలులో ఏపీ ప్రభుత్వ జాప్యాన్ని మన్నిస్తున్నాం. ఉండవల్లి అరుణ్‌కుమార్ ఎస్సెల్పీ విచారణ అర్హతతోపాటు పార్టీ ఇన్ పర్సన్‌గా అనుమతిస్తున్నాం. 31.12.18న ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేస్తున్నాం. మార్గదర్శి ఫైనాన్షియర్స్ డిపాజిట్ల కేసును తెలంగాణ హైకోర్టు తిరిగి విచారించాలి. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ, ఆర్‌బీఐ, ఉండవల్లి అరుణ్‌కుమార్, రామోజీరావు, అన్‌క్లెయిమ్ డిపాజిటర్ల వాదనలు విని ఆరు నెలల్లోగా ఈ కేసును తేల్చాలి. అన్ క్లెయిమ్డ్ డిపాజిటర్ల సమస్యలు విని నివేదిక ఇచ్చేందుకు ఒక న్యాయాధికారిని నియమించాలి" అని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఎలాంటి గ్యాగ్ ఆర్డర్ ఇవ్వలేం..

కోర్టు తీర్పులపై ఏపీ ప్రభుత్వం, ఉండవల్లి అరుణ్‌కుమార్ ఇష్టారీతిన వ్యాఖ్యలు చేస్తున్నారని రామోజీరావు తరఫు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా నివేదించారు. ఏపీ ప్రభుత్వానికి సాక్షి పత్రిక ఉందని, దాంట్లో రామోజీరావుపై కథనాలు రాయకుండా నియంత్రించాలని కోరారు. ఈ దశలో నిరంజన్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ రామోజీరావుకే ఈనాడు, ఈటీవీ ఉన్నాయని కోర్టు దృష్టికి తెచ్చారు. సాక్షి పత్రికతో ఏపీ ప్రభుత్వానికి సంబంధం లేదన్నారు. తాను చట్టబద్ధంగా దీన్ని నిరూపించగలనని నిరంజన్‌రెడ్డి స్పష్టం చేశారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ఎలాంటి గ్యాగ్ ఆర్డర్‌లు ఇక్కడ ఇవ్వలేమని, కోర్టులో ఏం జరిగిందో చెప్పుకోవచ్చని, అదే సమయంలో జరగనిది చెప్పడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. కోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత ఉండవల్లి అరుణ్‌కుమార్ దాన్ని తప్పు పట్టారని లూథ్రా పేర్కొనడంతో దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. ఉండవల్లి మాజీ ఎంపీ, ప్రజా క్షేత్రంలో ఉంటారని వ్యాఖ్యానించింది. ప్రజల కోసమే ఉండవల్లి సుప్రీంకోర్టు వరకూ వచ్చారని, అదే సమయంలో కోర్టు తీర్పుపై తన అభిప్రాయాన్ని వెల్లడించి ఉంటారని పేర్కొంది. 'కోర్టు తీర్పులను కొందరు స్వాగతిస్తారు. మరికొందరు విమర్శిస్తారు. కోర్టు తీర్పులను ఒక్కొక్కరూ ఒక్కోలా చూడరాదంటూ మేం లక్ష్మణ రేఖ గీయలేం. ఈనాడు పత్రికకు ఏపీ ప్రభుత్వం వ్యతిరేకమన్న భావనతో అలా వ్యవహరించొద్దని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించలేం కదా! ప్రజాక్షేత్రంలో ఉండేవారు మీడియా ముందు అనేక విషయాలు ప్రస్తావిస్తారు. మీడియా వాటిని రాస్తుంది. ఎవరినీ నియంత్రించలేం. ఎవరి అభిప్రాయాలు వారికుంటాయి' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అదే సమయంలో ఇరు పక్షాలు కోర్టు పరిధిలో ఉన్న అంశాలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేసింది.

హైకోర్టు విభజనకు ఒక్క రోజు ముందు తీర్పు..

హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఉండవల్లి అరుణ్‌కుమార్, ఏపీ ప్రభుత్వం, మార్గదర్శి, రామోజీరావులు దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లు తాజాగా మరోసారి విచారణకు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫు సీనియర్ ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ... ఏపీ హైకోర్టు ఏర్పాటు కావడానికి ఒక రోజు ముందు అంటే 31.12.2018న మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు అనుకూలంగా ఉమ్మడి హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. అయితే మూడేళ్ల క్రితం హైకోర్టు తోసిపుచ్చిన క్వాష్ పిటిషన్‌కు, ఈ తాజా క్వాష్ పిటిషన్‌కు ఎలాంటి తేడా లేదన్నారు. కేసులో తాజాగా చోటు చేసుకున్న పరిణామాలు ఏవీ లేకున్నప్పటికీ మరోసారి క్వాష్ పిటిషన్ దాఖలు చేశారన్నారు. గతంలో హైకోర్టు తోసిపుచ్చిన అంశాన్ని దాచిపెట్టి ఈ పిటిషన్ వేశారని నివేదించారు. ఈ సమయంలో మార్గదర్శి తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ జోక్యం చేసుకొంటూ.. సేకరించిన రూ.2,600 కోట్లను 1,247 మంది డిపాజిటర్లకు 30.6.2023 నాటికి తిరిగి ఇచ్చేశారని చెప్పారు. సొమ్ము తీసుకున్న వారు కానీ, ప్రాసిక్యూషన్ స్టేట్ తెలంగాణ గానీ ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు. రూ.5.31 కోట్లు అన్ క్లెయిమ్డ్ మొత్తం మాత్రమే మిగిలి ఉందన్నారు.

కత్తితో తిరగబడాలని లూథ్రానే చెప్పారు..

ఉండవల్లి అరుణ్‌కుమార్, ఆయన తరపు న్యాయవాది అల్లంకి రమేశ్‌లు స్పందిస్తూ తాను ఎవరిపైనైనా వ్యాఖ్యలు చేసినా, ఎలాంటి పరుష పదాలు వినియోగించలేదన్నారు. రామోజీరావుకు ఏదో అయిపోవాలని ఇక్కడకు రాలేదన్నారు. ఈ సమయంలో గతంలో సిద్దార్థ లూథ్రా చేసిన ఓ ట్వీట్ (స్కిల్ కేసులో చంద్రబాబుకు బెయిల్ రాని సందర్భంలో)ను ఉండవల్లి గుర్తు చేశారు. ఎక్కడా విజయం సాధించకపోతే ప్రజలు కత్తితో తిరగబడే అవకాశం ఉందంటూ ఒకరు సామాజిక మాధ్యమంలో వ్యాఖ్యలు చేశారని తెలిపారు. తానెప్పుడూ అలా చేయలేదని లూథ్రా పేర్కొనగా నిరూపించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఉండవల్లి తెలిపారు. తాను 50 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, వ్యక్తిగతంగా విమర్శించినట్లు ఎవరూ అనలేదన్నారు. ఈ కేసు పూర్తయ్యే వరకూ ఎక్కడా, ఎవరూ, ఏమీ మాట్లాడకూడదని ఆదేశాలు ఇవ్వాలని లూథ్రా ధర్మాసనాన్ని కోరారు. దీనిపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేస్తూ అలా ఎలా ఆదేశాలు ఇవ్వగలమని ప్రశ్నించింది. ఇరు పక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఈ ఆరు నెలలు వారికి పరీక్ష లాంటిదని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ప్రజా క్షేత్రంలో ఉన్నవారిని నియంత్రించడం సాధ్యం కాదన్నారు.



ఆర్థిక ఉగ్రవాది అరాచకాలు

'మార్గదర్శి' పేరిట రామోజీ సామ్రాజ్య విస్తరణ

ఆర్‌బీఐ చట్టానికి విరుద్ధంగా డిపాజిట్ల సేకరణ

చెరుకూరి త్రిపాత్రాభినయం

ఆర్‌బీఐని బురిడీ కొట్టిస్తూ అక్రమ డిపాజిట్ల దందా

హెచ్‌యూఎఫ్ కర్త, ప్రొప్రైటర్, చైర్మన్ పేర్లతో కనికట్టు

మార్గదర్శి.. దోపిడీదారి

- అనుబంధ కంపెనీలకు నిధులు మళ్లించిన రామోజీ
- ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందన్న విచారణాధికారి

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నాలుక మడతేస్తూ నయవంచన

- గతంలో నోటికి వచ్చినట్టు వలంటీర్లను తిట్టిన టీడీపీ అధినేత చంద్రబాబు
- ఇప్పుడు ఎన్నికల సమయంలో నాలుక మడత.. ఆ వ్యవస్థను కొనసాగిస్తామంటూ కొత్త డ్రామా
- మరోవైపు.. వలంటీర్లను అదేపనిగా తిడుతున్న టీడీపీ నేతలు

జనం సొమ్ముతో గురివింద విందు!

పండిన రామోజీ పాపాలు • 'మార్గదర్శి' అక్రమ డిపాజిట్ల నిగ్గు తేలాల్సిందేనన్న సుప్రీంకోర్టు

- కేసు పునర్విచారణకు ఆదేశిస్తూ తీర్పు
- పత్రికా స్వేచ్ఛ ముసుగులో తప్పించుకోలేరని స్పష్టీకరణ
- బెడిసికొట్టిన రాజగురువు పన్నాగం
- 45 ఎస్ నిబంధనను ఉల్లంఘించి రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్ల సేకరణ
- ఉండవల్లి పిటిషన్‌లో ఇంప్లీడ్ అయిన రాష్ట్ర ప్రభుత్వం.. 'మార్గదర్శి'వి అక్రమ డిపాజిట్లే.. రామోజీ ఆర్థిక నేరస్తుడేనన్న ఆర్‌బీఐ
- ఆ కేసు కొట్టివేత చెల్లదని సుప్రీం తీర్పు



యావజ్జీవ ఖైదు... రెండింతల జరిమానా!

మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమ డిపాజిట్ల కేసులో నేరం నిరూపితమైతే రామోజీ రావుకు రెండేళ్ల నుంచి యావజ్జీవ జైలు శిక్ష పడే అవకాశం ఉందని న్యాయ నిపుణులు స్పష్టం చేశారు. దీంతోపాటు ఆయన సేకరించిన అక్రమ డిపాజిట్లు రూ.2,600 కోట్లకు రెట్టింపు జరిమానా విధించవచ్చన్నారు. దీన్నిబట్టి రామోజీకి రెండేళ్ల నుంచి యావజ్జీవ జైలు శిక్షతో పాటు రూ.5,200 కోట్ల జరిమానా చెల్లించాలని తీర్పు వెలువడే అవకాశా లున్నాయని నిపుణులు చెబుతున్నారు.

అక్రమ డిపాజిట్లే... ఆర్థిక నేరస్తుడే: ఆర్బీఐ స్పష్టీకరణ

ఆర్బీఐ చట్టం సెక్షన్ 45 ఎస్‌ను ఉల్లంఘిస్తూ మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమ డిపాజిట్లు వసూలు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి సోదాహరణంగా వివరించింది. ఆ డిపాజిట్లను ఎవరెవరికి తిరిగి చెల్లించారో వివరాలు వెల్లడించాల్సిందేనని వాదించింది. ఈ కేసు న్యాయస్థానంలో విచారణలో ఉండగానే మరో రూ.2 వేల కోట్ల వరకు అక్రమ డిపాజిట్లు సేకరించారని సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చింది. ఈ కేసులో పార్టీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా ఉండవల్లి అరుణ్ కుమార్ వాదనలు వినిపిస్తూ సెక్షన్ 45 ఎస్ కింద హెచ్‌యూఎఫ్ సంస్థలు డిపాజిట్లు సేకరించవచ్చా? లేదా? అన్నదానిపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఆర్బీఐ తరపు న్యాయవాది రమేశ్ బాబు వాదనలు వినిపిస్తూ 'ఆర్బీఐ చట్టంలోని సెక్షన్ 45 ఎస్ ప్రకారం ఇన్‌కార్పొరేటెడ్ కంపెనీలు మినహా ఇతర సంస్థలు, వ్యక్తులు డిపాజిట్లు సేకరించకూడదు. హెచ్‌యూఎఫ్ కూడా డిపాజిట్లు సేకరించడానికి వీల్లేదు. కాబట్టి హెచ్‌యూఎఫ్ పేరిట మార్గదర్శి ఫైనాన్షియర్స్ డిపాజిట్లను సేకరించడం అక్రమమే, చట్ట విరుద్ధమే. రామోజీ ఆర్థిక నేరస్తుడే 'అని తేల్చి చెప్పారు.

సాక్షి, అమరావతి: ఆర్థిక అక్రమాల ఉగ్రవాది 'ఈనాడు' రామోజీ పాపాలు పండాయి! చట్టాలంటే లెక్క లేకుండా దశాబ్దాలుగా సాగిస్తున్న ఆర్థిక అక్రమాలకు చెక్ పడింది. వ్యవస్థలను మేనేజ్ చేసి తప్పించుకునే ఎత్తుగడలు ఎల్లకాలం సాగవని రుజువైంది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) నిబంధనలకు విరుద్ధంగా సాగించిన అక్రమ డిపాజిట్ల దందా రామోజీ మెడకు చుట్టుకుంది. టీడీపీ హయాంలో చంద్రబాబు అండదండలతో 'రమణ' మంత్రంతో కనికట్టు చేసి అక్రమ డిపాజిట్ల కేసు నుంచి తప్పించుకున్నా చట్టం నుంచి తప్పించుకోలేక పోయారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమ డిపాజిట్ల కేసును కొట్టివేయడానికి వీల్లేదని, ఆ కేసును సమగ్రంగా విచారించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈనాడు పేరుతో పత్రికా స్వేచ్ఛ ముసుగులో ఈ కేసు నుంచి తప్పించుకునేందుకు రామోజీ చేసిన ప్రయత్నాలన్నీ సుప్రీంకోర్టు క్రియాశీలత ముందు వీగిపోయాయి. ఈనాడు అంటే ఆఫ్టాల్ ఒక పేపర్ మాత్రమేనని న్యాయస్థానం వ్యాఖ్యానించడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈనాడుకు వ్యతిరేకంగా ఉందన్న రామోజీ మొసలి కన్నీళ్లను కొట్టిపారేస్తూ సుప్రీంకోర్టు విప్లవాత్మకమైన తీర్పును విస్పష్టంగా వెలువరించింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమ డిపాజిట్ల దందా పూర్వాపరాలు ఇవిగో...

రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్ల సేకరణ..

నిర్భీతిగా నిబంధనల ఉల్లంఘన చట్టాలకు తాను అతీతం అన్నట్టుగా భావించే రామోజీరావు మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట బరి తెగించి ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారు. ఆర్బీఐ చట్టం 45 ఎస్ ప్రకారం ఇన్‌కార్పొరేటెడ్ కంపెనీలు మాత్రమే ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించాలి. అంతేగానీ ఇన్‌కార్పొరేటెడ్ కంపెనీలు కాని వ్యక్తులు, సంస్థలు, హిందూ అవిభక్త కుటుంబాలు(హెచ్‌యూఎఫ్)లు ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించకూడదు. ఈ నిబంధనను రామోజీ నిర్భీతిగా ఉల్లంఘించి అక్రమంగా డిపాజిట్లు సేకరించారు. 2006లో అప్పటి ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ ఫిర్యాదుతో సీఐడీ దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట రామోజీరావు 1997 నుంచి 2006 వరకు యథేచ్ఛగా అక్రమ డిపాజిట్లు సేకరించినట్లు గుర్తించడంతో మార్గదర్శి ఫైనాన్సియర్స్‌పై కేసు నమోదు చేసింది. మార్గదర్శి ఫైనాన్సియర్స్ 2006లో సమర్పించిన అఫిడవిట్ ప్రకారమే అప్పటికి రూ.2,610.38 కోట్లు అక్రమ డిపాజిట్లు సేకరించినట్లు వెల్లడైంది. హెచ్‌యూఎఫ్‌గా తాము డిపాజిట్లు సేకరించవచ్చంటూ రామోజీ చేసిన వితండ వాదాన్ని ఆర్బీఐ అప్పట్లోనే సమ్మతించలేదు. సెక్షన్ 45 ఎస్ ప్రకారం హెచ్‌యూఎఫ్‌లు ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. తన ఆర్థిక అక్రమాల వ్యవహారం బట్టబయలు కావడంతో రామోజీ అనివార్యంగా తప్పిదాలను అంగీకరించారు. డిపాజిట్‌దారులకు వారి డిపాజిట్లను తిరిగి చెల్లిస్తామని, మార్గదర్శి ఫైనాన్సియర్స్‌ను మూసి వేస్తామని ప్రకటించారు.

అక్రమ డిపాజిట్ల వివరాలు వెల్లడించం..

రామోజీ వితండవాదం... బాబు సహకారం 2006 నాటికే 32,385 మంది నుంచి రూ.2,610.38 కోట్లు డిపాజిట్లుగా సేకరించామని పేర్కొన్న రామోజీరావు 2008లో కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో తాము ఇంకా చెల్లించాల్సిన డిపాజిట్లు రూ.1,864.10 కోట్లు అని వెల్లడించారు. మరి మిగతా రూ.746.28 కోట్ల డిపాజిట్లు ఏమయ్యాయో ఆయన వెల్లడించలేదు. మరోవైపు తాము సేకరించిన డిపాజిట్లను పూర్తిగా చెల్లించేశామని 2012 తరువాత రామోజీ తాపీగా ప్రకటించారు. దీనిపై ఉండవల్లి అరుణ్ కుమార్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. డిపాజిట్లు ఎవరెవరి నుంచి ఎంతెంత సేకరించారు..? ఎవరెవరికి ఎంతెంత డిపాజిట్లు ఏఏ తేదీల్లో చెల్లించారు...? నగదు రూపంలో చెల్లించారా? చెక్కుల రూపంలో చెల్లించారా? అనే వివరాలు వెల్లడించేలా ఆదేశించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీఐడీ వాస్తవాలు ఏమిటో వెలికి తీసేందుకు ప్రయత్నించాల్సి ఉండగా నాడు అధికారంలో ఉన్న కిరణ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంగానీ, తరువాత చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ సర్కారుగానీ ఉద్దేశపూర్వకంగానే మౌనం దాల్చాయి. తద్వారా రామోజీరావు ఆర్థిక అక్రమాలకు పరోక్షంగా వత్తాసు పలికాయి. దాంతో రామోజీ తాను సేకరించిన అక్రమ డిపాజిట్ల వివరాలు చెపాల్సిన అవసరం లేదంటూ వితండవాదాన్ని వినిపించారు. తమకు ఎలాంటి క్రిమినల్ లయబులిటీ లేదని వాదిస్తూ వచ్చారు. ఈ క్రమంలో 2018 డిసెంబర్ 21న (ఉమ్మడి హైకోర్టు చివరి పనిదినాన) మార్గదర్శి ఫైనాన్సియర్స్‌పై కేసును ఉమ్మడి హైకోర్టు కొట్టివేసింది. డిపాజిటర్ల ప్రయోజనాల కోసం ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేయాల్సిన నాటి చంద్రబాబు సర్కారు ఏమీ పట్టనట్లు మౌనంగా ఉండిపోయింది. తద్వారా రామోజీ ఆర్థిక అక్రమాలకు చంద్రబాబు దన్నుగా నిలిచారు.

కేసును నిలబెట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ కేసు విషయంలో డిపాజిట్‌దారుల ప్రయోజనాలను కాపాడుతూ బాధ్యతాయుతంగా వ్యవహరించింది. మార్గదర్శి ఫైనాన్సియర్స్‌కు వ్యతిరేకంగా ఉండవల్లి అరుణ్‌కుమార్ సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌లో ఏపీ ప్రభుత్వం ఇంప్లీడ్ అయ్యింది. దీంతో ఈ కేసు నీరుగారిపోకుండా చూడగలిగింది.

చివరి రోజు విచారణ.. అదే రోజు తీర్పు

అటు తరువాత 1.1.2019న ఉమ్మడి హైకోర్టు విభజన జరిగింది. 31.12.2018న ఉమ్మడి హైకోర్టుకు చివరి రోజు. అందరూ భావోద్వేగంతో విభజన హడావుడిలో ఉన్నారు. కేసుల విచారణపై పెద్దగా దృష్టి సారించలేని పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో కృష్ణరాజు ఫిర్యాదును కొట్టేయాలంటూ రామోజీరావు దాఖలు చేసిన వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ తెల్లప్రోలు రజనీ విచారణ జరిపారు. రామోజీ తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా వాదనలు విన్న జస్టిస్ రజనీ అదే రోజు అంటే డిసెంబర్ 31న తీర్పు కూడా ఇచ్చేశారు. హెచ్‌యూఎఫ్ ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45ఎస్ పరిధిలోకి రాదని జస్టిస్ రజనీ తన తీర్పులో తేల్చేశారు. మార్గదర్శి, రామోజీరావులను ప్రాసిక్యూట్ చేయాలని కోరుతూ నాంపల్లి కోర్టులో అధీకృత అధికారి కృష్ణరాజు దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టివేస్తూ తీర్పునిచ్చారు.

'ఈనాడు'కు వ్యతిరేకంగా ఉండొద్దని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించలేం

ఎప్పటి మాదిరిగానే పత్రికా స్వేచ్ఛ ముసుగులో తన అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు రామోజీ వేసిన ఎత్తుగడను సుప్రీంకోర్టు తిప్పికొట్టింది. ఈనాడు పత్రికకు ఏపీ ప్రభుత్వం వ్యతిరేకం కాబట్టే ఈ కేసు విషయంలో ఇంత పట్టుబడుతోందని రామోజీ తరపున ప్రముఖ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, లూథ్రా, అభిషేక్‌మను సింఘ్వీలు వాదించినా ఫలితం లేకపోయింది. ఈ అంశానికి, అక్రమ డిపాజిట్లకు సంబంధం లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈనాడు పత్రికకు వ్యతిరేకంగా ఉండొద్దని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించలేం అని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక ఎన్నికలు ఉన్నందునే ఈ కేసుపై ఏపీ ప్రభుత్వం పట్టుబడుతోందన్న రామోజీ తరపు న్యాయవాదుల వాదనలతో అత్యున్నత న్యాయస్థానం సమ్మతించలేదు. 'ఎన్నికలు ఉంటే ఈనాడుకు ఏమైంది? ఈనాడు ఏమీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు కదా..? ఈనాడు కేవలం ఓ పత్రికే కదా..? ఎన్నికలతో ఏం సంబంధం?' అని న్యాయస్థానం వ్యాఖ్యానించడం గమనార్హం. దీంతో ఉండవల్లి అరుణ్ కుమార్‌పైకి నెపాన్ని నెట్టివేసేందుకు రామోజీ తరపు న్యాయవాదులు విఫలయత్నం చేశారు. ఉండవల్లి ఓ రాజకీయ నేత అని పేర్కొంటూ గతంలో హైకోర్టు తీర్పుపై వ్యతిరేక వ్యాఖ్యలు చేశారంటూ తెలుగులో ఉన్న వీడియో రికార్డులు తర్జుమా చేసి మరీ వినిపించారు. అయితే న్యాయస్థానాల తీర్పుపై విశ్లేషించవచ్చని, అదేమీ తప్పు కాదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. న్యాయస్థానాల తీర్పులపై విశ్లేషణలు జరగాలనే తాము కోరుకుంటామని తెలిపింది. ఉండవల్లి అరుణ్ కుమార్ లాంటి చదువుకున్న వ్యక్తులు విశ్లేషిస్తే మరింత మంచిదని కూడా వ్యాఖ్యానించింది. దాంతో తప్పించుకునేందుకు రామోజీ వేసిన అన్ని ఎత్తుగడలు బెడిసికొట్టాయి.



యథాభూతజ్ఞానం పొందిన వ్యక్తి దేనిలోనూ ఆత్మ లేదనీ, ఆత్మకు సంబంధించినది కూడా ఏదీ లేదనీ తెలుసుకుంటాడని బౌద్ధ ధర్మం చెబుతుంది.

– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 10 ఏప్రిల్ 2024

సుప్రీమ్ తేల్చిన ప్రత్యేక హక్కు

ఇది చరిత్రాత్మక తీర్పు. ప్రభుత్వ విధానాలపై ప్రభావం చూపగల తీర్పు. ''పర్యావరణ మార్పుల దుష్ప్రభావం నుంచి విముక్తి''ని సైతం ప్రత్యేకమైన ప్రాథమిక హక్కుగా భారత సర్వోన్నత న్యాయస్థానం తొలిసారిగా గుర్తించింది. రాజ్యాంగం కల్పించిన సమానత్వపు హక్కు (ఆర్టికల్ 14), వ్యక్తిగత స్వేచ్ఛ, జీవించే హక్కు (ఆర్టికల్ 21)ల విస్తృత పరిధిలోకే అదీ వస్తుందంటూ గత వారం సుప్రీమ్ పేర్కొనడం విశేషం. గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ (బట్టమేక పిట్ట), లెస్సర్ ఫ్లోరికాన్ (గడ్డి నెమలి) లాంటి అంతరిస్తున్న పక్షుల పరిరక్షణకు సంబంధించిన ఓ కేసు విచారణలో కోర్ట్ ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. పక్షులను కాపాడడం, పర్యావరణ పరిరక్షణ... రెండూ కీలకమైన లక్ష్యాలంటూనే, ఒకదాని కోసం మరొకదాన్ని బలి చేయకుండా సమగ్ర వైఖరిని అవలంబించడం అవసరమని స్పష్టం చేసింది. పర్యావరణ మార్పులపై ఉదాసీనంగా ఉన్న పాలకులకు బాధ్యతను గుర్తు చేసింది.

గతంలోకి వెళితే, పక్షుల రక్షణ కోసం 2021లో గుజరాత్, రాజస్థాన్‌లలోని 99 వేల చదరపు కి.మీ.ల పైగా ప్రాంతంలో ఎత్తైన విద్యుత్ లైన్లపై సుప్రీమ్ ధర్మాసనం పూర్తి నిషేధం విధించింది. సౌరఫలకాల ప్రాజెక్టుల వద్ద వేసిన ఎత్తైన వైర్లకు తగిలి పక్షులు మరణిస్తుండడంతో ఈ వివాదం రేగి, నిషేధం దాకా వచ్చింది. అయితే సౌర, పవన విద్యుచ్ఛక్తికి అవకాశం ఉన్న ప్రాంతంలో భూగర్భ విద్యుత్ కేబుళ్ళనే అనుమతిస్తే, స్వచ్ఛ ఇంధన లక్ష్యాలలో భారత్ వెనుకబడుతుందని కోర్ట్ తాజాగా భావించింది. పర్యావరణంపై ప్రపంచ ప్రయత్నాలకు అది అవరోధమనీ, పైపెచ్చు జీవించే హక్కు, సమానత్వపు హక్కు, ఇంధనం అందుబాటు లాంటి ప్రాథమిక హక్కులకు ముప్పు అనీ అభిప్రాయ పడింది. పక్షులను రక్షిస్తూనే, పర్యావరణాన్ని పరిరక్షించేలా సమతూకం పాటించడంపై దృష్టి పెట్టాలంటూ, విద్యుత్‌లైన్లపై ఏకపక్ష నిషేధాన్ని తొలగించింది. మార్చి 21న ఈ ఉత్తర్విచ్చినా శనివారం మొత్తం తీర్పును అప్‌లోడ్ చేయడంతో పర్యావరణంపై జడ్జీల విస్తృత చర్చ బయటకొచ్చింది.

ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం తన తీర్పులో భాగంగా చేసిన వ్యాఖ్యలు దీర్ఘకాలిక ప్రభావం చూపనున్నాయి. పర్యావరణ మార్పులపై భారత్‌లో చట్టం లేనంత మాత్రాన వాటి దుష్ప్రభావాల నుంచి భద్రతకు భారతీయులకు హక్కు లేదని కాదు అని కోర్ట్ కుండబద్దలు కొట్టింది. పర్యావరణ మార్పుతో సమానత్వపు హక్కుపై ఎంత ప్రభావం ఉంటుందో సోదాహరణంగా చర్చించింది. పర్యావరణ మార్పు వల్ల ఒకచోట తిండికీ, నీటికీ కొరత ఏర్పడితే ధనికుల కన్నా బీదలపై ఎక్కువ ప్రభావం చూపుతుందనీ, సమానత్వపు హక్కనే భావనే దెబ్బతింటుందనీ విశదీకరించడం విశేషం. క్లైమేట్ ఛేంజ్‌కూ, మానవ హక్కులకూ ఉన్న సంబంధాన్ని ప్యారిస్ ఒప్పందం గతంలోనే గుర్తించింది. అంతర్జాతీయ చట్టాల కింద గ్రీన్‌హౌస్ వాయువుల్ని తగ్గిస్తూనే, ఆరోగ్య వాతావరణంలో జీవించడానికి ప్రజలకున్న ప్రాథమిక హక్కును కాపాడాలని సుప్రీమ్ పేర్కొనడం కీలకాంశం.

ఇది స్వాగతించాల్సిన విషయం. ఆ మాటకొస్తే పర్యావరణ పరిరక్షణను హక్కుల కోణంలో నుంచి వ్యాఖ్యానించడం సుప్రీమ్ చాలాకాలంగా చేస్తున్నదే. కాలుష్యరహిత వాతావరణంలో బతకడమనేది జీవించే హక్కులో భాగమని దశాబ్దాల క్రితమే పేర్కొంది. స్వచ్ఛమైన నీరు, గాలి అనేవి ప్రజల హక్కు అని గత నెలలోనూ వ్యాఖ్యానించింది. తాజా తీర్పు వాటికి కొనసాగింపు. అయితే, దేశంలోని కోట్లాది ప్రజానీకాన్ని పర్యావరణ దుష్ప్రభావాల నుంచి విముక్తం చేసేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడానికి ఈ కొత్త తీర్పు అయినా పూనిక నిస్తుందా అన్నది ప్రశ్న. అసలు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణంలో బ్రతికే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. కానీ, వనరుల దుర్వినియోగం, మార్కెట్ శక్తుల ప్రకృతి విధ్వంసం, పెరిగిపోతున్న వినిమయవాదం ప్రాణాల మీదకు తెస్తోంది.

తెలిసైనా, తెలియకైనా అలా పర్యావరణ హాని చేయడమంటే మనిషి జీవించే హక్కును నిరాకరించడమే! జీవితాలనూ, జీవనోపాధినీ దెబ్బ తీస్తున్న ఈ పరిస్థితులు మానవాళి ఉనికికే ఎదురైన సవాళ్ళు. పైపెచ్చు, ధనికులతో పోలిస్తే దారితెన్నూ లేని బీదసాదలపై ఈ ప్రభావం అధికమని అందరూ అంగీకరిస్తున్నదే. ఆ పరిస్థితులు కొనసాగరాదన్నదే సుప్రీమ్ ఆదేశం అందిస్తున్న సందేశం. వర్షపాతాల్లో మార్పులు, వేళ కాని వేళ వడగాడ్పులు రాగల కాలంలో మరింత పెరగనున్నాయని ప్రపంచ సంస్థలు భారత్‌ను ఇప్పటికే హెచ్చరించాయి. హిమానీనదాలు కరుగుతున్నా, సముద్రమట్టాలు పెరుగుతున్నా, రాజధానిలోనే స్వచ్ఛమైన గాలి కరవైనా అవేవీ పాలకులకు ప్రాధాన్యాలుగా కనపడక పోవడం దౌర్భాగ్యం. ఆ తలనొప్పి విద్యావేత్తలు, ఉద్యమకారులు, పౌరసమాజ బృందాలదేనని పొరబడుతున్న వేళ సుప్రీమ్ తీర్పు చెంపపెట్టు.

పర్యావరణ పరిరక్షణను గాలికొదిలేసి, ప్రభుత్వాలు చేపడుతున్న అనేక విధానాలు ఇవాళ ప్రజల పాలిట శాపంగా మారుతున్నాయనేది నిష్ఠురసత్యం. దానికి తోడు కనీస స్పృహ లేకుండా నేల, నింగి, గాలి, నీరును కలుషితం చేయడంలో అందరం పోటీలు పడుతున్నాం. పర్యవసానాలే ఇప్పుడు చూస్తున్న అధిక ఉష్ణోగ్రతలు, అకాల వర్షాలు, ఆకస్మిక వరదలు, ఇంకా అనేకానేక పర్యావరణ దుష్ప్రభావాలు. ఈ పరిస్థితుల్లో సుప్రీమ్ గుర్తించిన ఈ ప్రత్యేక హక్కు పార్లమెంట్‌కు మేలుకొలుపు కావాలి. పర్యావరణంపై కుంభకర్ణ నిద్ర నుంచి ఇకనైనా పాలకులు మేల్కోవాలి. ప్రభుత్వాలు తక్షణమే రంగంలోకి దిగాల్సి ఉంది. వనరుల సమర్థ వినియోగంపై చర్యలు చేపట్టి, అందరిలో అవగాహన పెంచాల్సి ఉంది. లేదంటే, ఈ తాజా తీర్పు ఆసరాగా పౌరులు తమ హక్కును కాపాడుకొనేందుకు చట్టపరమైన మార్గాలను అనుసరించే వీలు ఉండనే ఉంటుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.విదియ రా.8.15 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** అశ్విని ఉ.7.11 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** సా.4.20 నుండి 5.52 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.35 నుండి 12.25 వరకు, **అమృత ఘడియలు:** రా.1.31 నుండి 3.01 వరకు

సూర్యోదయం : 5.51
సూర్యాస్తమయం: 6.10
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ఆ అనుమానాలు పోవాలంటే...

అభిప్రాయం



ఎ ఎల్ ఐ చౌగులే

ఈవీఎంలతో అక్రమాలకు పాల్పడటం అసాధ్యమని భారత ఎన్నికల కమిషన్ చెబుతోంది. కానీ వీటిపై వస్తున్న సందేహాలను నివృత్తి చేయడంలో విఫలమవుతోంది. ఎన్నికలు అక్రమాలకు తావు లేకుండా జరగడమే కాదు, జరిగినట్లు కనిపించాలి కూడా! ఎన్నికలు పారదర్శకంగా జరిగాయా లేదా అన్నది తెలుసుకునేందు సులువైన పరిష్కారం, వీవీప్యాట్ స్లిప్‌లను అందివ్వడం!! స్పష్టంగా చెప్పాలంటే... ఓటర్లు ఓ బటన్‌ను నొక్కడం ద్వారా ఓటేస్తారు. నొక్కినదానికే పడిందని నిర్ధారించే వీవీప్యాట్ స్లిప్ వీరికి భౌతికంగా అందుతుంది. ఓటరు ఈ స్లిప్‌ను సరి చూసుకుని మళ్లీ వీవీప్యాట్ బాక్స్‌లో వేయాలి. దీనివల్ల ఓట్లు రెండింటిలోనూ రికార్డు అవుతాయి. రెండింటినీ లెక్కించి, సరి చూసిన తరువాత ఫలితాలు ప్రకటించాలి.

దేశంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై ప్రకటన చేస్తూ (మార్చి 16, 2024) భారత ఎన్నికల ప్రధాన అధికారి(సీఈసీ) రాజీవ్ కుమార్ చాలా ధీమాగా ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్)లతో అక్రమాలకు పాల్పడటం అసాధ్యమని స్పష్టం చేశారు. ఈవీఎంలన్నీ ఎన్నికల ప్రక్రియ, నియమ నిబంధనలకు అనుగుణంగా ప్రత్యేకంగా డిజైన్‌చేసి తయారు చేసినవని వివరించారు. ఈవీఎం వ్యవస్థలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌తో పాటు, వోటర్ వెరిఫైయబుల్ పేపర్ ఆడిట్ ట్రెయిల్ (వీవీప్యాట్) అనే మూడు భాగాలు ఉంటాయన్నది మనకు తెలుసు. ఎన్నికలు పారదర్శకంగా జరిగాయా లేదా అన్నది తెలుసుకునేందుకూ, ఈవీఎంలపై వస్తున్న అనుమానాల నివృత్తికీ వీవీప్యాట్‌లు కీలకమవుతాయి. కానీ ఎన్నికల కమిషన్ మాత్రం ఈవీఎంల పనితీరుపై ఎలాంటి సందేహాలు అవసరం లేదని బల్లగుద్ది మరీ చెబుతోంది. ఇంకోలా చెప్పాలంటే వీటిపై అనుమానాలు రేకెత్తడమే తప్పన్న చందంగా మాట్లాడుతోంది. ఈవీఎంల వల్ల ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, వేగంగా జరుగుతుందని, వీవీప్యాట్ స్లిప్పులపై ఆధారపడాల్సిన అవసరం లేదన్నది ఎన్నికల కమిషన్ వాదనగా ఉంది.



నమ్మమంటే నమ్మాల్సిందేనా?

ఈవీఎంల దుర్వినియోగం అసాధ్యమని సీఈసీ చెబుతున్నా ఓటర్లలో చాలామందికి ఆ నమ్మకమైతే లేదు. ఈవీఎంలపై సందేహాలు వద్దు అని చెప్పేందుకు సీఈసీ తానే రాసిన ఓ ఉర్దూ ద్విపదను ఉటంకించారు. ఆరోపణలపై ఈవీఎంలే స్వయంగా స్పందిస్తే ఎలా ఉంటుందో వివరించారు. ''తీరని కోరికలకు అన్ని వేళల్లో అందరిపై దూషించడం సరికాదు. మీరేంటో మీరే నిరూపించుకోలేనప్పుడే ఈవీఎంలపై తప్పు మోపుతారు'' అన్నారు. ఈవీఎంల దుర్వినియోగం ఆరోపణలను నిర్ద్వంద్వంగా తిరస్కరించడం, 'తీరని కోరికలు'గా అభివర్ణించడంతోనే ఈవీఎంలు విశ్వసనీయమైనవి అయిపోవు. ఎన్నికలు పారదర్శకంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలన్న ఎన్నికల కమిషన్ బాధ్యత పూర్తయినట్లూ కాదు.

ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరగాలని కోరుతున్నది ప్రజాస్వామ్య వాదులు, రాజకీయ పార్టీలు, ఈవీఎం నిపుణులు. ఈవీఎంల విషయంలో పారదర్శకత లేదనీ, వాటిని నమ్మలేమనీ వీరందరూ పలు సందర్భాల్లో ముక్తకంఠంతో స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ ఈ సందేహాలను నివృత్తి చేసే ప్రయత్నం ఇప్పటివరకూ చేయలేదు. ఈ ధోరణి అనుమానాలు మరిన్ని రెకెత్తేలా చేసేందుకు మాత్రమే ఉపయోగపడుతోంది. దేశంలో పేదరికం తగ్గిపోయిందంటూ నీతి ఆయోగ్ విడుదల చేసిన సంఖ్యలను అస్సలు ప్రశ్నించకూడదన్నట్టుగా ఉంది ఎన్నికల కమిషన్ ధోరణి. దేశ జనాభాలో 11 శాతం మంది మాత్రమే దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారనీ, గడచిన తొమ్మిదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం కోరల నుంచి బయటపడ్డారనీ నీతి ఆయోగ్ చెబుతోంది. పారదర్శకత ఏమాత్రం లేని నేపథ్యంలో ఎవరైనా సరే ఎన్నికల కమిషన్ ఈవీఎంలపై చేస్తున్న ప్రకటనలను, ఇస్తున్న భరోసాలను ఎలా నమ్మగలరు?

ఎన్నికలు అందరి వ్యవహారం...

ఓటర్లు వేసిన ఓటును మార్చి చూపే అవకాశం కానీ, ఈవీఎంలు తప్పులు చేయడం కానీ అసాధ్యమని ఎన్నికల కమిషన్(ఈసీ) చెబుతోంది. కానీ చాలా కారణాల వల్ల అనుమానాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఉదాహరణకు ఈవీఎంలో పోలైన ఓట్లు, లెక్కించిన ఓట్లకు సంబంధించి 2019 సాధారణ ఎన్నికల్లో సుమారు 373 నియోజకవర్గాల గణాంకాల్లో తీవ్రమైన తేడాలున్నట్లు 'ద క్వింట్' వెబ్‌సైట్ గుర్తించింది. ఈ విషయంపై సీఈసీ, ఈసీ స్పందన నాస్తి. ఎన్నికల తరువాత ఎవరైనా అనుమానాలు వ్యక్తం చేస్తే, ఆరోపణలు చేస్తే వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌దే. తద్వారా మాత్రమే అది ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగిందన్న భరోసా సామాన్యుడికి ఇవ్వగలదు.

ఎన్నికల్లో ఓడిపోయిన వారు మాత్రమే ఈవీఎంల విశ్వసనీయతపై సందేహాలు లేవనెత్తుతారు అని సీఈసీ చేసిన వ్యాఖ్య రెండు విషయాలను సూచిస్తుంది.

మొదటిది... ఎన్నికల్లో గెలిచేందుకు తమ వంతు శ్రమ చేయని వారు చెప్పే కుంటిసాకు అని చెప్పే ప్రయత్నం. రెండోది... ఎన్నికలు కేవలం రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు మాత్రమే పరిమితమని చెప్పడం. రెండూ తప్పే. ప్రజాస్వామ్యంలో సర్వాధికారి పౌరుడే. ఈ ప్రజాస్వామ్య సర్వాధికారి సార్వభౌమత్వాన్ని తనకు నచ్చిన వ్యక్తికి దఖలు పరచడమే ఓటింగ్. ఈ పని జరగాలంటే ఎన్నికలు, ఓటింగ్ వ్యవస్థ ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు లోబడి ఉండాలి. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో, అక్రమాలకు తావు లేకుండా జరగడమే కాదు... అలా జరిగినట్లు కనిపించాలి కూడా.

అంతేకాదు... తాము వేసిన ఓటు సక్రమంగా పడిందా లేదా ఓటరుకు స్పష్టంగా తెలిసేలా ఉండాలి. ఓటింగ్, లెక్కింపు వ్యవస్థలు రెండూ కూడా ఓటరు ఎవరికి ఓటేశారో వారికే ఓటు పడిందని ధ్రువీకరించేలా పనిచేయాలి. వేసిన వెంటనే రికార్డు కావాలి. రికార్డు అయిన విధంగానే లెక్క కూడా తేలాలి. ఈవీఎం యంత్రాలపై ఈసీ నిఘా అనేది రెండు కారణాల వల్ల అంత నమ్మదగ్గదిగా అనిపించదు. మొదటిది ఈవీఎం యంత్రాలను ప్రభావితం చేయగలమని, లేదా అవసరాలకు తగ్గట్టుగా పనిచేసేలా చేయగలమన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు ఈసీ తగినంతగా ప్రయత్నించకపోవడం; ఓటర్లు, ప్రతిపక్ష రాజకీయ పార్టీల్లో ఈసీ విశ్వసనీయత అనేది అతి నిమ్న స్థాయికి చేరడం. ఇందుకు కారణాలు చాలానే ఉన్నాయి. వివక్ష లేకుండా ఎన్నికల కోడ్‌ను అమలు చేయలేకపోవడం వాటిల్లో ఒకటి మాత్రమే.

ఈవీఎంలు సక్రమంగా పనిచేయవు అనేందుకూ, నిర్దిష్ట పార్టీకి అనుకూలంగా ఓట్లు వేయించుకోవచ్చు అనేందుకూ ఆధారాలు లేవు. అక్రమాలు జరిగే అవకాశం ఉన్నంతమాత్రాన జరిగినట్లూ కాదు. కానీ సాక్ష్యం లేకపోవడం అన్నది సంఘటనే జరగకపోవడం కాదు.

వీవీప్యాట్ స్లిప్ ఇవ్వాలి!

ఎన్నికల సమయంలో వ్యవస్థలు, వనరులన్నింటిపై పెత్తనం, అధికారం ఒక పార్టీదిగా ఉంటుంది. అందుకే ఓటింగ్ ప్రక్రియ సందర్భంగా అనుమానాలు, ఆరోపణలు వస్తూంటాయి. ఈవీఎంల విషయంలో ఓటర్లు, ప్రతిపక్ష పార్టీల అతిపెద్ద ఆందోళన ఏమిటంటే... తమ ఓటు రికార్డు అయ్యిందా, లేదా అన్నది. ఈ ఆందోళనకు సులువైన పరిష్కారం ఉంది. ఓటర్లకు వీవీప్యాట్ స్లిప్‌లను అందివ్వడం. ఓటరు తాను అనుకున్న పార్టీకే ఓటు పడిందని నిర్ధారించుకుంటే ఆ స్లిప్‌ను బాక్స్‌లో మళ్లీ వేస్తాడు. స్పష్టంగా చెప్పాలంటే... ఓటర్లు ఓ బటన్‌ను నొక్కడం ద్వారా ఓటేస్తారు. ఆ తరువాత వీరికి భౌతికంగా వీవీప్యాట్ స్లిప్ అందుతుంది. ఓటరు ఈ స్లిప్‌ను సరి చూసుకుని మళ్లీ వీవీప్యాట్ బాక్స్‌లో వేయాలి. దీనివల్ల ఓట్లు రెండింటిలోనూ రికార్డు అవుతాయి. రెండింటినీ లెక్కించి సరి చూసిన తరువాత ఫలితాలు ప్రకటించాలి. గత ఏడాది డిసెంబరులో ఇండియా కూటమి కూడా ఇదే సూచన చేసింది. సుప్రీంకోర్టు విచారణలోని అంశాల్లోనూ ఇది ఉంది. వీవీప్యాట్ స్లిప్స్‌ను లెక్కించి ఫలితాలను ప్రకటించడం వల్ల ఫలితాల వెల్లడిలో కొంత జాప్యం జరగవచ్చు కానీ... ఏడు దశల్లో నెలన్నర పాటు ఎన్నికలు జరగ్గా కానీ జాప్యం ఒకట్రెండు రోజులు ఫలితాలు వెల్లడించేందుకు అయితే నష్టమేమీ ఉండదు.

వ్యాసకర్త ముంబై కేంద్రంగా పనిచేస్తున్న స్వతంత్ర జర్నలిస్టు
('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మునిగేందుకే...



ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ నుంచి గానీ, ఇంకెక్కడి నుంచైనా గానీ (ప్రియాంక గాంధీ భర్త) రాబర్ట్ వాద్రాకు కాంగ్రెస్ టికెట్ ఇవ్వడమంటే అది ఆత్మహత్యా సదృశమే!

– ప్రశాంత్ భూషణ్, న్యాయవాది

అన్నీ అక్కర్లేనివే!



నా స్నేహితుడి జీ-మెయిల్‌లో 25,000 ఈమెయిల్స్ ఉన్నాయి. 'అన్‌సబ్‌స్క్రైబ్' పదం ఉన్న అన్ని మెయిళ్లను డిలీట్ చేయడానికి అతడు ఒక ఫిల్టర్ రూపొందించాడు. ఇప్పుడు అతడి మెయిల్స్ కేవలం 100 అయ్యాయి.

– నోవా కగన్, ఆంట్రప్రెన్యూర్

పిరికి దాడి



ఏప్రిల్ 1న ఇజ్రాయెల్ చేసిన డమాస్కస్(సిరియా) దాడి... యుద్ధం, దౌత్యాలకు సంబంధించిన సాహిత్య రచనలో అత్యంత తీవ్రమైన మోసంగా లెక్కలోకి వస్తుంది. తన దౌత్య కాంపౌండులోకి దొంగతనంగా ఫైటర్లను పంపి ఇజ్రాయెల్ పిరికిపందలా దాడి చేస్తుందని ఇరాన్ ఊహించి ఉండదు.

– ఎం.కె. భద్రకుమార్, మాజీ దౌత్యవేత్త

బాగా అర్థమైనట్టుంది!



ఇరాన్ అణ్వాయుధ ప్రదేశాల మీద దాడి చేస్తామని ఇజ్రాయెల్ బెదిరించగానే, ప్రత్యక్ష దాడి నుంచి ఇరాన్ వెనక్కి తగ్గింది. డమాస్కస్‌లోని ఫైస్థాయి జనరల్ హత్యకు స్పందనగా దాడికి విముఖతతో ఉన్నట్టూ, బదులుగా పరోక్ష యుద్ధం కొనసాగించనున్నట్టూ తెహ్రాన్ చెబుతోంది. ప్రబల పరాక్రమపు భాష ఇరాన్‌కు బాగా అర్థమవుతోంది.

– ఇంతియాజ్ మహమూద్, థింకర్

మోదీ మోదీయేనా?



వైభవోపేతమైన హిందూ గతాన్ని సంఘీయులు నమ్ముతారు; మోదీకి ముందు ఒక ఆదర్శ ప్రపంచం ఉండేదని ఉదారవాదులు నమ్ముతారు. రెండూ భ్రమలే. ఈ రెండు కల్పనలూ బ్రాహ్మణీయమే. మోదీకి ముందు కాలమూ మోదీ బీజాలను మోసింది. కేవలం మోదీని ఖండించడంతో మాత్రమే సరిపెట్టని, కొత్త ఆలోచన చేయడమే ఇప్పటి సవాలు.

– హర్‌తోష్ సింగ్ బల్, సంపాదకుడు

కొత్త ప్రారంభం



అబూ ధాబీలోని బాప్స్ హిందూ మందిరాన్ని దర్శించే అవకాశం కలిగింది. అదొక సంపూర్ణమైన దివ్యానుభవం. అన్నట్టు, నవరాత్రి, గుడీ పడ్వా, ఉగాది పండుగల శుభాకాంక్షలు. ఈ శుభ సందర్భాలు మీకూ, మీ ప్రియమైనవారికీ ఆనందం, సంపద, కొత్త ప్రారంభాలను తేవాలని కోరుకుంటున్నాను.

– అక్షయ్ కుమార్, నటుడు

చివరి మనిషి



ఒక ప్రాచీన భాషను మాట్లాడే చివరి మనిషి కావడం ఎలా ఉంటుందో ఊహించగలరా? దక్షిణాఫ్రికాకు చెందిన సాన్ ప్రజలు (ప్రధానంగా వేటాడుతారు) మాట్లాడే క్వొయ్‌సాన్ భాషావర్గానికి చెందిన ఎన్‌లూ భాషను మాట్లాడే చివరి మనిషి గ్వా కట్రీనా ఎసా. ఈ భాష 25 వేల ఏళ్ల పాతది!

– జో బాసీ, ఆఫ్రికా చరిత్ర ప్రేమికుడు

పవన్ అప్పగింతలు–కుప్పిగంతులు

అభిప్రాయం



పి. విజయబాబు

పవన్ కల్యాణ్ పార్టీ వ్యవహారం కానీ, ఆయన వ్యవహార శైలి కానీ పరిశీలిస్తే బహుశా ఇలాంటి పార్టీ భారతదేశంలోనే ఎక్కడా మనకు కనిపించదేమో అనిపిస్తుంది. విచిత్రం ఏమిటంటే, ఈ మధ్యకాలంలో పార్టీని పదేళ్ల నడిపాను అంటూ తరచు మాట్లాడుతున్నారు. పార్టీ పెట్టి పదేళ్ల అయి ఉండొచ్చు కానీ పట్టుమని చెప్పుకోదగిన స్థాయిలో పది కార్యక్రమాలైనా ఉన్నాయా అంటే చెప్పడానికి ఆ పార్టీ కార్యకర్తలే తడబడతారు. ఎందుకంటే పదేళ్ల పూర్తిగా నడిపింది పార్ట్ టైం పాలిటిక్స్. పార్ట్ టైం ఉద్యోగాల గురించి విన్నాంగానీ పార్ట్ టైం రాజకీయాలను పరిచయం చేసింది మాత్రం పవన్ అనే చెప్పాలి. పోనీ ఆ పార్ట్ టైం కార్యకలాపాలైనా ఆయన నిర్వహించారా అంటే అదీ లేదు. తను జస్ట్ గెస్ట్ ఫాకల్టీ మాత్రమే!

సినిమాల్లో ఒక మాస్ హీరోలా ఎలా నటిస్తారో... అదే సంస్కృతి (ప్రక్రియ)ని రాజకీయల్లో కూడా చొప్పించి తన ఘనత చాటుకున్నారు. సినిమాలో హీరో చేసే ఫైట్లు, ఫీట్లూ అన్నీ డూప్. పాడే పాటలూ ఆయన పాడరు. కానీ ప్రేక్షకులకు హీరోనే ఇవన్నీ చేస్తాడని అనిపిస్తుంది. ఇదే ఫార్ములా రాజకీయాలకి అప్లై చేశారు పవన్ కల్యాణ్.

పార్టీని ప్రారంభించి దాని నిర్వహణ బాధ్యత నాదెండ్ల మనోహర్‌కి అప్పజెప్పారు. ప్రెస్ మీట్‌లో ఏదైనా మాట్లాడాలన్నా, విలేకరులు అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పాలన్నా నాదెండ్ల మనోహర్ ఇన్‌పుట్స్ ఇస్తే తప్ప జవాబు చెప్పలేని పరిస్థితి. ఉపన్యాసాలు ఇవ్వాలంటే ఎవరో రాసిచ్చిన ఉపన్యాసాలకు హావభావాలు జోడించడం మాత్రమే పవన్ చేసే పని.

ఫైనల్‌గా సినిమాను డిస్ట్రిబ్యూటర్‌కు అమ్మేసినట్టు పార్టీని చంద్రబాబు చేతిలో పెట్టేశారు. పార్టీ కార్యకర్తల చేతుల్లో తెలుగుదేశం జెండాలు పెట్టారు. చెప్పులేసుకుని తిరిగే వాళ్ళను చట్టసభలకు పంపిస్తానని చెప్పి వాళ్ళ చేతుల్లో చివరగా చిప్ప పెట్టి కోటీశ్వరులకు టిక్కెట్లు ఇచ్చేసుకున్నారు. పైగా తన పార్టీలో ఎవరెవరు నించోవాలి అనే నిర్ణయాధికారాన్ని కూడా చంద్రబాబుకే అప్పజెప్పేశారు. అచ్చంగా డిస్ట్రిబ్యూటర్ ఏ ఏ థియేటర్స్‌కు సినిమా రిలీజ్ చేయాలో నిర్ణయించినట్టు!

సాక్షాత్తు తను పిఠాపురంలో పోటీ చేసే చోట పట్టుమని నాలుగు రోజులు తిరిగే ఓపిక కూడా లేక ఆ బాధ్యతనూ వర్మ చేతిలో పెట్టేశారు. వాలంటీర్లను నోటికొచ్చినట్టు తిట్టి, అవ్వ తాతల్ని మండుటెండలో అష్ట కష్టాలు పెడుతూ తను మాత్రం గంట కూడా ఎండలో తిరగలేక స్పెషల్ ఫ్లైట్‌లో హైదరాబాద్ చెక్కేస్తున్నారు. ఈ విచిత్ర విన్యాసాలు, విపరీత పోకడలకు జనసైనికులే తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. వీర మహిళలైతే ఒక అడుగు ముందుకు వేసి, ''మాటలు కోటలు దాటిస్తున్నాడు. మానాభిమానాల్ని మాత్రం 'కోట'లో దాచిపెడుతున్నాడు'' అంటూ నర్మగర్భంగా టీవీ చర్చల్లోనే వ్యాఖ్యానించటం గమనార్హం!

వ్యాసకర్త పూర్వ సంపాదకులు

అడవుల్లో అగ్గిని ఆపాలంటే...

ఇటీవల కార్చిచ్చు వల్ల తగలబడిపోతున్న అడవుల వార్తలు తరచూ వింటున్నాం. విస్తృతంగా వ్యాపించే ఈ అగ్గిని ఆర్పగలిగే సామర్థ్యం, ఆధునిక పరికరాలు, సమాచార వ్యవస్థ మన అటవీశాఖ దగ్గర లేవు. అయినా పరిమిత వనరులతోనే అటవీ అధికారులు దావానలాన్ని ఆర్పివేసే ప్రయత్నం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రధానంగా గోదావరి పరీవాహక ప్రాంతంలోని దండకారణ్యం, కృష్ణా పరీవాహక ప్రాంతంలో నల్లమల అడవులు ఉన్నాయి. దండకారణ్యంలో ప్రతీ సంవత్సరం జనవరి చివరి మాసంలో అగ్గి ప్రారంభమై 14 వారాలపాటు కొనసాగి పెద్దఎత్తున అడవులు తగులబడుతూ కనిపిస్తుంటాయి. మెదక్, నిజామాబాద్ జిల్లాల్లోనూ, నల్లమలలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తూ ఉంటుంది. దీనివల్ల, ఆయా అటవీ ప్రాంతాల్లో ఎంతో విలువైన వృక్ష జాతులు, వన్య ప్రాణులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.



తెలంగాణలో 2023 మార్చి నుండి 2024 మార్చి 20 వరకు 282 అగ్గి రాజుకున్న సంఘటనలు జరిగాయని అటవీ శాఖ లెక్కలు చెబుతున్నాయి. 2001 నుండి 2022 వరకు రాష్ట్రంలో అగ్నిప్రమాదాల వల్ల దాదాపు 3.30 శాతం అడవులు అంతరించాయని లెక్కలు సూచిస్తున్నాయి.

అటవీ ప్రాంతాల్లో అగ్గి పుట్టి అడవులు ధ్వంసం కావడం మన దేశంలో అత్యధికంగా మిజోరాం, మణిపూర్, అస్సాంల అనంతరం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే అధికంగా ఉంది. మార్చి, ఏప్రిల్ మాసాల్లో అధికంగా ఈ ప్రమాదాలు నమోదవుతూ ఉంటాయి. అయితే, మన దేశంలో అత్యధికంగా మానవ కారక అగ్ని ప్రమాదాలే అధికంగా జరుగుతున్నాయి. పాశ్చాత్య దేశాల్లో మాత్రం ప్రకృతి పరమైన కారణాల వల్ల అడవుల్లో అగ్గి రాజుకుంటున్నది.

ఇక తెలంగాణ రాష్ట్రానికొస్తే, దండకారణ్య అటవీ ప్రాంతాల్లో నాణ్యమైన తునికాకు లభ్యం అవుతుంది. తునికాకు టెండర్లు పూర్తి కాగానే, తునికి చెట్లను ప్రూనింగ్ చేస్తే మరింత నాణ్యమైన ఆకు వస్తుంది. ప్రూనింగ్‌లో భాగంగా కొమ్మ కొట్టాల్సి ఉంటుంది. ఈ ప్రూనింగ్ ప్రక్రియ కొద్దిగా వ్యయంతో కూడుకున్నందున బీడీ ఆకు కాంట్రాక్టర్లు, కొందరు స్థానిక కూలీలకు డబ్బు ఎరవేసి అడవుల్లో అగ్గి పెట్టిస్తుంటారు. అడవులు తగలబడటం వల్ల జంతువులు, పక్షులు ప్రాణాలు కోల్పోతున్నాయి. చెట్లపై గుడ్లు పెట్టిన పక్షులు ఎగిరిపోగా గుడ్లు మంటలకు ఆహుతవుతున్నాయి. ఫలితంగా వాటి పునరుత్పత్తి ప్రక్రియ ఆలస్యం అవుతోంది.

కేవలం ప్రజా చైతన్యంతోనే ఈ అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చని అటవీ అధికారులు అంటున్నారు. విస్తారమైన అటవీ ప్రాంతం ఉండడం చేత ఎక్కడో మారుమూల లేదా పర్వత ప్రాంతాల్లో అగ్గి రాజుకొని అది వ్యాపిస్తూ ఉంటుంది. ఆ ప్రాంతానికి అటవీ శాఖ అధికారులు చేరుకొనేటప్పటికే నష్టం జరిగి పోతోంది. 'అటవీ, ఏజెన్సీ ప్రాంతాల ప్రజలను అడవుల్లో నిప్పు రాజుకోగానే వెంటనే ఆర్పే విధంగా వారిని చైతన్య పరుస్తున్నాం. వెంటనే అటవీ శాఖ అధికారులకు తెలియ చేయడం, గ్రామ స్థాయిలోనే అగ్గి విస్తరించకుండా స్థానిక పద్ధతుల ద్వారా ఆర్పడం వంటివి చేయిస్తున్నా'మని అటవీ అధికారులు అంటున్నారు. మరి ఈ చర్యలు ఎంత వరకు ఫలితాలనిస్తాయో చూడాలి.

– కన్నెకంటి వెంకట రమణ; జాయింట్ డైరెక్టర్, సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ

సూక్ష్మంలో మోక్షం

రోగి, రోగం, ఔషధం... ఈ మూడు అంశాలకు హోమియోపతిలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. స్వస్థత, అస్వస్థత, వ్యాధి అనేవి 'రోగ' పరంగా కాక 'రోగి'పరంగా విశ్లేషించాలి అన్నది హోమియో వైద్య మౌలిక సూత్రం. సూక్ష్మమైన హోమియోపతి గుళికతో అనితరసాధ్యమైన క్యాన్సర్ లాంటి వ్యాధుల నుండి సైతం మోక్షం కల్పించే అవకాశం ఉంది. దాదాపు రెండున్నర శతాబ్దాల క్రితం జర్మనీలో పుట్టిన డాక్టర్ శామ్యూల్ హానిమన్ కృషి ఫలితంగా పురుడు పోసుకుని ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందిన వైద్యవిధానం ఇది. హోమియోపతిలో ప్రతి వ్యక్తి కూడా భిన్నమైన వ్యక్తే. వ్యాధితో పాటు అతని వ్యక్తిత్వం కూడా ముఖ్యమే. ఉదాహరణకు అందరికీ సమస్య ఉబ్బసం లేదా ఆయాసం (ఆస్తమా) కావచ్చు, కానీ దాని వెనుక పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. వాటిని గుర్తించి, వ్యక్తిని అర్థం చేసుకొని దాని ఆధారంగా వ్యాధిని సమూలంగా నయం చేయడం ఈ విధానంలోని ప్రత్యేకత.



డా॥ శామ్యూల్ హానిమన్

రోగాన్ని తగ్గించడానికి వాడే మందు మోతాదు అతి సూక్ష్మంగా ఉండాలని ప్రతిపాదించారు హానిమన్. ఆ రకంగానే మందుల్ని తయారుచేసి వ్యాధి నివారణలు కలిగించి అద్భుత ఫలితాలు చూపించారాయన. ఔషధాల వల్ల అవాంఛనీయ దుష్ఫలితాలు తలెత్తకుండా ఉండేందుకు వాటిని ప్రత్యేక పద్ధతిలో పల్చన (ప్రొటెన్షియలైజేషన్) చేసి వాడటం మొదలు పెట్టారు.

ప్రతి పదార్థానికి భౌతిక, రసాయనిక ధర్మాలే కాక, వైద్య ధర్మాలు కూడా ఉంటాయి. ఎందుకూ పనికిరానిదిగా భావించే ఇసుక నుండి తయారు చేసిన 'సైలీషియా' హోమియోపతిలో సర్జన్‌గా పనిచేస్తుంది. మనం నిత్యం వాడుకునే ఉప్పు నుండి తయారుచేసిన 'నేట్రమ్మూర్' క్యాన్సర్‌కు సైతం మందుగా పనిచేస్తుంది.

ఒక ఔషధం ఆరోగ్యవంతునిలో ఏ వ్యాధి లక్షణాలను సృష్టిస్తుందో ఆ లక్షణాలు గల రోగికి అదే ఔషధాన్ని సూక్ష్మరూపంలో ఇచ్చినట్లయితే స్వస్థత చేకూరుతుంది. అంతేకాకుండా ఔషధ ధర్మాల నిర్ధారణకు ఆ మందులను ముందుగా మానవులపై మాత్రమే ప్రయోగించి చూడటం అన్న విధానానికి పునాది వేసింది హోమియో వైద్యం. ఇప్పుడు ఏ వైద్య విధానంలోనైనా ఒక ఔషధ తుది పరీక్షలు మనిషి మీద జరిపిన తర్వాతే మార్కెట్‌లోకి విడుదల చేయడం గమనార్హం.

– డా॥ పరికిపండ్ల అశోక్,
హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ అధ్యక్షులు
(హోమియోపతి వైద్య ప్రదాత డాక్టర్ శామ్యూల్ హానిమన్ జయంతి నేడు)

క్లుప్తంగా...

మేడిగడ్డ పిల్లర్లు ఇంకా కుంగుతున్నాయి

చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి సీపీఎం లేఖ

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డలో కుంగిన పిల్లర్లు రోజురోజుకూ మరింత కుంగుతున్నాయని సీపీఎం ఆందోళన వ్యక్తం చేసింది. వర్షాలు పడితే మరింత వేగంగా కుంగిపోయే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేసింది. అన్నారం బ్యారేజీలో బుంగ ఏర్పడిన చోట తాత్కాలికంగా పూడ్చినప్పటికీ ప్రమాదం పొంచి ఉందని,, కుంగుతున్న ఘటనలపై న్యాయవిచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరింది. గత ప్రభుత్వం కమీషన్ల కోసం ప్రైవేటు కాంట్రాక్టర్లతో కుమ్మక్కైన ఫలితమే ఇదని మండిపడింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, జి.నాగయ్య, టి సాగర్ మేడిగడ్డ, అన్నారం బ్యారేజ్‌ని రెండురోజుల కిందట సందర్శించారు. ఈ మేరకు అక్కడి సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువస్తూ లేఖ రాశారు. కాళేశ్వరం పేరుతో రీడిజైన్ చేసిన ప్రాజెక్టు భవిష్యత్ గురించి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనలు, ఇతర నిపుణుల అభిప్రాయాలు తీసుకుని అఖిలపక్షం ముందుంచాలని కోరారు. శ్రీరాంసాగర్, మానేరు, మల్లన్నసాగర్ జలాశయాలలో నీటి నిల్వల మీద పూర్తి వివరాలతో శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ప్రతీ ఎంపీ సెగ్మెంట్‌లో క్రైస్తవులతో 100 నామినేషన్లు వేయిస్తాం

నేషనల్ క్రిస్టియన్ బోర్డు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జాన్‌మాస్క్



పంజగుట్ట(హైదరాబాద్): 'కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకుండా చేయడమే ఎన్‌సీబీ లక్ష్యం. అందులో భాగంగా దేశవ్యాప్తంగా అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లో 100 మంది క్రిస్టియన్లు, పాస్టర్ల చేత నామినేషన్లు వేయిస్తాం'అని నేషనల్ క్రిస్టియన్ బోర్డు (ఎన్‌సీబీ) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జాన్ మాస్క్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఎన్‌సీబీ తమిళనాడు, ఏపీ, తెలంగాణ అధ్యక్షులు జాషువా, నవీన్‌కుమార్, డాక్టర్ సీహెచ్.సురేష్‌లతో కలిసి మాట్లాడారు. దేశవ్యాప్తంగా క్రిస్టియన్లపై దాడులు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. తాము చేస్తున్న సేవలను అడ్డుకున్నారని, మతమార్పిడి పేరుతో క్రైస్తవ సంఘాలు, పాస్టర్లపై దాడి చేస్తున్నారని, తమ ఆస్తులను ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం లేకపోవడమే కారణమన్నారు. క్రైస్తవులకు ప్రత్యేక మైనారిటీ కమిషన్, ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దళిత క్రైస్తవ దండోరా సౌత్ ఇండియా అధ్యక్షుడు రఘుముద్రి పీటర్, తెలంగాణ అధ్యక్షుడు కాశీ సతీష్ కుమార్, ఎన్‌సీబీ జాతీయకార్యదర్శి జాన్ వెస్లీ, కమిటీ సభ్యులు సంధ్య రాజ్ సామేల్, డేవిడ్‌మార్క్ తదితరులు పాల్గొన్నారు.

టీవీ 5 సాంబశివరావు పెట్రోల్ బంక్ స్వాధీనం



గచ్చిబౌలి: టీవీ 5 వైస్‌ప్రెసిడెంట్ సాంబశివరావుకు చెందిన పెట్రోల్ బంక్‌పై హెచ్‌పీసీఎల్ చర్యలకు దిగింది. ఫోర్జరీ డాక్యుమెంట్లతో పొందిన పెట్రోల్ బంక్‌ను మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. తనకు తెలియకుండా ఫోర్జరీ డాక్యుమెంట్లతో పెట్రోల్ బంక్ నడుపుతున్నారని సంధ్యా గ్రూపు ఎండీ శ్రీధర్‌రావు హెచ్‌పీసీఎల్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సాంబశివరావు, ఆయన కుటుంబసభ్యులపై మాదాపూర్ పీఎస్‌లో ఫోర్జరీ కేసు నమోదైంది. ఈ క్రమంలోనే హెచ్‌పీసీఎల్ అధికారులు పెట్రోల్ బంక్‌లోని కొంత భాగాన్ని సీజ్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా అధికారులు ఆక్రమిత బంకును స్వాధీనం చేసుకున్నారు. పెట్రోల్ బంక్‌ను కూల్చివేసి అప్పగించాల్సి ఉందని సంధ్యా గ్రూపు ప్రతినిధులు తెలిపారు.

'రేషన్' అందక.. రెండ్రోజులు నడక

ఆదివాసీల యాతన



రేషన్ బియ్యం తీసుకొని కాలినడకన వెళ్తున్న రాయపూర్(కె) ఆదివాసీలు

స్వాతంత్ర్యం సిద్ధించి దశాబ్దాలు కావస్తున్నా అనేక ఆదివాసీ గ్రామాలకు ఇప్పటికీ సరైన రోడ్డు సౌకర్యం లేదు. రేషన్ సరుకులు తెచ్చుకోవాలంటే నెత్తిన మోతలు తప్పడం లేదు. ఇందుకు ఆదిలాబాద్ జిల్లా బేల మండలం గణేష్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధి రాయపూర్(కె) గ్రామం నిదర్శనంగా నిలుస్తోంది. ఏజెన్సీ ప్రాంతంలోని ఈ గ్రామంలో 20 కుటుంబాలు ఉండగా 75 మంది వరకు జనాభా ఉంటుంది. 15 రేషన్ కార్డులు ఉన్నాయి. వీరు రేషన్ బియ్యం పొందాలంటే రెండు మూడు రోజులు పనులు వదులుకోవాల్సిందే. రెండు కిలోమీటర్ల దూరంలోని గణేష్‌పూర్ గ్రామంలోని రేషన్ దుకాణం నుంచి వీరు సరుకులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఈ రెండు గ్రామాల మధ్య రోడ్డు సౌకర్యం లేకపోగా.. మార్గమధ్యలో ఓ వాగు సైతం ఉంటుంది. దీంతో రేషన్ బియ్యం కోసం ప్రతినెలా ఇలా తిప్పలు తప్పడం లేదు. సిగ్నల్ సమస్య కారణంగా వీరు ముందుగా సోన్‌ఖాస్ గ్రామానికి వెళ్లి బయోమెట్రిక్ నమోదు చేసుకోవాలి. ఇందుకోసం రెండు కిలోమీటర్లు కాలినడకన, మూడు కిలోమీటర్లు ఆటోలో ప్రయాణం చేయాల్సి ఉంటుంది. మరుసటి రోజు గణేష్‌పూర్‌కు కాలినడకన వెళ్లి రేషన్ బియ్యం తీసుకుని రావాల్సిందే. ఎండ, వానకు అవస్థలు పడుతూ బియ్యాన్ని నెత్తిపైనే మోసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఈ విషయమై తహసీల్దార్ సవాయిసింగ్‌ను సంప్రదించగా.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

– బేల/సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



ఆలయంలో పూజ చేస్తున్న సీఆర్పీఎఫ్ అధికారులు

'అడవి రాముడి'కి నవ వసంతం

- 2003లో రామ మందిరానికి తాళం వేసిన మావోయిస్టులు
- సీఆర్పీఎఫ్ చొరవతో దండకారణ్యంలో తెరుచుకున్న గుడి తలుపులు
- శ్రీరామ నవమి పూజలకు గ్రామస్తుల ఏర్పాట్లు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలోని సుక్మా జిల్లా మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో మూతబడిన ఒక రామాలయం తలుపులు సీఆర్పీఎఫ్ అధికారుల చొరవతో 21 ఏళ్ల అనంతరం తెరుచుకున్నాయి. సుక్మా జిల్లాలోని చింతల్‌నార్ పోలీస్‌స్టేషన్ పరిధి మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన కేరళపొంద గ్రామంలో పురాతన రామమందిరం ఉంది. ఆ గుడిలో గ్రామస్తులు ప్రతిరోజూ పూజలు నిర్వహించేవారు. దీనిపై ఆగ్రహించిన మావోయిస్టులు 2003 సంవత్సరంలో గుడి మూసేసి తాళాలు వేశారు. అప్పటి నుంచి ఆలయం నిరాదరణకు గురైంది. మావోయిస్టుల భయంతో స్థానికులు ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి ఎదురైంది. అయితే, కేరళపొంద గ్రామంలో నెల రోజుల క్రితం సీఆర్‌పీఎఫ్ క్యాంపు నిర్మించారు. ఈ క్రమంలో అధికారులు తరచుగా గ్రామస్తులతో సమావేశమై సమస్యలు తెలుసుకుంటుండగా.. 21 ఏళ్లుగా తెరుచుకోని రామాలయ అంశం బయటపడింది. అయితే, తమకు తాముగా గుడి తెరిస్తే మావోయిస్టులు ఇబ్బంది పెడతారని గ్రామస్తులు చెప్పడంతో సీఆర్‌పీఎఫ్ అధికారులు చొరవ తీసుకుని మంగళవారం ఆలయాన్ని తెరిచారు. 74వ బెటాలియన్‌కు చెందిన అధికారులు, జవాన్లతో పాటు గ్రామస్తులు ఆలయంతో పాటు చుట్టుపక్కల ప్రదేశాలను శుభ్రం చేశారు. ఈ రామమందిరంలో సీతారామలక్ష్మణుల విగ్రహాలు సుందరంగా ఉన్నాయని, గుడి శిఖరంపై ఆంజనేయస్వామి విగ్రహం ఉందని పోలీసులు తెలిపారు. గుడి తలుపులు తెరుచుకోవడంతో గ్రామస్తులు సంతోషంతో నృత్యం చేశారు. ఇక నుంచి ప్రతిరోజూ పూజలు చేస్తామని, ఈ ఏడాది శ్రీరామనవమి కూడా ఘనంగా నిర్వహిస్తామని గ్రామస్తులు వెల్లడించారు.

రోడ్డు స్వరూపం మార్చేశారు!

- తన పాత విల్లా వెంచర్‌లోని ప్రైవేటు రోడ్డు అక్రమంగా పబ్లిక్ రోడ్డుగా మార్పిడి
- కొత్త వెంచర్‌కు దగ్గరి రోడ్డు మార్గం కోసం టీడీపీ నేత శివానందరెడ్డి బరితెగింపు
- సమీపంలోని నాలాపై అనుమతి లేకుండానే వంతెన సైతం నిర్మాణం
- బాధిత నివాసితుల ఫిర్యాదుతో కేసు నమోదు
- కేసు కొట్టివేత కోసం హైకోర్టుకెక్కిన శివానందరెడ్డి.. తోసిపుచ్చిన న్యాయస్థానం
- చేసేది లేక జీహెచ్‌ఎంసీకి తాను సమర్పించిన రివైజ్డ్ ప్లాన్ రద్దు చేయాలని దరఖాస్తు



పిస్తోందని వెస్సెల్లా మెడోస్ నివాసితులు చెబుతున్నారు.

సాక్షి, హైదరాబాద్: రాజధాని హైదరాబాద్ శివార్లలోని బుద్వేల్‌లో దళితులకు చెందాల్సిన 26 ఎకరాల భూమి కబ్జా చేశారనే కేసులో నిందితుడిగా ఉన్న తెలుగుదేశం పార్టీ నేత, మాజీ పోలీసు అధికారి మాండ్ర శివానందరెడ్డి అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఆయన కొత్తగా వేస్తున్న వెంచర్ కోసం గతంలో నిర్మించిన విల్లాల్లోని ప్రైవేటు రోడ్డు పబ్లిక్ రోడ్డుగా స్వరూపం మార్చేశారు. అలాగే ఓ నాలాపై అనుమతుల్లేకుండానే వంతెన నిర్మించారు. ఈ అక్రమాలపై రామ్‌దేవ్‌గూడలోని వెస్సెల్లా మెడోస్ నివాసితులు గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదై దర్యాప్తు మొదలవడంతో దిగివచ్చిన శివానందరెడ్డి... తన తప్పులు సరిదిద్దుకొనేలా జీహెచ్‌ఎంసీకి మరో దరఖాస్తు చేశారు. ఈ వ్యవహారం మొత్తంలో అధికారుల ఉదాసీనత, శివానందరెడ్డి లాబీయింగ్ స్పష్టంగా కని

కొత్త వెంచర్‌కు రోడ్డు లేక...

మాండ్ర శివానందరెడ్డి సీఈఓగా ఉన్న వెస్సెల్లా గ్రూప్ రామ్‌దేవ్‌గూడ ప్రధాన మార్గంలో తారామతి–బారాదరి ఎదురుగా 38 ఎకరాల్లో వెస్సెల్లా మెడోస్ పేరుతో 295 త్రీ, ఫోర్, ఫైవ్ బీహెచ్‌కే విల్లాలు నిర్మించడానికి 2017లో జీహెచ్‌ఎంసీ నుంచి అనుమతి తీసుకుంది. అప్పట్లో ఈ విల్లాస్ లోపల రెండు అంతర్గత ప్రైవేటురోడ్లు ఉండేలా రూపొందించిన ప్లాన్‌కే అధికారులు అనుమతి ఇచ్చారు. కొన్నాళ్ల క్రితం వెస్సెల్లా గ్రూప్ పాత వెంచర్‌కు వెనుక వైపు నాలా పక్కన మరో 9 ఎకరాల్లో మరో వెంచర్ మొదలుపెట్టింది. ప్రధాన రహదారి నుంచి ఈ వెంచర్‌కు చేరుకోవాలంటే సమీప మార్గం లేదు. ఈ నేపథ్యంలోనే శివానందరెడ్డి మరో కుట్రకు తెరలేపారు. వెస్సెల్లా మెడోస్‌లో ఉన్న రెండు ప్రైవేట్ రహదారుల్లో ఒకదాన్ని పబ్లిక్ రోడ్డుగా అక్రమంగా మార్చేశారు. ఈ మేరకు రివైజ్డ్ ప్లాన్‌తో 2022లో జీహెచ్‌ఎంసీకి దరఖాస్తు చేసుకున్నారు. దీన్ని అధికారులు ఆమోదించడంతో వెస్సెల్లా మెడోస్‌లోని ప్రైవేట్ రోడ్డు పబ్లిక్ రోడ్డుగా మారిపోయి వెనుక ఉన్న 9 ఎకరాల వెంచర్‌ను ప్రధాన రహదారికి దగ్గర చేసింది. ఈ రెండు వెంచర్ల మధ్య ఓ నాలా ఉండటంతో ఇరిగేషన్ విభాగం సహా ఎవరి అనుమతి లేకుండానే ఆయన దానిపై వంతెన నిర్మించారు.

బాధితుల ఫిర్యాదుతో వెలుగులోకి..

వెస్సెల్లా మెడోస్ శాంక్షన్ ప్లాన్‌కు విరుద్ధంగా తమ ప్రైవేటు రోడ్డును పబ్లిక్ రోడ్డుగా శివానందరెడ్డి మార్చేసినట్లు నివాసితులకు ఈ ఏడాది ఫిబ్రవరిలో తెలిసింది. దీంతో 6 విల్లాలకు చెందిన యజమానులు గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా ఐపీసీలోని 420, 406 సెక్షన్ల కింద అదే నెల 8న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసు నమోదు కాకుండా చూసేందుకు శతవిధాలా శివానందరెడ్డి ప్రయత్నించినప్పటికీ ఉన్నతాధికారుల జోక్యంతో కేసు నమోదై దర్యాప్తు ప్రారంభం కావడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించి క్వాష్ పిటిషన్ వేశారు. తనపై కేసు కొట్టేయాల్సిందిగా కోరారు. దీనికి అంగీకరించని న్యాయస్థానం... నిందితులకు సీఆర్పీసీ 41ఏ కింద నోటీసులు ఇచ్చి విచారించి కేసు దర్యాప్తు కొనసాగించాలని స్పష్టం చేసింది. దీంతో గత్యంతరం లేక శివానందరెడ్డి వెస్సెల్లా మెడోస్‌కు సంబంధించి తాను సమర్పించిన రివైజ్డ్ ప్లాన్‌ను రద్దు చేయాలంటూ జీహెచ్‌ఎంసీకి మరో దరఖాస్తు సమర్పించినట్లు తెలిసింది. కాగా, జీహెచ్‌ఎంసీ అధికారులను మోసం చేసి తప్పుడు సమాచారం ఇచ్చినందుకు ఈ కేసులో శివానందరెడ్డిపై పోలీసులు అదనపు సెక్షన్లు జోడించాలని వెస్సెల్లా మెడోస్ నివాసితుడు ఒకరు 'సాక్షి'తో మాట్లాడుతూ కోరారు.

రూ. 2 వేల కోట్ల భూములపై సర్కార్‌కు హైకోర్టు నోటీసులు

నిషేధిత భూముల జాబితా నుంచి 36 ఎకరాల తొలగింపుపై వివరణకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలంలో దాదాపు రూ. 2 వేల కోట్ల విలువ చేసే 36 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించి ప్రైవేటు కంపెనీలకు అప్పగించడంపై వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు అశోక్‌కుమార్ అనే సామాజిక కార్యకర్త వేసిన పిల్‌పై విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం ఆదేశాలిచ్చింది. తదుపరి విచారణ వాయిదా వేసింది. 1960లలో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం సౌత్ ఇండియా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 36 ఎకరాలు కేటాయించిందని... ఆ తర్వాత కాలంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అభ్యంతరంతో ఆ భూములను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిందని పిటిషనర్ పేర్కొన్నారు. కానీ 2021లో ఆ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అధికారాలు లేకున్నా చట్ట విరుద్ధంగా ఉత్తర్వులిచ్చారని ఆరోపించారు. దీంతో భూములను సౌత్ ఇండియా రీసెర్చ్ ఇన్‌సిట్యూట్‌తోపాటు మరికొన్ని సంస్థలకు ప్రభుత్వం కేటాయించగా ఆ సంస్థలు తిరిగి వాటిని ఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా అండ్ డెవలపర్స్, వాసవీ గ్రూప్‌కు రిజిస్ట్రేషన్ చేశాయన్నారు. దీంతో పారిశ్రామిక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఆ సంస్థలు హౌసింగ్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాయని పిటిషనర్ తరఫు న్యాయవాది వల్లపు రామ్మోహన్‌రెడ్డి కోర్టు దృష్టికి తెచ్చారు.

చాక్లెట్లా? మందులా..?

▶ మొదటి పేజీ తరువాయి

అధ్యయనం చేసింది. ఇందులో 55% ప్రిస్క్రిప్షన్లు మాత్రమే నిబంధనల మేరకు ఉన్నాయని, 45% ప్రిస్క్రిప్షన్లలో నిబంధనల ఉల్లంఘన జరిగిందని నిర్ధారించింది. 9.8% ప్రిస్క్రిప్షన్లలో పూర్తిగా నిబంధనల ఉల్లంఘన జరిగిందని స్పష్టం చేసింది. జనరల్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, ఆప్తమాలజీ, ఈఎన్‌టీ, సైకియాట్రీ, ఆర్థో, ఛాతీ, డెంటల్, సూపర్ స్పెషాలిటీలకు చెందిన అన్ని విభాగాల్లో డాక్టర్లు రాసిన ప్రిస్క్రిప్షన్లలో నిబంధనల అతిక్రమణ జరుగుతోంది. ఐసీఎంఆర్ అధ్యయనం చేసిన ప్రిస్క్రిప్షన్లు రాసిన వారిలో పీజీ విద్యార్థులు మొదలు నాలుగు నుంచి 18 ఏళ్ల అనుభవం ఉన్న వైద్యులు కూడా ఉన్నారు. పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్రిస్క్రిప్షన్లలో సగటున నాలుగు మందులు అనవసరంగా రాసినట్లు పరిశోధనలో గుర్తించారు.

జలుబుకు ఇన్ని మందులా..!

సాధారణ జలుబుకు కూడా డాక్టర్లు ఇష్టారాజ్యంగా మందులు రాసేస్తున్నారు. ఐసీఎంఆర్ నివేదిక ప్రకారం.. జలుబు, తేలికపాటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్లకు సంబంధించి మాంటెలూకాస్ట్+లివోసెట్రిజిన్, పారాసిటమాల్, డెక్స్‌ట్రోమెతార్ఫాన్, రాబిప్రజోల్+డోమ్‌పెరిడోన్ ఈ నాలుగు మందులు అధికంగా వాడుతున్నారు. ఇందులో మాంటెలుకాస్ట్+లివోసెట్రిజిన్, రాబిప్రజోల్+డోమ్‌పెరిడోన్ మందులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయి. వీటిని అనవసరంగా రాస్తున్నారు. ఈ రెండు నిషేధిత జాబితాలో కూడా ఉన్నాయి. వీటివల్ల ఖర్చు పెరుగుతుంది. పైగా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, బీపీ, షుగర్, మలేరియా, కీళ్ల నొప్పులు, మైగ్రెయిన్, కడుపులో మంట, అజీర్తి, పిప్పిపళ్లు, చెవిపోటు, టీబీ, పోస్ట్ కోవిడ్‌కు సంబంధించిన జబ్బుల్లో అత్యధికంగా నిబంధనల అతి క్రమణ జరుగుతోంది. అజిత్రోమైసిన్, ర్యాంటిడిన్, ట్రిప్సిన్ వంటివి కూడా ఎక్కువగా దుర్వినియోగం అవుతున్నాయి. ప్రిస్క్రిప్షన్లలో వీటిని ఎడాపెడా రాసేసుస్తున్నారు. చెవికి, శ్వాసకోశానికి ఒకేరకమైన మందులు వాడుతున్నారు.

నొప్పి మందులతో పాటు అసిడిటీ మందులు ఎందుకు?

నొప్పి మందుల వల్ల అసిడిటీ వచ్చే అవకాశం ఉంది. అయితే ఎసిడిటీ రిస్క్ ఉన్న వారికే ఆయా మందులు రాయాలి. కానీ అందరికీ రాస్తున్నారు. దీనివల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తున్నాయి. తేలికపాటి ఆహారం తీసుకుంటే సరిపోయే వారికి కూడా అసిడిటీ మందులు రాస్తున్నారు. అసిడిటీకి సంబంధించి పాంటోప్రాజోల్, రాబిప్రజోల్+డోంపెరిడోన్ అనే మందులు అత్యంత దుర్వినియోగానికి గురవుతున్నాయి. 21.9% ప్రిస్క్రిప్షన్లు అనవసరంగా రాసినట్లు నిర్ధారించారు.

రియాక్షన్లు.. దుష్ప్రభావాలు

కీళ్ల నొప్పులకు రాస్తున్న సెరాసోపెప్టిడేజ్ అనే మందు పనిచేస్తుందో లేదో స్పష్టత లేదని ఐసీఎంఆర్ తేల్చింది. కర్ణభేరి ఇన్ఫెక్షన్లకు వాడే సెఫిక్జిమ్ ముడిసిన్ మొదటి ప్రాధాన్య మందు కాదు. కానీ అధికంగా వాడేస్తున్నారు. బీపీ, శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల మందులను అనవసరంగా రాస్తున్నారు. ఇవి నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయి. ఆయా మందులు వాడటం వల్ల మందుల ఖర్చు పెరుగుతుంది. డ్రగ్‌రియాక్షన్లకు కారణమవుతున్నా యి. కాంబినేషన్‌లో రెండు మూడు మందులు రాయడం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తుంటాయి.

డోసులు ఎక్కువ తక్కువ!

నిబంధనల అతిక్రమణలో మందులు అధికంగా, అనవసరంగా రాయడమే కాదు...డోసులు తక్కువ లేదా ఎక్కువ ఉండటం కూడా జరుగుతోంది. మందులు ఎన్ని రోజులు వాడాలి, రోజుకు ఎన్నిసార్లు వాడాలన్న దానిపైనా ప్రిస్క్రిప్షన్లు సరిగా ఉండట్లేదు. ఫార్ములేషన్‌లో తప్పులు జరుగుతున్నట్లు నిర్ధారించారు. డయాబెటిక్ మందులు, హార్మోన్ మందులు, రక్తాన్ని పలుచన చేసే మందులు ఎక్కువగా దుర్వినియోగం అవుతున్నాయి. బీపీ, షుగర్, ఫిట్స్ రోగాలకు వాడే మందుల్లో సరైన కాలపరిమితిపై స్పష్టత ఇవ్వడం లేదు.

> **డాక్టర్లకు అవగాహన కల్పించాలి**
>
> ప్రజలు వైద్యం కోసం పెట్టే ఖర్చులో 40% మందులకే వెచ్చిస్తున్నారు. మందుల వినియోగం శాస్త్రీయంగా జరగాలి. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 344 మందుల కాంబినేషన్లను నిషేధిత జాబితాలో చేర్చింది. వీటిపై డాక్టర్లకు పూర్తి అవగాహన కల్పించాలి. ఐసీఎంఆర్ తీసుకువచ్చిన స్టాండర్డ్ ట్రీట్‌మెంట్ గైడ్‌లైన్స్ కేవలం వెబ్‌సైట్‌కే పరిమితం అవుతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ నిబంధనలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలి.
>
> – డాక్టర్ కిరణ్ మాదల, ప్రభుత్వ బోధనా వైద్యుల జాతీయ అనుసంధానకర్త

సిరిసిల్లలో వస్త్రోత్పత్తికి ఓకే

మంత్రి పొన్నం హామీతో 45 రోజుల సంక్షోభానికి తెర




సిరిసిల్ల/కరీంనగర్ కార్పొరేషన్: సిరిసిల్లలో వస్త్రోత్పత్తి తిరిగి ప్రారంభించేందుకు జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. 45 రోజులుగా నెలకొన్న సంక్షోభంతో కార్మికులకు పనిలేకుండా పోయింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సోమవారం సాయంత్రం వస్త్రోత్పత్తిదారులు, ఆసాములు, కార్మిక నాయకుల జేఏసీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు రూ.350 కోట్లు దశల వారీగా సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు అందిస్తామని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. నేత కార్మికులకు రావాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీ డబ్బు రూ.18 కోట్లు విడుదల చేయిస్తామన్నారు. ఎస్ఎస్ఐ యూనిట్లు ఎదుర్కొంటున్న విద్యుత్ సబ్సిడీ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. దీంతో వస్త్రోత్పత్తిని ప్రారంభించేందుకు యజమానులు ముందుకొచ్చారు.

నేత కార్మికులపై బీజేపీ, బీఆర్‌ఎస్ శవరాజకీయం

గత ప్రభుత్వం ఇచ్చిన బతుకమ్మ ఆర్డర్‌ల కన్నా తమ ప్రభుత్వం పది శాతం ఎక్కువే ఇస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్‌స్పష్టం చేశారు. మంగళవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ నేత కార్మికుల శవాలపై బీజేపీ, బీఆర్‌ఎస్ రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు.

నేతన్నల పోరాటంతోనే ప్రభుత్వం కదిలింది: బండి



కరీంనగర్‌టౌన్: సిరిసిల్ల వస్త్రపరిశ్రమను ఆదుకోవడానికి రాష్ట్రప్రభుత్వం ముందుకు రావడం సంతోషకరమని, వస్త్ర పరిశ్రమ ఆసాములు, నేతన్నల ఐక్యపోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చిందని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్చిన మాటకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి బతుకమ్మ చీరల ఉత్పత్తికి సంబంధించి పాత బకాయిలు రూ. 270కోట్లు చెల్లించాలని కోరారు.

ఇంగ్లిష్ స్పీకింగ్‌లో ఉచిత శిక్షణ

'మేధా ఇన్‌స్టిట్యూట్'ఫౌండర్ చిరంజీవి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్కారీ స్కూళ్లలో ప్రాథమిక విద్య నుంచీ ఇంగ్లిష్ మీడియాన్ని అందుబాటులోకి తేవటం ప్రశంసనీయమని 'మేధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్'వ్యవస్థాపకుడు, చీఫ్ కోచ్ డాక్టర్ ఎ.చిరంజీవి అభిప్రాయపడ్డారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా ఏ రంగంలోనైనా ఇంగ్లిష్‌పై పట్టున్న వారికే అవకాశాలు మెరుగ్గా ఉంటున్నాయని చెబుతూ..... ఆసక్తి ఉన్నవారి కోసం తమ సంస్థ ఉచితంగా ఇంగ్లిష్ స్పీకింగ్ కోర్సును అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. ''మా ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేసి 30 సంవత్సరాలవుతున్న సందర్భంగా ఈజీ ఇంగ్లిష్ కార్యక్రమాన్ని తలపెట్టాం. ఆన్‌లైన్లో ఉచితంగా అందజేస్తాం''అని చెప్పారాయన. ఈజీ ఇంగ్లిష్ ద్వారా స్పోకెన్ ఇంగ్లిష్ మాత్రమే కాకుండా దాదాపు 9 రకాల అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలియజేశారు. ఈనెల రెండో వారం నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. ''ఈ కోర్సుకు ఆసక్తి ఉన్న ఎవరైనా రిజిస్టర్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ కోసం దిగువ ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుంటే చాలు. వారి మొబైల్‌కు రిజిస్ట్రేషన్ లింకు వస్తుంది. లేనిపక్షంలో 98660 06662 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా వివరాలు పంపినా వారి మొబైల్ ఫోన్‌కు లింకును పంపిస్తాం''అని వివరించారు. అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగుతుందని, ఆ తర్వాత తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు.

వడదెబ్బతో ఇద్దరు మృతి

మిర్యాలగూడ అర్బన్: నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో వడదెబ్బతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్యామల పెంటయ్య (70), బండి అడవయ్య (65) కొద్ది రోజులుగా ఎండ వేడి ఎక్కువ కావడంతో వడదెబ్బ తగిలి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో స్థానికంగా చికిత్స అందించినా ఫలితం లేకపోవడంతో పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందారు.

విజిలెన్స్ డీజీ రాజీవ్ రతన్ హఠాన్మరణం

గుండెపోటుతో మృతిచెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి

- ప్రస్తుతం మేడిగడ్డ బ్యారేజీపై విజిలెన్స్ విచారణకు ఆయన నేతృత్వం
- ఈ ఏడాది సెప్టెంబర్‌లో పదవీ విరమణ చేయాల్సిన రాజీవ్ రతన్
- ఆయన మృతిపై గవర్నర్ రాధాకృష్ణన్, సీఎం రేవంత్‌రెడ్డి, పోలీసు అధికారుల సంతాపం... నేడు రాయదుర్గంలోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు



రాజీవ్ రతన్ (ఫైల్)

సాక్షి, హైదరాబాద్/గచ్చిబౌలి: సీనియర్ ఐపీఎస్ అధికారి, తెలంగాణ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ (డీజీ) రాజీవ్ రతన్ (59) హఠాన్మరణం చెందారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడలోలో ఉంటున్న ఆయనకు మంగళవారం ఉదయం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి ఉదయం 7:20 గంటలకు తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పంజాబ్‌కు చెందిన రాజీవ్ రతన్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. సమర్థుడిగా, నిజాయితీగల అధికారిగా పేరుతెచ్చుకున్న ఆయన ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో లోపాలపై ఏర్పాటు చేసిన విజిలెన్స్ విచారణకు సారథ్యం వహిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఆయన రిటైర్ కావాల్సి ఉంది. సహచర ఐపీఎస్ ఆకస్మిక మరణవార్త తెలియగానే డీజీపీ రవి గుప్తా, రైల్వే, రోడ్డు భద్రత అదనపు డీజీ మహేష్ ఎం. భగవత్, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, రాచకొండ సీపీ తరుణ్ జోషి తదితరులు హుటాహుటిన ఏఐజీ ఆసుపత్రికి చేరుకొని శ్రద్ధాంజలి ఘటించారు. ఇంటెలిజెన్స్ అదనపు డీజీ శివధర్‌రెడ్డి, ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ తదితర అధికారులు సంతాపం తెలిపారు. ఆయన పార్థివదేహాన్ని ఏఐజీ ఆస్పత్రిలోనే భద్రపరిచారు. బుధవారం ఉదయం రాయదుర్గంలోని మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు జరుగుతాయని పోలీసు వర్గాలు వెల్లడించాయి.

వివిధ హోదాల్లో ఉద్యోగ బాధ్యతలు...

1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన రాజీవ్ రతన్ డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీలో చదివారు. క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చే అధికారి. ఆయన కామారెడ్డి అదనపు ఎస్పీగా, విశాఖపట్నం అదనపు ఎస్పీ (ఆపరేషన్స్)గా, ఎస్పీగా, కరీంనగర్, హైదరాబాద్ రీజియన్లకు ఐజీగా, ఐటీబీపీ కమాండింగ్ అధికారిగా, అగ్నిమాపక శాఖ డీజీగా, అదనపు డీజీపీ (ఆర్గనైజేషన్)గా, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా పనిచేశారు. గతంలో డీజీపీగా మహేందర్‌రెడ్డి రిటైరయ్యాక ఆ పోస్టుకు రాజీవ్ రతన్ పేరు సైతం ప్రముఖంగా వినిపించింది.

గవర్నర్, సీఎం సంతాపం

రాజీవ్ రతన్ ఆకస్మిక మృతిపై గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ప్రగాఢ సంతాపం తెలిపారు. పోలీస్ అధికారిగా దశాబ్దాలపాటు ఆయన రాష్ట్రానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. రాజీవ్ రతన్ హఠాన్మరణంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి... సుదీర్ఘకాలంగా రాష్ట్రంలో పోలీసు విభాగానికి ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. సమర్థంగా, నిజాయితీగా విధులు నిర్వహించిన అధికారులను తెలంగాణ సమాజం ఎన్నటికీ మరిచిపోదన్నారు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. రాజీవ్ రతన్ అకాల మరణంపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజీపై విచారణ చేపట్టి ఇటీవలే ఆయన ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని గుర్తుచేసుకున్నారు.


అడవిని జయించేదెవరో?

ఛత్తీస్‌గఢ్‌లో హోరాహోరీ | ఆదినుంచీ బీజేపీ ఆధిపత్యమే | ఈసారి చెక్ పెట్టే యత్నాల్లో కాంగ్రెస్

స్టేట్ స్కాన్

పుడమి తల్లికి పచ్చని కోక చుట్టినట్టు అపార అటవీ సంపదతో అల రారే రాష్ట్రం ఛత్తీస్‌గఢ్. దేశంలోకెల్లా మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉండటం, సగం భూభాగం దట్టమైన అడవులే కావడంతో ఇక్కడ ఎన్నికల నిర్వహణ కత్తిమీద సామే. 2000 సంవత్సరంలో మధ్యప్రదేశ్ నుండి విడిపోయిన ఈ రాష్ట్రంలో ఆది నుంచీ జాతీయ పార్టీలదే హవా. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ నువ్వానేనా అన్నట్లు తలపడుతున్నా లోక్‌సభకు వచ్చేసరికి తొలినుంచీ కాషాయ జెండాయే ఎగురుతోంది. హిందీ బెల్టు రాష్ట్రాల్లో బీజేపీకి కంచుకోటగా నిలుస్తున్న ఛత్తీస్‌గఢ్‌లో ఈసారి ఎలాగైనా సత్తా చాటాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది...

– సాక్షి, నేషనల్ డెస్క్



ఏకంగా ఏడు రాష్ట్రాలతో సరిహద్దులు పంచుకుంటున్న ఛత్తీస్‌గఢ్‌పై బీజేపీ, కాంగ్రెస్ ఈ లోక్‌సభ ఎన్నికల్లో గట్టిగా ఫోకస్ పెట్టాయి. 2019లో బీజేపీ మొత్తం 11 సీట్లలో పోటీ చేసి 9 స్థానాలను దక్కించుకుంది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2004లో జరిగిన తొలి లోక్‌సభ ఎన్నికల నుంచి 2014 వరకు కమలనాథులు ప్రతిసారీ పదేసి సీట్లు నెగ్గి హ్యాట్రిక్ కొట్టారు. కాంగ్రెస్ ఒకే సీటుతో సరిపెట్టుకుంటూ వచ్చింది. ఆ లెక్కన గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక సీటు అదనంగా దక్కింది. కానీ 2023 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గద్దె దించిన బీజేపీ ఈసారి రెట్టించిన ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది. రాష్ట్రంలోని 11 లోక్‌సభ స్థానాల్లో 4 ఎస్టీలకు కేటాయించారు.



సర్వేల ఓటు ఎవరికి?

ఎప్పట్లాగే ఈ లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఛత్తీస్‌గఢ్‌లో కాషాయదళానికి తిరుగు లేదని అనేక సర్వేలు కుండబద్దలు కొడుతున్నాయి. బీజేపీకి 10 సీట్లు దక్కుతాయని, కాంగ్రెస్ ఒక్క స్థానానికే పరిమితం కావచ్చని చెబుతున్నాయి. 11 సీట్లనూ కమలనాథులే క్లీన్ స్వీప్ చేయొచ్చని కూడా మరికొన్ని సర్వేలు అంచనా వేయడం విశేషం.

కాంగ్రెస్‌కు చావో రేవో

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని బలంగా ఢీకొడుతున్న కాంగ్రెస్, లోక్‌సభ ఎన్నికలకు వచ్చేసరికి మాత్రం తేలిపోతోంది. 2000 సంవత్సరంలో కాంగ్రెస్ నేత అజిత్ జోగి ఛత్తీస్ తొలి సీఎంగా గద్దెనెక్కారు. 2003లో కొత్త రాష్ట్రంలో జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి అధికారం దక్కింది. అయినా 2014 దాకా విపక్ష నేతగా జోగి చక్రం తిప్పారు. కానీ పార్టీ వ్యతిరేక కార్యకలాపాల ఆరోపణలపై జోగి, ఆయన కుమారుడు అమిత్ 2014లో కాంగ్రెస్ నుంచి ఉద్వాసనకు గురయ్యారు. దాంతో పార్టీకి జనాకర్షణ ఉన్న నాయకుడు లేకుండా పోయారు. జనతా కాంగ్రెస్ ఛత్తీస్‌గఢ్ (జేసీసీ) పేరుతో జోగి వేరుకుంపటి పెట్టుకున్నా పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ, బీఎస్పీలతో జట్టు కట్టినా జేసీసీకి 5 సీట్లే దక్కాయి. జనం అనూహ్యంగా కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. సీఎంగా ఐదేళ్లు కొనసాగిన బఘేల్ సంక్షేమ పథకాలతో ప్రజలకు చేరువయ్యారు. అయినా 2019 లోక్‌సభ ఎన్నికల్లో 9 సీట్లతో దుమ్ము రేపిన బీజేపీ, తాజాగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ను కంగుతినిపించి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది.

ఒంటరి పోరే

అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం నేపథ్యంలో లోక్‌సభ పోరులో ఎలాగైనా పుంజుకోవాలన్న భావిస్తున్న కాంగ్రెస్ జాతీయ మ్యానిఫెస్టోలోని ఆరు న్యాయాలు, 25 గ్యారంటీలను గట్టిగా ప్రచారం చేస్తోంది. బెట్టింగ్ స్కామ్‌లో చిక్కుకున్న మాజీ సీఎం బఘేల్ రాజ్‌నందగావ్ నుంచి బరిలో ఉన్నారు. పలు రాష్ట్రాల్లో విపక్ష ఇండియా కూటమిలోని పార్టీలతో సీట్ల సర్దుబాటు చేసుకుంటున్న కాంగ్రెస్ ఛత్తీస్‌గఢ్‌లో ఒంటరిగానే బరిలోకి దిగుతోంది.

బీజేపీ గిరిజన పాచిక

లోక్‌సభ ఎన్నికల్లో ఛత్తీస్‌గఢ్‌లో తిరుగులేని ఆధిక్యం ప్రదర్శిస్తున్న బీజేపీ 2018లో రాష్ట్రంలో తొలిసారి అధికారాన్ని కోల్పోయింది. ముఖ్యంగా గిరిజనులు అత్యధికంగా ఉండే సర్గుజా ప్రాంతంలో ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పూర్తి ఆధిపత్యం కనబరిచింది. 2023 అసెంబ్లీ పోరులో మాత్రం అక్కడ మెజారిటీ సీట్లు బీజేపీ పరమయ్యాయి. రాష్ట్రంలో 32 శాతమున్న ఎస్టీలకు బీజేపీ ఏకంగా 29 సీట్లు కేటాయించి 17 చోట్ల గెలుపొందింది. ఈ దృష్ట్యా గిరిజనులకు మరింత చేరువయ్యేలా కాషాయ పార్టీ ఈసారి వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. 15 ఏళ్లు సీఎంగా చేసిన రాజ్‌పుత్ వర్గానికి చెందిన రమణ్ సింగ్‌ను కాదని విష్ణుదేవ్ సాయ్ రూపంలో తొలిసారి ఓ గిరిజన నేతను సీఎంను చేసింది. రాష్ట్ర పార్టీ అధ్యక్షునిగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా పని చేసిన విష్ణుదేవ్‌కు 2019లో బీజేపీ ఎంపీ టికెట్ కూడా ఇవ్వకపోవడం విశేషం.

మోదీ, మందిరం, అభివృద్ధి...

ఈ ఎన్నికల్లో అయోధ్య రామమందిర కల సాకారం, మోదీ చరిష్మా, పదేళ్ల బీజేపీ పాలనలో దేశవ్యాప్తంగా సాధించిన అభివృద్ధి వంటి అంశాలను ప్రచారాస్త్రాలుగా సంధిస్తోంది బీజేపీ. కాంగ్రెస్‌కు చెందిన మాజీ సీఎం భూపేశ్ బఘేల్ హయాంలో భారీ బెట్టింగ్ స్కామ్ జరిగిందంటూ కమనాథులు తమ ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. దాదాపు రూ.5,500 కోట్ల మహాదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ కుంభకోణంలో రూ.508 కోట్లు బఘేల్‌కు అందాయనే ఆరోపణలతో బీజేపీ కొత్త సర్కారు ఆయనపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేసింది! మోదీ ఇప్పటికే రాష్ట్రంలో పలు ఎన్నికల ర్యాలీల్లో పాల్గొని బీజేపీ ప్రచార పర్వానికి ఊపు తెచ్చారు.

హస్తంలో కమల వికాసం..



ఎన్నికల విచిత్రం

ఉత్తరాఖండ్‌లో డెహ్రాడూన్‌కు చెందిన బీజేపీ మహిళా మోర్చా కార్యకర్తలు పార్టీ పేరు, గుర్తు, ఎన్నికల నినాదాలతో మంగళవారం ఇలా వినూత్నంగా మెహందీ పెట్టుకున్నారు

తారలోకచోట... మెరుపులు మరోచోట

స్వరాష్ట్రంలో టికెటిచ్చేందుకు ఆసక్తి చూపని పార్టీలు | బయటి రాష్ట్రాల్లోనే నేతలుగా రాణిస్తున్న భోజ్‌పురి తారలు

ఎలక్షణీయం

వాళ్లంతా భోజ్‌పురీ సినీ పరిశ్రమను తిరుగు లేకుండా ఏలిన, ఏలుతున్న తారలు. వెండితెరపై కనిపించారంటే విజిళ్లు, క్షీరాభిషేకాలే. అయితే వారిపట్ల ఈ వీరాభిమానమంతా భోజ్‌పురీ సినిమాలకు పుట్టిల్లయిన బిహార్, పొరుగు రాష్ట్రం జార్ఖండ్‌లకే పరిమితం. వాళ్లు స్థానికంగా ఎంతగా వెలిగినా బాలీవుడ్, తెలుగు తదితర సినీ పరిశ్రమల్లోనే విలన్లుగా, క్యారెక్టర్ ఆర్టిస్టులుగా నటించడం ద్వారానే దేశవ్యాప్తంగా ఫేమ్‌లోకి వచ్చారు. రాజకీయ రంగస్థలం పైనా ఇదే సీన్ రిపీటవుతోంది. భోజ్‌పురీ తారలెవరూ వారి స్వరాష్ట్రమైన బిహార్లో పెద్దగా ఉనికి చాటలేకపోతున్నారు. కారణాలేవైనా వారిని అక్కడినుంచి బరిలోకి దింపేందుకు పార్టీలు అంతగా ఆసక్తి చూపడం లేదు. దాంతో ఇతర రాష్ట్రాల నుంచి పోటీ చేసి మాత్రమే వాళ్లు లోక్‌సభలో అడుగు పెడుతున్నారు...


నటుడు రవికిషన్


నటుడు మనోజ్ తివారీ

భోజ్‌పురీ నటీనటులకు, వారి స్వరాష్ట్రమైన బిహార్‌కు రాజకీయంగా ఎప్పుడూ చుక్కెదురే. పొరుగు రాష్ట్రాలకో, సుదూరాలకో వెళ్లి మాత్రమే రాజకీయాల్లో రాణిస్తున్నారు. పలు తెలుగు సినిమాల్లో విలన్‌గా రాణించిన భోజ్‌పురీ సూపర్‌స్టార్ రవికిషన్ 2014 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఉత్తరప్రదేశ్ నుంచి అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. కానీ జౌన్‌పూర్ లోక్‌సభ స్థానంలో బరిలో దిగిన ఆయన ఘోర ఓటమి చవిచూసి ఆరో స్థానంలో నిలిచారు. అనంతరం బీజేపీలో చేరి 2019 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలోని గోరఖ్‌పూర్ నుంచి 3 లక్షల ఓట్ల పై చిలుకు భారీ మెజారిటీతో నెగ్గారు. ఈసారి కూడా అక్కడినుంచే బరిలోకి దిగుతున్నారు. మరో ప్రముఖ భోజ్‌పురీ నటుడు మనోజ్ తివారీ అయితే ఏకంగా ఢిల్లీని తన రాజకీయ కర్మభూమిగా మార్చుకున్నారు. బిహార్లోని కైమూర్ జిల్లా అతర్వాలియా గ్రామానికి చెందిన ఆయన ఈశాన్య ఢిల్లీ బీజేపీ సిట్టింగ్ ఎంపీ. ఈసారి కూడా అక్కడినుంచే పోటీలో ఉన్నారు. భోజ్‌పురీ నట గాయకుడు దినేశ్‌లాల్ యాదవ్ పరిస్థితీ అంతే. గత లోక్‌సభ ఎన్నికల్లో యూపీలోని ఆజంగఢ్ నుంచి నెగ్గిన ఆయన ఈసారీ అక్కడి నుంచే పోటీలో ఉన్నారు. మరో భోజ్‌పురీ గాయకుడు పవన్ సింగ్‌కు కూడా ఈసారి పశ్చిమబెంగాల్‌లోని అసన్‌సోల్ నుంచి బీజేపీ టికెటివ్వగా రెండు రోజులకే ఆయన అనూహ్యంగా బరి నుంచి తప్పుకున్నారు. బిహారీ బాబుగా ప్రసిద్ధుడైన బాలీవుడ్ దిగ్గజం శత్రుఘ్న సిన్హా గతంలో రెండుసార్లు బిహార్‌లోని పాట్నా సాహిబ్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ తరఫున గెలిచినా 2019లో టికెట్ దక్కకపోవడంతో పశ్చిమ బెంగాల్ వలస వెళ్లారు. అసన్‌సోల్ లోక్‌సభ స్థానం నుంచి తృణమూల్ కాంగ్రెస్ తరఫున గెలిచారు. ఈసారీ అక్కడి నుంచే పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న ఇంటర్నెట్ సంచలనం, భోజ్‌పురీ గాయని నేహా సింగ్ రాథోడ్‌కు ఈసారి ఢిల్లీ నుంచి టికెట్ ఇస్తారంటున్నారు.


శత్రుఘ్న సిన్హా

గుంజన్.. ఒకే ఒక్కడు

ఈ లోక్‌సభ ఎన్నికల్లో భోజ్‌పురి సినీ పరిశ్రమకు సంబంధించి బిహార్ నుంచి పోటీ చేస్తున్నది గుంజన్ కుమార్ ఒక్కరే. అయితే ఈ భోజ్‌పురీ/మగధీ గాయకుడు తన స్వస్థలమైన నవడా నుంచి ఇండిపెండెంట్‌గా బరిలో దిగుతున్నారు. ''అన్ని ప్రధాన పార్టీలనూ సంప్రదించా. ఎవరూ టికెటివ్వకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నా'' అని వాపోతున్నారాయన! భోజ్‌పురి నటులు, గాయకులకు బిహార్‌లో లోక్‌సభ టికెటివ్వడానికి ప్రధాన పార్టీలు వెనకా ముందాడుతున్న మాట వాస్తవమేనని భోజ్‌పురి గాయకుడు వినయ్ బిహారీ అంటున్నారు. ఆయన బిహార్‌లోని పశ్చిమ చంపారన్ జిల్లా లౌరియా ఎమ్మెల్యే. 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున విజయం సాధించారు. కానీ ఏ పార్టీ కూడా టికెటివ్వకపోవడంతో 2010లో తొలిసారి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాల్సి వచ్చింది. ''ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందిన భోజ్‌పురీ భాషకు బిహార్లోనే తగిన గౌరవం లభించడం లేదు. బహుశా అందుకే భోజ్‌పురీ నటీనటులు, గాయకులకు ఇతర రాష్ట్రాల నుంచే తప్ప స్వరాష్ట్రంలో పోటీ చేసే అవకాశం దక్కడం లేదు. రాబోయే రోజుల్లో పరిస్థితులు మారతాయేమో!' అన్నారు. భోజ్‌పురీ నటీనటులు, గాయకులకు బీజేపీ మున్ముందు కచ్చితంగా బిహార్ నుంచి అవకాశమిస్తుందని తనకు నమ్మకముందని రవికిషన్ చెప్పుకొచ్చారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

మహారాష్ట్ర ఎంవీఏలో సీట్ల పంపిణీ ఖరారు

శివసేన(యూబీటీ)కి 21, కాంగ్రెస్‌కు 17, ఎన్సీపీ(ఎస్పీ)కి 10 స్థానాలు

ముంబై: మహారాష్ట్రలో ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) పక్షాల మధ్య లోక్‌సభ ఎన్నికల సీట్ల పంపిణీ ఖరారైంది. 48 స్థానాలకు శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) అత్యధికంగా 21 సీట్లలో, కాంగ్రెస్ 17, ఎన్సీపీ (శరద్‌పవార్) 10 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. మొదట్నుంచీ కాంగ్రెస్ పట్టుబడుతున్న సాంగ్లి, భివాండీల్లో శివసేన(యూబీటీ), ఎన్సీపీ(ఎస్పీ) చెరో చోటు నుంచి బరిలోకి దిగనున్నాయి. ఏకాభిప్రాయంతోనే సీట్ల పంపిణీ కుదిరిందని ఎన్సీపీ(ఎస్పీ)చీఫ్ శరద్ పవార్ స్పష్టం చేశారు. బీజేపీని మట్టి కరిపించడమే కూటమి లక్ష్యమని శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే చెప్పారు. దాని సాధనకు విశాల దృక్పథంతో వ్యవహరించాలని తాము నిర్ణయించుకున్నట్లు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలె చెప్పారు. ఒకట్రెండు రోజుల్లోనే అభ్యర్థులను ప్రకటిస్తామని వారు చెప్పారు. రాష్ట్రంలో ఏప్రిల్ 19 నుంచి మొదలుకొని ఐదు విడతలుగా లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి.

ఈ ఏడాది సాధారణ వర్షపాతమే!

ప్రైవేట్ వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా



న్యూఢిల్లీ: దేశంలో ఈ ఏడాది సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని ప్రైవేట్ వాతావరణ అంచనాల సంస్థ 'స్కైమెట్' మంగళవారం వెల్లడించింది. ఈ ఏడాది వర్షాకాలంలో మొదటి అర్ధభాగంతో పోలిస్తే రెండో అర్ధభాగంలో ఎక్కువ వర్షాలు కురుస్తాయని తెలియజేసింది. జూన్ నుంచి సెప్టెంబర్ దాకా.. నాలుగు నెలలపాటు లాంగ్-పీరియడ్ యావరేజ్(ఎల్‌పీఏ) 868.6 మిల్లీమీటర్లు కాగా, ఇందులో 96 శాతం నుంచి 104 శాతం వర్షపాతం నమోదైతే సాధారణ వర్షపాతంగా పరిగణిస్తారు. ఈసారి 102 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లుస్కైమెట్ అంచనా వేసింది. దక్షిణ, పశ్చిమ, వాయువ్య భారతదేశంలో తగినంత వర్షాలు పడతాయని వెల్లడించింది. బిహార్, జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో లోటు వర్షపాతం నమోదవుతుందని తెలియజేసింది. ఈశాన్య రాష్ట్రాల్లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురుస్తాయని ఉద్ఘాటించింది. ఇండియాలో 2023లో ఎల్ నినో పరిస్థితుల కారణంగా సగటు కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. అంతకంటే ముందు వరుసగా నాలుగు సంవత్సరాలు సాధారణం, సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిశాయి. ఎల్ నినో క్రమంగా లా నినాగా మారుతోందని, దీని వల్ల వర్షపాతం మెరుగవుతుందని స్కైమెట్ ఎండీ జతిన్ సింగ్ చెప్పారు.

ఎలక్షన్ బీట్

రెండో దశ బరిలో 1,210 మంది

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల రెండో దశ ఎన్నికల్లో 1,210 మంది అభ్యర్థులు పోటీకి సిద్ధమయ్యారు. 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 88 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఈ నెల 26న పోలింగ్ జరుగనుంది. ఈ 88 స్థానాల్లో పోటీ కోసం 2,633 నామినేషన్లు దాఖలుకాగా పరిశీలన అనంతరం 1,428 నామినేషన్లు చెల్లుబాటు అయ్యేవిగా గుర్తించారు. ఏప్రిల్ 8వ తేదీతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో ఔటర్ మణిపూర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి నలుగురు అభ్యర్థులతో పాటు 12 రాష్ట్రాలు, యూటీల నుంచి 1,206 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. రెండో దశ పోలింగ్‌లో కేరళలోని 20 నియోజకవర్గాలకు 500 నామినేషన్లు, కర్ణాటకలోని 14 స్థానాలకు 491 నామినేషన్లు దాఖలయ్యాయి. త్రిపురలో ఒక ఎంపీ స్థానానికి కనిష్టంగా 14 నామినేషన్లు రాగా మహారాష్ట్రలోని నాందేడ్ సీటుకు గరిష్టంగా 92 నామినేషన్లు దాఖలయ్యాయి.

హేమమాలినిపై వ్యాఖ్యలు.. సుర్జేవాలాకు ఈసీ నోటీస్

న్యూఢిల్లీ: బీజేపీ ఎంపీ హేమ మాలిని పట్ల అమర్యాదకర, అసభ్యకర వ్యాఖ్యలు చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ నేత రణదీప్ సుర్జేవాలాకు ఎన్నికల కమిషన్ మంగళవారం నోటీసిచ్చింది. బహిరంగ వేదికలపై మహిళల గౌరవాన్ని కాపాడేలా ప్రసంగించాలంటూ తాము పంపిన మార్గదర్శకాలను కాంగ్రెస్ నేతలు పాటించేలా తీసుకున్న చర్యలను వివరించాల్సిందిగా ఆ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గేను సైతం కోరింది. ఈ నెల 11వ తేదీ సాయంత్రంలోగా స్పందించాలని సుర్జేవాలాకు, మరుసటి రోజు సాయంత్రం వరకు ఖర్గేకు గడువిచ్చింది. కాంగ్రెస్ నేతలు పదే పదే ఉల్లంఘనలకు పాల్పడుతుండటంపైనా ఈసీ సీరియస్‌గా ఉంది.

బీఎస్పీ అభ్యర్థి మృతి.. బేతూల్‌లో ఎన్నిక వాయిదా

బేతూల్ (మధ్యప్రదేశ్): మధ్యప్రదేశ్‌లోని బేతూల్ లోక్‌సభ నియోజకవర్గ బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) అభ్యర్థి అశోక్ భలావి హఠాన్మరణం చెందారు. దీంతో, అక్కడ ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. అశోక్ గుండె పోటుకు గురయ్యారని, ఆస్పత్రికి వచ్చే సమయానికే ఆయన తుదిశ్వాస విడిచినట్లు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. అశోక్ భలావి మృతితో బేతూల్‌లో ఈ నెల 26న జరగాల్సిన ఎన్నికను వాయిదా వేసినట్లు జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి నరేంద్ర సింగ్ రఘువంశీ తెలిపారు.

రామున్ని అవమానించిన కాంగ్రెస్

- రామాలయ నిర్మాణాన్ని అడ్డుకొనేందుకు యత్నించింది
- అభివృద్ధిని అడ్డుకోవడానికి నన్ను బెదిరిస్తున్నారు
- ప్రతిపక్ష నేతలపై మోదీ ధ్వజం
- యూపీ, మధ్యప్రదేశ్, తమిళనాడుల్లో ప్రచారం



పిలిభిత్/భోపాల్: అయోధ్యలో భవ్య రామ మందిర నిర్మాణాన్ని నిలిపివేయడానికి ప్రతిపక్ష కాంగ్రెస్ ఎన్నో ప్రయత్నాలు చేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. అయినా దేశ ప్రజలు రూపాయి రూపాయి కూడబెట్టి అద్భుతమైన ఆలయం నిర్మించుకున్నారని చెప్పారు. ఆలయ నిర్వాహకులు పెద్ద మనసుతో క్షమించి, ప్రాణప్రతిష్టకు హాజరు కావాలని కోరుతూ ఆహ్వానం పంపిస్తే కాంగ్రెస్ దాన్ని తిరస్కరించిందని, తద్వారా శ్రీరాముడిని అవమానించిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమానికి హాజరైన నేతలను కాంగ్రెస్ నుంచి ఆరేళ్ల పాటు బహిష్కరించారని తప్పుపట్టారు. మంగళవారం ఉత్తరప్రదేశ్‌లోని పిలిభిత్, మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్, తమిళనాడు రాజధాని చెన్నైలో సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. బహిరంగ సభల్లో ప్రసంగించారు. బుజ్జగింపు రాజకీయాల్లో కాంగ్రెస్ పూర్తిగా కూరుకుపోయిందని, అందులో నుంచి ఎప్పటికీ బయటకు రాలేదని విమర్శించారు. బుజ్జగింపు రాజకీయాల రుణం తీర్చుకోవడానికే పౌరసత్వ సవరణ చట్టాన్ని(సీఏఏ) కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ వ్యతిరేకిస్తున్నాయని ధ్వజమెత్తారు. రాముడిని పూజించిన వారిని కాంగ్రెస్ నుంచి బహిష్కరించారని, ఇదెక్కడి పైత్యం? అని ధ్వజమెత్తారు. ఇలాంటి పాపం చేసినవారిని ప్రజలు క్షమించబోరని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. దేశ ప్రజలు ఆరాధించే 'శక్తి'ని కాంగ్రెస్ పార్టీ కించపర్చిందని ప్రధాని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. శక్తి ఎదుట మనం తల వంచి నమస్కరిస్తుంటామని, అలాంటి శక్తిని కూలదోయాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిస్తున్నారని ఆక్షేపించారు. ఆ నాయకులను శక్తి ఎప్పటికీ క్షమించదని అన్నారు. మన దేశానికి చెందిన గొప్ప వ్యక్తులను ఇండియా కూటమి నేతలు అవమానించారని విమర్శించారు. గుజరాత్‌లోని సర్దార్ వల్లభ్ భాయి పటేల్ ఐక్యతా విగ్రహాన్ని విపక్ష నేతలు దర్శించలేదని చెప్పారు. వారికి విదేశాల్లో గడపానికి సమయం ఉంటుంది గానీ ఐక్యతా ప్రతిమను దర్శించడానికి సమయం లేదా? అని నిలదీశారు. ప్రపంచ దేశాలు నేడు ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నాయని, అయినప్పటికీ అనుకున్న లక్ష్యం సాధించడం సాధ్యమేనని ప్రపంచ దేశాలకు భారత్ చాటి చెబుతోందని ప్రధానమంత్రి వెల్లడించారు. దేశ ప్రజల ఓటుతోనే ఇది సాధ్యమవుతోందని పేర్కొన్నారు.

మహాకాలుడి భక్తుడిని.. ఎవరికీ భయపడను

దేశ అభివృద్ధిని అడ్డుకోవడానికి ప్రతిపక్ష నాయకులు తనను దూషిస్తున్నారని, బెదిరింపులకు గురి చేస్తున్నారని నరేంద్ర మోదీ ఆరోపించారు. అవినీతిపరులను రక్షించడమే ఇండియా కూటమి లక్ష్యంగా మారిపోయిందన్నారు. దేశ భద్రతకు గ్యారంటీ ఇచ్చినప్పుడు తిట్టారని, ఆర్టికల్ 370ని రద్దు చేసినప్పుడు దూషించారని, అయోధ్యలో రామాలయ ప్రాణ ప్రతిష్ట చేసినప్పుడు అనరాని మాటలు అన్నారని విపక్ష నేతలపై మండిపడ్డారు. తాను మహాకాళుడి భక్తుడినని, ఎవరికీ భయపడనని తేల్చిచెప్పారు. 'న్యూ ఇండియా'ను నిర్మించడానికి రాబోయే ఎన్నికలు మనకు ఒక మిషన్ అని ప్రజలకు సూచించారు. ప్రధానమంత్రిగా తన మూడో టర్మ్‌లో అతిపెద్ద, చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకోబోతున్నానని, ఇందుకు ప్రజల ఆశీర్వచనాలు కావాలని కోరారు. చెన్నైలో మోదీ రోడ్ షోకు జనం భారీగా తరలివచ్చారు. ఉత్తరప్రదేశ్‌లోని పిలిభిత్‌లో ప్రచారానికి సిట్టింగ్ ఎంపీ వరుణ్ గాంధీ, ఆయన తల్లి మేనకా గాంధీ హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇక్కడ వరుణ్ గాంధీ స్థానంలో జితిన్ ప్రసాదను బీజేపీ రంగంలోకి దింపడం తెలిసిందే.

కేజ్రీవాల్ అరెస్టు సబబే

ఢిల్లీ హైకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తనను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపిస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. కేజ్రీవాల్ అరెస్టు విషయంలో చట్టాల ఉల్లంఘన జరగలేదని తేల్చిచెప్పింది. అరెస్టు సబబేనని పేర్కొంది. ఆయనను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కస్టడీకి అప్పగించడం కూడా చట్టవిరుద్ధం కాదని స్పష్టంచేసింది. తనను అరెస్టు చేసి, ఈడీ కస్టడీకి అప్పగించడాన్ని సవాలు చేస్తూ కేజ్రీవాల్ గతవారం దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ మంగళవారం తీర్పు వెలువరించారు. కేజ్రీవాల్‌ను అరెస్టు విషయంలో తగిన సాక్ష్యాధారాలు ఈడీ వద్ద ఉన్నాయన్నారు. ఆయనను ఈడీ కస్టడీకి అప్పగిస్తూ ట్రయల్ కోర్టు జారీ చేసిన ఉత్తర్వును సమర్థించారు. తదుపరి విచారణ కోసం కేజ్రీవాల్‌ను ఈడీ అదుపులోకి తీసుకోవడం చట్టబద్ధమేనని స్పష్టం చేశారు. ''చట్టం అందరికీ సమానంగా వర్తిస్తుంది. ముఖ్యమంత్రికి ఒక చట్టం, సామాన్యులకు మరో చట్టం ఉండదు. ముఖ్యమంత్రికి ప్రత్యేక హక్కులుండవు. కోర్టులు రాజ్యాంగ నైతికతను పాటిస్తాయి తప్ప రాజకీయపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవు. ఈ కేసు కేంద్ర ప్రభుత్వానికి, కేజ్రీవాల్‌కు మధ్య కాదు. ఇది కేజ్రీవాల్‌కు, ఈడీకి మధ్య సాగుతున్న వ్యవహారం'' అన్నారు. ఈ తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్తామని ఆప్ నేత, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ వెల్లడించారు.

చైనా అంగుళం కూడా ఆక్రమించలేదు: అమిత్ షా

లఖీంపూర్ (అస్సాం): మోదీ ప్రభుత్వ హయాంలో మన భూభాగాన్ని చైనా ఒక్క అంగుళం కూడా ఆక్రమించుకోలేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. 1962లో అస్సాం, అరుణాచల్ ప్రదేశ్‌లను చైనా ఆక్రమించుకుంటున్నా నాటి ప్రధాని నెహ్రూ చూస్తూ వదిలేసిన వైనాన్ని ఆయా రాష్ట్రాల ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరన్నారు. అస్సాంలోని లఖీంపూర్‌లో మంగళవారం ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడారు. కేంద్రం, రాష్ట్రంలోని హిమంత ప్రభుత్వం బంగ్లాదేశ్‌తో మన సరిహద్దులను కట్టుదిట్టం చేసి చొరబాట్లను నిలువరించాయన్నారు. డొక్లాం సహా మన భూభాగంలో ఒక్క అంగుళాన్ని కూడా చైనా ఆక్రమించలేదని, ఆ దేశ బలగాలను వెనక్కి తరిమివేశామని చెప్పారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు అస్సాంకు అన్యాయం చేశాయని ఆరోపించారు.

క్లీన్ చిట్ ఎలా ఇస్తారు?: కాంగ్రెస్


చైనాకు అమిత్ షా ఆక్లీన్‌చిట్ ఇస్తున్నారంటూ కాంగ్రెస్ మండిపడింది. తాము అధికారంలోకి వస్తే చైనా దురాక్రమణను అడ్డుకుని తీరుతామని స్పష్టం చేసింది. అరుణాచల్‌లోకి చైనా 60 కి.మీ. మేర చొచ్చుకొచ్చిందని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు.

దక్షిణకొరియాలో నేడే ఎన్నికలు

సియోల్: దక్షిణ కొరియా జాతీయ అసెంబ్లీ(పార్లమెంట్) ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం ఎన్నికలు జరుగబోతున్నాయి. మొత్తం 300 స్థానాలున్న పార్లమెంట్‌లో 254 స్థానాలను ప్రత్యక్ష ఎన్నిక ద్వారా భర్తీచేస్తారు. మిగిలిన 46 స్థానాలను చిన్నాచితక పార్టీలకు వాటికి లభించిన ఓట్ల శాతం ఆధారంగా కేటాయిస్తారు. ఈ ఎన్నికల్లో ప్రధానంగా అధికార పీపుల్ పవర్ పార్టీ, ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ పోటీ పడుతున్నాయి. దేశంలో మొత్తం 4.4 కోట్ల మంది ఓటర్లున్నారు. ఈసారి రెండు ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీ పోరు తప్పదని సర్వేలు చెబుతున్నాయి. ఈ ఎన్నికలు పీపుల్ పవర్ పార్టీ నేత, అధ్యక్షుడు యూన్ సుక్ ఇయోల్ పరిపాలనకు రిఫరెండమ్ అని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఆయన 2022లో అధ్యక్షుడిగా అధికారంలోకి వచ్చారు. మరో మూడేళ్ల పదవీ కాలం మిగిలి ఉంది. ఈ ఎన్నికల్లో పీపుల్ పవర్ పార్టీకి తక్కువ స్థానాలు వస్తే యూన్ సుక్ ఇయోల్‌కు ఇబ్బందులు తప్పక పోవచ్చు. ఆయనను పదవి నుంచి తొలగించాలన్న డిమాండ్లు ఊపందుకోవచ్చు. మరోవైపు డెమొక్రటిక్ పార్టీ నాయకుడు లీ జే-మ్యూంగ్ ఈసారి ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలుచుకోవాలన్న పట్టుదలతో ఉన్నారు. సర్వే కూడా అదే అంచనా వేస్తున్నాయి. పార్లమెంట్‌లో ప్రతిపక్షం ఆధిక్యం పెరిగితే పరిపాలన పరంగా అధ్యక్షుడు యూన్ సుక్ ఇయోల్‌కు కొత్త సవాళ్లు ఎదురవుతాయి.

సీఈసీ రాజీవ్‌కుమార్‌కు జెడ్ కేటగిరీ భద్రత

సార్వత్రిక ఎన్నికల వేళ కేంద్రం కీలక నిర్ణయం



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్(సీఈసీ) రాజీవ్‌కుమార్‌కు కేంద్ర ప్రభుత్వం జెడ్ కేటగిరీ భద్రతను కల్పించింది. ఈ మేరకు మంగళవారం కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఆరుగురు ఎన్ఎస్‌జీ కమాండోలు, ఆరుగురు పోలీసులతోపాటు మరో 22 మంది భద్రతా సిబ్బంది మొత్తం 40 నుంచి 45 మందితో కూడిన బృందం రాజీవ్ కుమార్‌ను 24 గంటలూ వెన్నంటి ఉంటుంది. ఇటీవల పలు అంశాలపై రాజకీయ పార్టీల నిరసనలు, విదేశాల నుంచి వస్తున్న బెదిరింపులు, నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల వేళ హోంశాఖ వీవీఐపీ సెక్యూరిటీ భద్రతపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం సీఈసీ, ఇద్దరు ఎన్నికల కమిషనర్లకు ఢిల్లీ పోలీసు విభాగానికి చెందిన సాయుధ బృందం భద్రత కల్పిస్తోంది. గతంలో సీఈసీ దివంగత టీఎన్ శేషన్‌కు మాత్రమే ఒక సమయంలో కేంద్ర సాయుధ బలగాల భద్రత కల్పించారు. 1984 బ్యాచ్‌కు చెందిన విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్‌కుమార్. 2022లో కేంద్ర ఎన్నికల సంఘానికి 25వ ప్రధాన కమిషనర్‌గా ఈయన బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు, 2020 నుంచి ఆయన ఎన్నికల కమిషనర్‌గా ఉన్నారు.

సాక్షి హైదరాబాద్

బుధవారం । 10 । ఏప్రిల్ । 2024





మంగళవారం హైటెక్ సిటీలో మహారాష్ట్రియన్ల 'గుడి పడ్వా' వేడుకల్లో మహిళల సందడి









రవీంద్రభారతిలో జరిగిన ఉగాది వేడుకల్లో వివిధ కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు





క్రోధి కళ

ఉగాది వేళ.. ఉల్లాస హేల

మామిడి ఆకులు, వేప పూలు, పండ్లు, చెరకు...కొనుగోళ్లతో నగరవీధుల్లో ఉదయించిన ఉగాది పండుగ కొత్త కాంతులు తెచ్చింది. క్రోధి నామ నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు భక్తులు బారులు తీరడంతో దేవాలయాలు పండుగ శోభ సంతరించుకున్నాయి. చాలా చోట్ల ఆలయాల్లో మంగళవారం ఉదయం సంప్రదాయ 'పంచాంగ శ్రవణం' వినడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. రాజకీయ పార్టీల కార్యాలయాల్లో పంచాంగ శ్రవణాలు ఆయా పార్టీల నాయకులకు శ్రవణానందకరంగా సాగాయి. ఇక గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీల్లో సైతం ప్రత్యేకంగా ఈ పంచాంగ శ్రవణం కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవడం విశేషంగా చెప్పాలి. తమ తమ రాశుల వారీగా తమకు రాబోయే ఏడాది ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి ఆధునికులు సైతం జోతిష్యులు, పండితులను వాకబు చేయడం కనిపించింది. వరుస సెలవులు సద్వినియోగం చేసుకునే సిటిజనులు వారి స్వస్థలాలకు తరలడంతో నగరంలో ప్రధాన మార్గాలు ప్రధాన రహదారులు బోసిపోయాయి. కాగా భిన్న సంస్కృతుల నిలయమైన నగరంలో సింధీలు చేటి చంద్ పేరుతో కొత్త సంవత్సర వేడుకల్ని సంబరంగా జరుపుకున్నారు. నగరంలో సింధీలు అధికంగా నివసించే సింధ్ కాలనీ లాంటి చోట్ల పండుగ సందడి కనిపించింది. అదే విధంగా మార్వాడీలు, మహారాష్ట్రీయులు అధికంగా నివసించే చోట వారి సంస్కృతిలో భాగమైన గుడిపద్వా వేడుకలు కనువిందు చేశాయి.

– సాక్షి, సిటీబ్యూరో

బాషా వర్సెస్ తిలక్





- బీజేపీ షార్ట్ లిస్ట్‌లో ఈ ఇద్దరి పేర్లు!
- ఒకట్రెండు రోజుల్లో కంటోన్మెంట్ అభ్యర్థి ప్రకటన

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపిక బీజేపీకి తలనొప్పిగా మారింది. గత రెండు పర్యాయాలు పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన శ్రీగణేశ్ అకస్మాత్తుగా కాంగ్రెస్‌లో చేరి, ఆ పార్టీ అభ్యర్థిగా మారడంతో బీజేపీ అగ్ర నేతలు షాక్‌కు గురయ్యారు. ఈసారి అభ్యర్థి ఎంపికలో గతంలో మాదిరిగా పొరపాట్లు జరగకుండా జాగ్రత్త పడుతున్నారు. పాతిక మందికిపైగా ఆశావహులు పోటీ పడుతుండటంతో, వారిలో బలమైనవారిని అభ్యర్థిగా ఎంపిక చేసేందుకు ఆపసోపాలు పడుతున్నారు. ముఖ్యంగా స్థానిక నేతల మధ్య ఆధిపత్య పోరు కారణంగా ఏకాభిప్రాయం కుదురడం లేదని తెలుస్తోంది. పార్టీ పట్ల విధేయత, వర్గపోరు, సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని వడపోత పోసి ముగ్గురు అభ్యర్థులను ఎంపిక చేసినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. మాజీమంత్రి సదాలక్ష్మి కుమారుడు డాక్టర్ టీఎస్ వంశీతిలక్, ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొప్పు బాషా పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరితోపాటు కేంద్ర మాజీమంత్రి సర్వే సత్యనారాయణ, మాజీమంత్రి శంకర్రావు కుమార్తె సుష్మిత, వర్రి తులసీ విజయ్‌కుమార్, జైనపల్లి శ్రీకాంత్ పేర్లను పరిశీలిస్తున్నారని సమాచారం.

ఇద్దరూ ఇద్దరే...

డాక్టర్ వంశీతిలక్ తల్లిదండ్రులు సదాలక్ష్మి, టీవీ నారాయణ కంటోన్మెంట్ నియోజకవర్గం బొల్లారం ప్రాంతానికి చెందినవారు. సదాలక్ష్మి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ డిప్యూటీ స్పీకర్‌గా, మంత్రిగా పనిచేశారు. తొలి దళిత దేవాదాయ శాఖ మంత్రిగా ఆమె తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలతో సంచలనంగా నిలిచారు. ఆమె భర్త టీవీ నారాయణకు 2016లో పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. వీరి వారసుడిగా డాక్టర్ వృత్తిలో కొనసాగుతున్న వంశీతిలక్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ మేరకు అధిష్టానం పెద్దల ఆశీస్సులతో తనకు టికెట్ దక్కుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇక కొప్పు భాషా పాతికేళ్ల క్రితమే ఏబీవీపీలో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. 'నా రక్తం నా తెలంగాణ' పేరిట తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన పోరాటం ద్వారా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. రంగారెడ్డి జిల్లా యాచారం ఉప సర్పంచ్‌గా, ఎంపీటీసీ, ఎంపీపీగా పనిచేశారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా పార్టీలో కీలక వ్యక్తిగా ఎదిగారు. నగరంలోని ఏకైక ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాల్సిందిగా పార్టీ పెద్దలకు విజ్ఞప్తి చేశారు. ఈయన పేరును సైతం బీజేపీ అభ్యర్థుల షార్ట్ లిస్ట్‌లో చేర్చినట్లు తెలుస్తోంది.

గంగ బెంగ

అల్లంత లోతున భూగర్భ జలాలు!

- 31 ప్రాంతాల్లో వట్టిపోయిన బోర్లు
- గతేడాదితో పోల్చితే.. 2 నుంచి 7 మీటర్లకు కిందికి
- ఇక భవిష్యత్తుకు పరిష్కారం ఇంకుడు గుంతలే..

సాక్షి, సిటీబ్యూరో: పాతాళంలోకి గంగ జారిపోతోంది. సెగలు కక్కుతున్న భానుడి భగభగలతో కరిగిపోతోంది. వరుణుడి కరుణతో పదేళ్లుగా కళకళలాడిన జలాశయాలు వేసవి రాకతో ఎండిపోగా..బోరు బావులు బోరుమంటున్నాయి. మహానగర పరిధిలో మునుపెన్నడూలేని రీతిలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. గోదావరి, కృష్ణా జలాలతో తాగునీటి అవసరాలకు పెద్దగా ఇబ్బందిలేకున్నా..ఇతర అవసరాలకు వినియోగించే నీరు అందుబాటులో లేక సిటీజనులు లబోదిబోమంటున్నారు. గత మూడు నెలల్లో సుమారు 31 ప్రాంతాల్లో భూగర్భజలాలు అడుగంటి బోర్లు వట్టిపోయినట్లు అధికార నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. గతేడాదితో పోల్చితే సగటున రెండు నుంచి ఏడు మీటర్ల మేర భూగర్భజల మట్టం తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. కూకట్‌పల్లిలో 15.84 నుంచి 22.74 మీటర్లకు అబ్దుల్లాపూర్ మెట్‌లో 11 నుంచి 17.9 మీటర్ల లోతుకు తగ్గిపోయాయి.

బోర్లపై ఆధారం

జలమండలి దినసరి 2602.29 ఎంఎల్‌డీ నీటి సరఫరా చేస్తున్నా..ఇతర అవసరాల కోసం బోరు నీరే ఆధారం. నగరంలో రోజు విడిచి రోజు, శివార్లలో మూడు రోజులకు ఒకసారి నల్లా నీటి విడుదలతో ఇతర అవసరాలకోసం బోర్లపైనే ఆధారపడక తప్పని పరిస్థితి నెలకొంది. మరో వైపు నగర శివార్లలో గేటెడ్ కమ్యూనిటీలు, బహుళ అంతస్తుల భవంతులు నిర్మాణాలు ఊపందుకోవడం, కాంక్రీట్ మహారణ్యాలు విస్తరిస్తున్న కారణంగా భూగర్భజలాల వినియోగం బాగా పెరిగింది,. ఆ ప్రాంతాలకు సరైన పైపుల నీటి నెట్‌వర్క్ లేకపోవడం వల బోర్ల తవ్వకాలు అధికమయ్యాయి. అది కూడా అత్యంత లోతుకు వేయడం పరిసర ప్రాంతాలా భూగర్భజలాలపై ప్రభావం చూపుతున్నాయి. గ్రేటర్ మొత్తం మీద 30 లక్షల పైగా బోర్లు ఉండగా అందులో ఇప్పటికే 30 శాతం పైగా బోర్లలో భూ గర్భజలాలు అడుగంటి చుక్క నీరు పైకి రాని పరిస్థితి ఏర్పడింది. మిగతా 20 శాతం బోర్ల పరిస్థితి అంతంత మాత్రంగా తయారైంది. పెద్ద బహుళ అంతస్తు భవనాలు, గ్రేటర్ కమ్యూనిటీల్లో మాత్రం బోర్లు పూర్తిగా వట్టిపోయాయి. గత మూడు నెలల్లో మణికొండ, గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్, కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో బోర్లు దాదాపు ఎండి పోవడంతో జలమండలి, ప్రైవేటు ట్యాంకర్లకు డిమాండ్ బాగా పెరిగింది.



ఇంకుడు గుంతలు లేకనే...

నగరంలో ఏటా కురుస్తున్న వర్షపాతం నేలగర్భంలోకి ఇంకేందుకు అవసరమైన ఇంకుడుగుంతలు లేక రహదారులపై నీరు ప్రవహించి చిట్ట చివరికి మూసీలో కలవడం సర్వసాధారణంగా మారింది. దీంతో నగరంలో ఏటేటా భూగర్భజల మట్టాలు పాతాళంలోకి పడిపోతున్నాయి. గ్రేటర్ పరిధిలో గృహాల సంఖ్య 40 లక్షలకుపైనే ఉండగా ఇంకుడు గుంతలసంఖ్య ఐదు లక్షలకు మించిలేవు. మరో వైపు రోజువారీగా ఆయా బోరు బావుల నుంచి సుమారు 750 కోట్ల లీటర్ల మేర భూగర్భ జలాలు తోడుతున్నట్లు అంచనా. ట్యాంకర్లు వినియోగిస్తున్న వారు భూగర్భ స్థాయి నీటి మట్టాల్ని పెంచేందుకు జలమండలి చర్యలు చేపట్టింది. ట్యాంకర్ ద్వారా వాటర్ బుక్ చేసుకుంటున్న వినియోగదారులకు ఒక వైపు నీరు సరఫరా చేస్తూనే.. మరో వైపు ఇళ్లల్లో ఇంకుడు గుంతల నిర్మాణం ఏర్పాటు చేసేందుకు చొరవ తీసుకునేలా అవగాహన కల్పించేందుకు సిద్ధమైంది.

శివార్లలో ఇలా..

నగర శివార్లలో గతేడాదితో పోలిస్తే దాదాపు 3 మీటర్ల మేర భూగర్భ జల నీటి మట్టం తగ్గింది. ఈ సారి పాతాళ గంగ లోతుకు పడిపోవటంతో నీటి సమస్య తీవ్ర రూపం దాల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. రంగారెడ్డి జిల్లాలో సగటున నాలుగు మీట ర్లు, మేడ్చల్ జిల్లా పరిధిలో సగటున మూడు మీటర్లు, హైదరాబాద్ పరిధిలో సగటున 2.5 మీట ర్ల భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయాయి.

భూగర్భ జల మట్టాలు ఇలా.. (మీటర్ల లోతులో)

మండలం	మార్చి -2023	మార్చి -2024	కిందికి
కూకట్‌పల్లి	15.84	22.74	6.8
అబ్దుల్లాపూర్ మెట్	11.00	17.9	6.8
మల్కాజిగిరి	19.5	24.4	4.9
శేరిలింగంపల్లి	8.62	12.69	4.7
కుత్బుల్లాపూర్	8.48	11.48	3.0
మారేడ్‌పల్లి	12.4	15.3	2.9
అల్వాల్	7.8	10.7	2.9
బాచుపల్లి	3.8	6.6	2.8
చంద్రాయణ గుట్ట	11.95	14.53	2.5
సైదాబాద్	6.1	8.7	2.5
బాలానగర్	7.42	9.77	2.3
కీసర	7.88	10.24	2.3
చార్మినార్	8	10.3	2.3



చిత్రం భళారే విచిత్రం


గ్రేటర్ యవనికపై విభిన్న దృశ్యం!

- కమల వికాసం..గులాబీ విలాపం.. హస్త లాఘవం ..
- రాజధానిలో రసవత్తరంగా లోక్‌సభ ఎన్నికల సమరం

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో వచ్చేనెల జరుగనున్న లోక్‌సభ ఎన్నికలకు దాదాపు నెల రోజుల సమయం ఉంది. రాజధాని హైదరాబాద్ నగరానికి సంబంధించి ఎంఐఎం సంగతలా ఉంచితే..మిగతా మూడు ప్రధాన పార్టీల్లో మూడు విభిన్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.

కమలం దూకుడు..

మూడో పర్యాయం కూడా దేశంలో అధికార పగ్గాలు చేపట్టాలన్న ఉత్సాహంలో బీజేపీ శ్రేణులు గ్రేటర్ ప్రచార పర్వంలోనూ దూసుకెళ్తూ మిగతా వారికంటే ముందంజలో ఉన్నాయి. గ్రేటర్ పరిధిలో కొచ్చే హైదరాబాద్, చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజిగిరి లోక్‌సభ స్థానాలకు అందరికంటే ముందే బీజేపీ అభ్యర్థులను ప్రకటించడంతో వారిప్పటికే ప్రచారం ప్రారంభించారు. ప్రజలను కలుస్తున్నారు. జాతీయ స్థాయిలో వెలిగిపోతున్న మోదీ ప్రభను వివరిస్తూ దేశం కోసం చేసిన కార్యక్రమాలను చెబుతున్నారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షాలు ఇప్పటికే ఓ రౌండ్ పర్యటించారు. ఈ నెల 13 తర్వాత మరో దఫా రానున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో డజను సీట్ల గెలుపు లక్ష్యంగా గ్రేటర్‌లోని నాలుగింటిపైనా కన్నేయడంతోపాటు మూడింట నెగ్గేలా వ్యూహరచన చేశారు. నియోజకవర్గాల వారీగా ప్రచారం జోరుగా సాగుతోంది. టిఫిన్ భేటీలు నిర్వహించారు. నోటిఫికేషన్ వెలువడ్డాక మరింత దూకుడు పెంచనున్నట్లు పార్టీవర్గాల సమాచారం. బూటకపు గ్యారంటీలంటూ కాంగ్రెస్‌పై విమర్శల వర్షం గుప్పిస్తున్నారు. బీఆర్‌ఎస్ ఫోన్ ట్యాపింగ్‌లను ప్రస్తావిస్తున్నారు. పాదయాత్రలతో ఇంటింటికీ ప్రచారం ఇప్పటికే మొదలుకాగా, మరింత ముమ్మరం కానుంది. సాధారణ ప్రచారం కంటే సోషల్‌మీడియా పవర్ తెలిసినందున ప్రతిరోజూ తప్పనిసరిగా కొన్ని పోస్టులుండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ పార్లమెంట్‌లో వరుసగా నెగ్గుతూ వస్తున్న అసదుద్దీన్ ఒవైసీపై పోటీకి హిందూ ధర్మ సంరక్షణ, సంఘ్ నేపథ్యం కలిగిన కొంపెల్ల మాధవీలతను బీజేపీ నిలబెట్టింది. ఇటీవల 'ఆప్‌కీ అదాలత్' ఇంటర్వ్యూలో ఆమె ఇచ్చిన సమాధానాలు అసాధారణమైనవని, తర్కంతో మాట్లాడటమే కాక దృఢమైన అంశాలు ప్రస్తావించారని స్వయానా మోదీ 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. దీంతో ఆమె ఎవరో తెలుసుకోవాలన్న ఆసక్తి నగర ప్రజల్లో పెరిగింది. ఇలా.. వివిధ అంశాల్లో బీజేపీ మిగతా పార్టీల కంటే ముందంజలో ఉంది.



'ఆకర్ష్‌పై' కాంగ్రెస్ దృష్టి!

ఇక రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టి.. విజయోత్సాహంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రచారం కంటే ఎక్కువగా ఇతర పార్టీల నేతలు/అభ్యర్థులను తమవైపు ఆకర్షించడమే పనిగా పెట్టుకుంది. వారిని తమవైపు గుంజితే చాలు.. తమ బలం పెరిగిందని ప్రజలు ఓట్లేస్తారని భావిస్తున్నట్లున్నారు. కార్పొరేటర్లు, కౌన్సిలర్లను చేర్చుకుంటూ ముందుకు సాగుతోంది. మూడు సీట్లు పక్కా కొట్టాల్సిందేనని పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెబుతున్నప్పటికీ ఇంకా ప్రజల మధ్యకు వెళ్లలేదు. సికింద్రాబాద్‌లో దింపిన దానం నాగేందర్‌ను, మల్కాజిగిరిలో నిలబెట్టిన సునీతా మహేందర్‌రెడ్డిని, చేవెళ్లలో రంజిత్‌రెడ్డిని బీఆర్‌ఎస్ నుంచి లాగడం తెలిసిందే. సికింద్రాబాద్ టిక్కెట్‌ను ప్రకటించినప్పటికీ దానం నాగేందర్ విముఖంగా ఉన్నట్లు చెబుతున్నారు. మరోవైపు పార్టీ మారితే చర్యలుండాల్సిందన్న రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు కాంగ్రెస్‌కు ఇరకాటంగా మారాయి. అసెంబ్లీ ఎన్నికల గెలుపే ఈ ఎన్నికలకూ అక్కరకొస్తుందని, పార్టీలోకి ఎక్కువ మందిని రప్పించడంపై దృష్టి సారించిన పార్టీ.. ప్రజల మధ్యకు వెళ్లడం ఇంకా ప్రారంభించలేదు. చేరికలు, సభలతోనే ఇప్పటివరకు సరిపోయింది. ముమ్ముందు వైఖరి ఎలా ఉంటుందో చూడాల్సిందే.

డీలా పడ్డ గులాబీ

ఇక పదేళ్లపాటు ఓ వెలుగు వెలిగిన గులాబీ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలు కావడం, పార్టీ దళపతి కాలు విరగడం, ఎమ్మెల్సీ కవిత అరెస్టు, ఫోన్‌ట్యాపింగ్‌లు రేపుతున్న దుమారం తదితరమైనవి ఆ పార్టీని కోలుకోలేకుండా చేస్తున్నాయి. ప్రతిపక్షాల చర్యల్ని కేటీఆర్ ఎంతగా తిప్పికొడుతున్నా, అడ్డగోలుగా మాట్లాడితే ఊరుకోబోమని హెచ్చరిస్తున్నా పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం తగ్గలేదు. పార్టీ అభ్యర్థులను ఎంతో ముందస్తుగా ప్రకటించిన చరిత్ర ఉన్న ఆ పార్టీ ప్రస్తుతం అభ్యర్థుల కోసం వెతుక్కునే దుస్థితి ఎదురైంది. పిలిచి టిక్కెట్టిస్తామన్నా ముందుకొచ్చేవారు లేకుండా పోయారు. పైసలు..ప్రచారం అన్నీ చూసుకుంటామన్నా పోటీచేసేందుకు గతంలో మాదిరి పోటీ లేదని పార్టీ నేతలే అంటున్నారు. సికింద్రాబాద్‌లో పోటీ చేసేందుకు తలసాని శ్రీనివాస్‌యాదవ్ ససేమిరా అనడంతో పద్మారావును కూర్చోబెట్టి ఒప్పించాల్సి వచ్చింది. చేవెళ్లలో రంజిత్ రెడ్డి బీఆర్‌ఎస్‌కు చేయిచ్చి కాంగ్రెస్ పంచన చేరారు. దాంతో అక్కడ కాసాని జ్ఞానేశ్వర్‌ను దింపారు. మల్కాజిగిరిలోనూ ఉన్నవారిలో రాగిడి లక్ష్మారెడ్డికి ఇచ్చారు. అక్కడ పోటీ చేసేందుకు మల్లారెడ్డి, ఆయన అల్లుడు రాజశేఖరరెడ్డి వెనుకడుగు వేశారు. హైదరాబాద్‌పై ఎలాగూ ఆశల్లేవు కనుక ఎవరైనా ఒకటే కావడంతో గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌కు టిక్కెట్టిచ్చారు. మరోవైపు ఎవరు ఎప్పుడు పార్టీకి గుడ్‌బై చెబుతారో తెలియక,పార్టీ నేతలు గట్టు దాటకుండా చేసేందుకు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. ఎలాగోలా అభ్యర్థుల్ని ప్రకటించినా ప్రచారంలో జోష్ లేదు. ఎవరూ పెద్దగా ప్రజల్లోకి వెళ్లడం లేరు. కేవలం అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పార్టీ క్యాడర్‌తో సమావేశాలు తప్ప ప్రజల ముందుకెళ్లింది లేదు. ఇక మిగిలిన సమయంలోనైనా పుంజుకుంటారో లేదో వేచి చూడాల్సిందే.

ఇంజనీర్ల బస్తీబాట!

విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో...

- పీక్ అవర్‌లో క్షేత్రస్థాయి పరిశీలన
- డీటీఆర్‌లకు టంగ్ టెస్టింగ్ పరీక్షలు
- ఒత్తిడికి లోనవుతున్న పీటీఆర్, డీటీఆర్‌ల గుర్తింపు
- లోడ్ బ్యాలెన్స్‌కు సిఫార్సు...

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఇంజనీర్లు బస్తీబాట పట్టారు. ఇప్పటికే సబ్‌స్టేషన్లు, లైన్ల వెంట తిరిగి సరఫరా తీరును పరిశీలించిన అధికారులు తాజాగా..బస్తీ/కాలనీల్లో పర్యటిస్తున్నారు. సరఫరా వ్యవస్థలోని సాంకేతిక సమస్యలను గుర్తించి, కోతలు, హెచ్చుతగ్గులు వంటి సమస్యలను పూర్తిగా నివారించాలని నిర్ణయించారు. ఇందు కోసం ఇప్పటికే ఓవర్‌లోడు కారణంగా తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్న సబ్‌స్టేషన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను(పీటీఆర్)గుర్తించారు. అవసరమైన చోట కొత్తగా అదనపు పీటీఆర్‌లను ఏర్పాటు చేశారు. తాజాగా వీధి చివర్లో ఉన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లపై ఉన్న ఒత్తిడిని గుర్తించే పనిలో నిమగ్న మయ్యారు. సాయంత్రం 6 నుంచి 9 గంటల సమయం(పీక్ అవర్)లో ఆయా సర్కిళ్లు, డివిజన్లు, సెక్షన్ల పరిధిలోని ఇంజనీర్లు, జూనియర్ లైన్‌మెన్లు ఫీడర్ల పరిధిలోని కాలనీలు/బస్తీల్లో పర్యటించి, టంగ్ టెస్టింగ్ ద్వారా లోడును రికార్డు చేయనున్నారు. అవసరమైన చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి, కోతలకు ఆస్కారం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించారు. సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆయా సర్కిళ్ల ఇంజనీర్లను సమన్వయం చేస్తున్నారు. సరఫరాలో అంతరాయం లేకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నారు.

పీటీఆర్‌ల సామర్థ్యం పెంపు


- సాధారణ రోజుల్లో రోజు సగటు విద్యుత్ డిమాండ్ 55 ఎంయూలు నమోదు అవుతుండగా, ప్రస్తుతం 80 ఎంయూలు దాటింది. సామర్థ్యానికి మించి రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ నమోదువుతుండటంతో సబ్ స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు(పీటీఆర్), ఫీడర్లు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నాయి. దీంతో పీటీఆర్‌ల సామర్థ్యం పెంపు చర్యలు చేపట్టారు. నారపల్లి సబ్‌స్టేషన్‌లోని 5 ఎంవీఏ సామర్థ్యం ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను 8 ఎంవీఏకు, జల్‌పల్లి సబ్‌స్టేషన్‌లోని 8 ఎంవీఏ సామర్థ్యం ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను 12.5 ఎంవీఏకు, ఇబ్రహీంబాగ్ సబ్‌స్టేషన్‌లోని 5 ఎంవీఏ సామర్థ్యం ఉన్న పవర్ ట్రాన్స్ ఫార్మర్ సామర్థ్యాన్ని నుంచి 8 ఎంవీఏకు, కోకాపేట్ సబ్‌స్టేషన్‌లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 5 ఎంవీఏ నుంచి 8 ఎంవీఏకు పెంచారు. అదే విధంగా కందికల్‌గేట్ సబ్‌స్టే షన్‌లో కొత్తగా 8 ఎంవీఏ పీటీఆర్‌ను, సోమశిల సబ్‌స్టేషన్‌లో 12.5 ఎంవీఏ పీటీఆర్‌ను ఏర్పాటు చేశారు.
- విద్యుత్ కోతలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటంతో తాజాగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పరిశీలించే పనిలో నిమగ్నమయ్యారు. సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు(పీక్ అవర్) క్షేత్ర స్థాయి సిబ్బంది కాలనీలు, బస్తీల్లో పర్యటించారు. వీధి చివర్లో ఉన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్ల లోడ్ బ్యాలెన్సింగ్ కోసం టంగ్ టెస్టర్ ద్వారా కచ్చితమైన లోడ్లను రికార్డ్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. పీక్ అవర్‌లో అధిక లోడుతో తీవ్ర ఒత్తిడికి గురై, తరచూ ఫ్యూజ్‌లు కొట్టేస్తున్న డీటీఆర్‌లను గుర్తించి, వాటి సామర్థ్యం పెంచేందుకు ఏర్పాటు చేస్తుండటం విశేషం.



గ్రేటర్‌లో డీటీఆర్‌లు ఇలా

సర్కిల్ పేరు	డీటీఆర్‌లు
హైదరాబాద్ సెంట్రల్	9,200
బంజారాహిల్స్	9,729
సికింద్రాబాద్	7,951
హైదరాబాద్ సౌత్	7,306
రాజేంద్రనగర్	30,799
మేడ్చల్	22,962
సైబర్‌సిటీ	27,173
హబ్సిగూడ	14,449
సరూర్‌నగర్	17,622





జలగం సతీష్‌గౌడ్‌కు ఓయూ డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ భౌతికశాస్త్రం విభాగం నుంచి జలగం సతీష్‌గౌడ్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. భౌతికశాస్త్రం అధ్యాపకులు డాక్టర్ నాచగోని నర్సింహులు పర్యవేక్షణలో 'లోహ అక్సైడ్‌ల నానో కణాలను పీవీఏ మాత్రికలో చొప్పించిన నానో సంయోజకాల తయారి, లక్షణీకరణ' అంశంపై చేసిన పరిశోధనకు ఓయూ డాక్టరేట్ ప్రకటించింది. 20 ఏళ్లుగా అధ్యాపక వృత్తిలో కొనసాగుతున్న సతీష్‌గౌడ్ ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని ట్రైబల్ గురుకుల డిగ్రీ కాలేజీలో భౌతిక శాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. సతీష్‌గౌడ్‌కు డాక్టరేట్ రావడం పట్ల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.వేణుగోపాల్‌రావు, ధ్యాన శిక్షకులు నందిగామ జనార్దనచారి, అధ్యాపక బృందం, మిత్రులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.





పచ్చ పచ్చాని చల్లదనం..

మామూలు రోజుల్లో హైదరాబాద్ మహానగరం ఎంత అద్భుతంగా ఉంటుందో..వేసవి వచ్చిందంటే చాలు అంతకు మించిన వేడి, ఉక్కపోతతో కుతకుతలాడుతుంది. సాధారణ గది ఉష్ణోగ్రత సుమారుగా 23 డిగ్రీ సెంటీగ్రేడ్ అనుకున్నా..ప్రస్తుతం నగరంలో 42 డిగ్రీలకు పైనే ఎండలు మండుతున్నాయి. ఇంతటి ఎండలకు పచ్చదనంతో చెక్ పెట్టొచ్చంటున్నారు కొందరు ప్రకృతి ప్రియులు. మన ఇంటి చుట్టూ మొక్కలు, చెట్లు పెంచుతూ నిరంతరం పచ్చదనాన్ని పరిరక్షిస్తే అది ఎండ నుంచి మనకు ఉపశమనం కలిగిస్తుందంటున్నారు అల్వాల్‌కు చెందిన డాక్టర్ విష్ణు వందనా దేవి. 'మా ఇంటి పైన 1800 ఎస్ఎఫ్‌టీలు, ఇంటి ముందు 2 వందలకు పైగా గజాల ఖాళీ స్థలముంది. పైనా కిందా విభిన్న రకాల కూరగాయలు, పండ్లు, పూల మొక్కలను పెంచుతున్నా. సిటీలో ఎండలు మండుతున్నా ఇప్పటి వరకు మా ఇంట్లో 35 డిగ్రీల వేడి దాటలేదు. ఇంట్లో ఏసీ ఉన్నా ఇప్పటి వరకు దానిని వాడలేదు. అంతేకాకుండా కూరగాయల కోసం మార్కెట్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు. ఇక్కడ డబ్బులు ఆదా కావడమే కాకుండా రసాయనాలు లేని ఆహారం పొందడం ముఖ్యమైన విషయం. వర్షాకాలంలో ఇంకుడు గుంతలతో నీటిని నిల్వ చేయడంతో ఇప్పటికీ మా బోరులో పుష్కలంగా నీళ్లున్నాయి. అందరూ ఇంటి, మిద్దెపంటలపై దృష్టిపెడితే వేసవి ఇబ్బందులకు చెక్ పెట్టొచ్చు' అని గర్వంగా చెప్పారు డాక్టర్ విష్ణువందన. – సాక్షి, సిటీబ్యూరో

పల్లె రవికుమార్‌కు తప్పిన పెనుప్రమాదం

నాగోలు: తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ పెను ప్రమాదం తప్పింది. మంగళవారం ఉదయం డ్రైవర్ ఖదీర్‌తో కలిసి తన కారులో ఖైరతాబాద్‌కు వెళ్లిన ఆయన మధ్యాహ్నం సమయంలో ఎల్‌బీనగర్‌లోని తన ఇంటికి బయలుదేరారు. కొత్తపేట రైతుబజార్ వద్దకు రాగానే రవికుమార్ ప్రమాణిస్తున్న కారు టైర్ పగిలి వీల్ విరిగి ఊడిపోయింది. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ పక్కనే ఉన్న మెట్రో పిల్లర్ డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో హెయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో కారులో ఉన్న రవికుమార్ ఎలాంటి గాయాలు కాలేదు. డ్రైవర్ ఖదీర్ స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. వెంటనే ట్రాఫిక్ పోలీసులు అక్కడి చేరుకుని కారును అక్కడి నుంచి తొలగించారు.

మొబైల్ కాల్ సెంటర్!

- పోలీసులకు చిక్కకుండా సైబర్ నేరగాళ్ల సరికొత్త ఎత్తుగడ
- వాహనాల్లో తిరుగుతూ రోజుకో ప్రాంతంలో మోసాలు
- హైవేల పక్కన, నిర్మానుష్య ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్
- అక్కడినుంచే సామాన్యులకు ఫోన్లు చేసి మాయమాటలతో బురిడీ
- అందినకాడికి దండుకుని పరారీ
- పోలీసులకు సాంకేతిక ఆధారాలు దొరకకుండా జాగ్రత్తలు



సాక్షి, సిటీబ్యూరో: ''బహుళ జాతి ఐటీ కంపెనీలో పనిచేస్తున్న జస్విత్ సైబర్ నేరస్తుల వలలో చిక్కి రూ.5 లక్షలు పోగొట్టుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడితో కేటుగాళ్లు సంప్రదింపులు జరిపిన పలు సెల్‌ఫోన్ నంబర్ల టవర్ లొకేషన్, సిగ్నళ్లను గుర్తించే ప్రయత్నం చేసిన పోలీసులు అవాక్కయ్యారు. రోజుకో ఫోన్ నంబరు నుంచి, గంట గంటకో టవర్ లొకేషన్ నుంచి ఫోన్లు చేసినట్లు గుర్తించి విస్తుపోయారు. లభించిన సాంకేతిక ఆధారాలతో టవర్ లొకేషన్ ప్రాంతానికి వెళ్లిన పోలీసులు.. అదంతా నిర్మానుష్య ప్రాంతం కావడంతో షాకయ్యారు. స్థిరంగా ఒక చోట నుంచి కాల్ సెంటర్ ఏర్పాటు చేసి ఫోన్లు చేస్తే టవర్ లొకేషన్‌లో దొరికిపోతామని గ్రహించిన నేరస్తులు ఇలా మొబైల్ కాల్ సెంటర్‌తో బాధితులను మోసం చేస్తున్నట్లు తేల్చారు.''

.. ఇలా సైబర్ నేరస్తులు మొబైల్ కాల్ సెంటర్లతో పోలీసులకు సవాల్ విసురుతున్నారు. సెల్‌ఫోన్ సిగ్నల్, టవర్ లొకేషన్, బ్యాంకు ఖాతా వివరాల ఆధారంగా పోలీసులు తమ ఉనికి, లావాదేవీలను పసిగడుతున్నారని గ్రహించిన సైబర్ కేటుగాళ్లు సరికొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. కాల్ సెంటర్ల ద్వారా మోసాలు చేస్తే ఏదోఒక రోజు పోలీసులకు చిక్కుతామని భావించిన కేటుగాళ్లు కొత్తగా మొబైల్ కాల్ సెంటర్లను తెరుస్తున్నారు.

మూడు కమిషనరేట్లలో సైబర్ నేరాలు

కమిషనరేట్	2021	2022	2023
హైదరాబాద్	2,066	4,471	4,332
రాచకొండ	1,360	2,049	2,562
సైబరాబాద్	3,854	4,850	5,342

కార్లలో తిరుగుతూ మోసాలు..

భౌతికంగా కాల్ సెంటర్లను ఏర్పాటు చేస్తే సాంకేతిక ఆధారంగా పోలీసులు వీటిని గుర్తిస్తారని గ్రహించిన నేరస్తులు సరికొత్త మార్గాన్ని అన్వేషించారు. పోలీసులకు సాంకేతిక ఆధారాలు దొరకకుండా జాగ్రత్తపడుతున్నారు. కారు, వ్యాన్ వంటి కదిలే వాహనాల్లో మొబైల్ కాల్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఐదారు మంది సైబర్ నేరస్తులు ముఠాగా ఏర్పడి, నాలుగైదు వాహనాల్లో సెల్‌ఫోన్లు, కస్టమర్ల డేటాతో తలోదిక్కున తిరుగుతున్నారు. నిర్మానుష్య ప్రాంతంలో వాహనాలను నిలిపి, అమాయకులకు ఫోన్లు చేసి కస్టమర్ కేర్, ఓఎల్ఎక్స్, ఇన్వెస్ట్‌మెంట్ ప్రాడ్స్ పలు రకాలుగా బురిడీ కొట్టిస్తూ అందినంత డబ్బులు దండుకున్న తర్వాత సాయంత్రానికి ఫోన్లు స్విచ్ఛాఫ్ చేస్తున్నారు.

అవన్నీ రోడ్లు, నిర్మానుష్య ప్రాంతాలే..

బాధితుల నుంచి వివరాలు సేకరించిన పోలీసులు సాంకేతిక ఆధారాల సేకరించి ఎట్టకేలకు సైబర్ నేరగాళ్లు నడుపుతున్న నకిలీ కాల్ సెంటర్లను గుర్తించి, పక్కా పథకం ప్రకారం వాటిపై దాడి చేసి నేరస్తులను పట్టుకునేవారు. దీంతో సైబర్ నేరస్తులు మొబైల్ కాల్ సెంటర్లను తెరలేపినట్లు ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. వాహనాల్లో కూర్చొని రోజుకో ప్రాంతంలో తిరుగుతూ సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందుకున్న పోలీసులకు టెక్నికల్ ఆధారాలు లభించకుండా జాగ్రత్త పడుతున్నారు. ఒక్కో రోజు ఒక్కో చోటి నుంచి నేరాలు చేసినట్లు సెల్‌ఫోన్ సిగ్నల్స్, లొకేషన్స్ వస్తుంటాయి. అక్కడికి వెళ్లి చూస్తే అదంతా హైవే రోడ్డు మార్గం, నిర్మానుష్య ప్రాంతం ఉంటున్నాయి. దీంతో నిందితులను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది.

భాషను బట్టి టెలీకాలర్ల నియామకం..

గతంలో ఢిల్లీ, గుర్గావ్, ఉత్తర్‌ప్రదేశ్, కోల్‌కత్తా వంటి ఉత్తరాది రాష్ట్రాల్లో సైబర్ నేరగాళ్లు ఎక్కువగా నకిలీ కాల్ సెంటర్లను ఏర్పాటు చేసి, సైబర్ నేరాలకు పాల్పడేవారు. ఒక్కో కాల్ సెంటర్‌లో వందల సంఖ్యలో టెలీ కాలర్లను నియమించుకునేవారు. ప్రాంతం, భాషను బట్టి టెలీకాలర్లకు ఆయా రాష్ట్రాల కస్టమర్ల డేటాను అందించేవారు. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రజలను మోసం చేసేందుకు తెలుగు భాషపై పట్టున్న టెలీకాలర్లనే నియమించుకునేవారు. డార్క్‌నెట్, జాబ్ పోర్టల్స్, సోషల్ మీడియా ఇలా వివిధ మార్గాల ద్వారా కస్టమర్ల పేరు, ఫోన్ నంబర్లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించేవారు. గిఫ్ట్‌లు, పార్ట్ టైం జాబ్స్, పెట్టుబడులు ఇలా రకరకాల పేర్లతో మోసాలకు పాల్పడేవారు.

విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్‌పై దాడి

సైదాబాద్: విధి నిర్వహణలో ఉన్న పోలీస్ హెడ్ కానిస్టేబుల్‌పై ఓ యువకుడు దాడికి పాల్పడిన సంఘటన సైదాబాద్ పీఎస్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సంతోష్‌నగర్‌కు చెందిన కృష్ణదొర మలక్‌పేట పీఎస్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న ఆయనకు సైదాబాద్ పీఎస్ నుంచి మాధవనగర్‌లో రహదారిపై తండ్రీ కొడుకులు గొడవ పడుతున్నారని వెళ్లి చూడాలని సమాచారం అందింది. దీంతో ఆయన సిబ్బందితో సహా అక్కడికి వెళ్లగా మాధవనగర్‌కు చెందిన జి.కోటప్ప అతని కుమారుడు వరుణ్ గొడవ పడుతున్నారు. హెడ్‌కానిస్టేబుల్ కృష్ణదొర వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా వరుణ్ దుర్భాషలాడుతూ అతనిపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో హెడ్‌కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. దీంతో సైదాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోగా వరుణ్‌ను అతని తల్లి జ్యోతి, మరో ఇద్దరు స్నేహితులు అక్కడి నుంచి తప్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు దాడికి పాల్పడిన వరుణ్ అతను పారిపోయేందుకు సహకరించిన తల్లి, ఇద్దరు స్నేహితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో పోలీసులపై వీరంగం

బంజారాహిల్స్: డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు సహకరించకుండా మద్యం మత్తులో న్యూసెన్స్‌కు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే... తెల్లాపూర్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి సోమవారం రాత్రి టోలిచౌకీ నుంచి వెళ్తుండగా ఇంటర్నేషనల్ స్కూల్ వద్ద టోలిచౌకీ ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా ఆపారు. అయితే అప్పటికే మద్యం మత్తులో శ్రీనివాస్‌రెడ్డి ట్రాఫిక్ పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తూ బ్రీత్ ఎనలైజర్ టెస్ట్‌కు నిరాకరించి గంటపాటు హల్‌చల్ చేశాడు. ట్రాఫిక్ ఎస్ఐ ప్రేమ్‌రాజ్ సమాచారంతో ఫిలింనగర్ పోలీసులు అతడిని స్టేషన్‌కు తరలించారు. అక్కడ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించగా 98 ఎంజీగా శ్వాస పరీక్షలో తేలింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధింపులు తాళలేక..

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య


భర్త లక్ష్మణ్‌తో భారతి(ఫైల్)

పోచారం: భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లా, మాదారం గ్రామానికి చెందిన భారతి (30) నగరానికి వలసవచ్చి ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. చింతా లక్ష్మణ్ అనే వ్యక్తిని ప్రేమించి పెళ్లి పెళ్లి చేసుకుంది. లక్ష్మణ్ కొర్రెముల గ్రామం వద్ద చికెన్ షాపు నిర్వహించేవాడు. గత కొన్నాళ్లు మద్యానికి బానిసైన లక్ష్మణ్ షాప్ తెరవడం లేదు. ఈ నెల 8న ఉదయం భారతి భర్తను పద్ధతి మార్చుకోవాలని చెప్పడంతో అతను ఆమెపై దాడి చేశాడు. కాగా అదే రోజు సాయంత్రం లక్ష్మణ్ భారతి సోదరుడు మహేష్‌కు వీడియో కాల్‌చేసి భారతి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుందని చెప్పాడు. ఆమెను కాపాడాలని వేడుకున్నా పట్టించుకోకుండా ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో మహేష్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాడు. భర్త వేధింపుల కారణంగా తన సోదరి ఆత్మహత్య చేసుకుందని ఆరోపిస్తూ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఉప్పల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామంతాపూర్ పాశం సత్తయ్య కాలనికి చెందిన సత్య భాస్కర్ రెడ్డి(34) ప్రైవేట్ ఉద్యోగి. సోమవారం రాత్రి బైక్‌పై బయటికు వెళ్లి తిరిగి వస్తుండగా రామంతాపూర్ శివాజీ విగ్రహం వద్ద నిలిచి ఉన్న మరో బైక్‌ను ఢీ కొట్టి కింద పడ్డాడు. ఈ ఘటనలో అతడి తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటపా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పండ్ల డబ్బులు అడిగినందుకు..

వ్యాపారిపై కత్తితో దాడి

వెంగళరావునగర్ : కొనుగోలు చేసిన పండ్లకు డబ్బులు అడిగినందుకు ఓ వ్యక్తి పండ్ల వ్యాపారిపై కత్తితో దాడికి పాల్పడిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కార్మికనగర్‌కు చెందిన మహ్మద్ అజార్ పండ్ల వ్యాపారం చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం అబ్దుల్ నవీద్ అనే వృద్ధుడు అతడి వద్ద రూ.180 విలువైన పండ్లు కొనుగోలు చేసి డబ్బులు తర్వాత ఇస్తానని చెప్పాడు. ఈనెల 8న నవీద్ కార్మికనగర్ లెహర్ కేఫ్ వద్ద ఉండగా అజార్ అతడిని డబ్బులు ఇవ్వాలని కోరాడు. దీంతో ఆగ్రహానికి లోనైన నవీద్ డబ్బులు ఇవ్వనని తేల్చిచెప్పడమే కాకుండా పక్కనే పండ్ల దుకాణంలో ఉన్న కత్తిని తీసుకువచ్చి అజార్‌పై దాడికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతను ఆసుపత్రిలో చికిత్స అనంతరం మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ మాట్లాడవద్దన్నందుకు..

బాలిక అదృశ్యం


సీహెచ్ గౌరి (ఫైల్)

కాచిగూడ: సెల్‌ఫోన్ ఎక్కువగా మాట్లాడవద్దన్నందుకు ఓ బాలిక ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిన సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. కాచిగూడ ఎస్ఐ నరేష్ కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్‌కు చెందిన బాలాజీ రావు కుటుంబంతో కలిసి శుభకార్యం నిమిత్తం ఈ నెల 8న కాచిగూడ, సుందర్‌నగర్‌లోని బంధువుల ఇంటికి వచ్చారు. బాలాజీరావు కుమార్తె సీహెచ్ గౌరీ (13) 8వ తరగతి చదువుతోంది. సెల్ ఫోన్ అతిగా మాట్లాడుతుండడంతో తల్లి, సోదరుడు ఆమెను మందలించారు. దీంతో మనస్తాపానికి లోనైన మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిపోయింది. సెల్‌ఫోన్ కూడా వెంట తీసుకెళ్లింది. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆమె ఆచూకీ లభించలేదు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. గౌరి సోదరుడు విష్ణు కార్తి ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'ఆదిబట్ల అభివృద్ధికి సహకరించండి'

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కోరారు. మంగళవారం తెలుగు నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన మంత్రిని శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన నిరంజన్‌రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. మున్సిపల్ అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందన్నారు.

బైక్‌ల దొంగ అరెస్ట్

మూడు ద్విచక్ర వాహనాలు, రెండు ఏసీ కంప్రెషర్లు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ఎన్.ఎస్.వి.వెంకటేశ్వర్ రావు

గౌలిపురా: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని భవానీనగర్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి అతడి నుంచి మూడు బైక్‌లు, రెండు ఏసీ కంప్రెషర్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. భవానీనగర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మీర్‌చౌక్ ఏసీపీ ఎన్.ఎస్.వి.వెంకటేశ్వర్ రావు ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి వివరాలు వెల్లడించారు. యాకుత్‌పురా, అమన్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ మొహసీన్ షరీఫ్ ప్లంబర్‌గా పని చేసేవాడు. చెడు వ్యసనాలకు బానిసైన అతను సులువుగా డబ్బులు సంపాదించేందుకు బైక్ చోరీలకు పాల్పడుతున్నాడు. ఈ నెల 7న మంగళ్‌హాట్, షాహినాథ్‌గంజ్, ఎల్‌బీనగర్ పీఎస్‌ల పరిధిలో మూడు బైక్‌లు చోరీ చేశాడు. అదే రోజు తలాబ్‌కట్టాలోని ఓ ఏసీ రిపేరింగ్ షాపులో రెండు ఏసీ కంప్రెషర్లను దొంగతనం చేశాడు. మంగళవారం ఉదయం అతను చోరీ చేసిన బైక్‌పై దొంగలించిన రెండు ఏసీ కంప్రెషర్లను విక్రయించేందుకు తీసుకెళుతుండగా అదే సమయంలో తనిఖీలు నిర్వహిస్తున్న భవానీనగర్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాలు అంగీకరించాడు. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు అతడి నుంచి మూడు బైక్‌లు, రెండు ఏసీ కంప్రెషర్లను స్వాధీనం చేసుకొని మంగళవారం రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్సైలు జి.అంకిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌ల చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

అబిడ్స్: ద్విచక్ర వాహనాలను దొంగిలించి తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి అతడి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అబిడ్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ పార్కింగ్‌లో నిలిపిన బైక్ చోరీకి గురికావడంతో వాహన యజమాని అబిడ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు దుంగన విష్ణు ప్రసాద్‌ను నిందితుడిగా గుర్తించారు. అతడిని అరెస్టు చేసి విచారించగా పలు ప్రాంతాల్లో బైక్‌ల చోరీకి పాల్పడినట్లు తెలిపాడు. అతడి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అబిడ్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి దారుణ హత్య

మహాదీప్‌షరీఫ్: ఫుట్‌పాత్‌పై పడుకునే విషయంలో తలెత్తిన వివాదంలో ఓ నిండు ప్రాణం బలైపోయింది. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన కామ్ సింగ్(40) జల్‌పల్లి శ్రీరాం కాలనీలో నివసిస్తుంటాడు. సంజయ్ దయానంద్ కుకుడ్‌కార్ అనే వ్యక్తితో కలిసి క్యాటరింగ్ పనిచేస్తుంటాడు. కర్నాటకకు చెందిన మరోవ్యక్తి నవనాథ్(40) ఆటో డ్రైవర్. వీరిరువురు నిత్యం శ్రీరాం కాలనీ పోచమ్మ దేవాలయం పరిసరాల్లో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తుంటారు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి నిద్రించే ప్రదేశం విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ విషయంలో ఆగ్రహించిన నవనాథ్.. కర్ర, రాయితో కామ్‌సింగ్ తలపై మోది హత్య చేశాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వచ్చారు. వివరాలను సేకరించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

‘ప్రధానిగా మోదీ హ్యాట్రిక్ ఖాయం’

హిమాయత్‌నగర్: కేంద్రంలో బీజేపీ మరోసారి విజయం సాధించి, నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని, ఉగాది పంచాంగంలో వేదపండితులు ఇదే విషయాన్ని స్పష్టం చేశారని ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ అన్నారు. ఉగాది పండుగ ప్రతి ఒక్కరి ఇంటిలో వెలుగులను నింపాలని ఆకాంక్షించారు. మంగళవారం జరిగిన హిమాయత్ నగర్ డివిజన్‌లోని 18వ బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మరోసారి సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ గెలిచేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని, ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలని అన్నారు. ఈ సమావేశంలో బూత్ కమిటీ అధ్యక్షులు తుల్జా రామ్, శ్రీశైలం, రమేష్, రాజు, కార్తీక్, భరత్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

రంజాన్, శ్రీరామనవమికి బందోబస్తు ఏర్పాట్లు

ఈస్ట్‌జోన్ డీసీపీ ఆర్.గిరిధర్



హిమాయత్‌నగర్: ప్రజలు ప్రశాంత వాతావరణంలో రంజాన్, శ్రీరామనవమి పర్వదినాలను జరుపుకోవాలని నగర ఈస్ట్ జోన్ డీసీపీ ఆర్.గిరిధర్ కోరారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శ్రీరామనవమి శోభయాత్రపై నిర్వాహకులతోపాటు అన్ని ప్రభుత్వ విభాగాలతో సమన్వయ సమావేశం నిర్వహిస్తామన్నారు. పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఎన్నికల కోడ్ కూడా ఉన్న నేపథ్యంలో అన్ని రకాల భద్రతాచర్యలు కట్టుదిట్టంగా ఏర్పాటు చేశామని డీసీపీ తెలిపారు.

ఘనంగా కాజా పుట్టినరోజు వేడుకలు



సూర్యనారాయణ పుట్టినరోజు వేడుకల్లో పరుచూరి గోపాలకృష్ణ

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ మాజీ కార్పొరేటర్, ఫిలింనగర్ సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఫిలింనగర్ దైవసన్నిధానంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం చేశారు. ఈ వేడుకల్లో సినీరచయిత పరుచూరి గోపాలకృష్ణతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొని సూర్యనారాయణకు శుభాకాంక్షలు తెలిపారు.

మధురానగర్‌లో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాలనీనేతలు

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీలో మంగళవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కాలనీనేతలు, దాతలు బండారు పెంటయ్య, కట్టా పుల్లారావులు దీని నిర్వహణకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు కోడె సాంబశివరావు మాట్లాడుతూ గత కొన్నేళ్ళుగా తమ కాలనీ ఇంతగా అభివృద్ధి చెందడానికి కాలనీలోని నేతలు, దాతలే కారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు, కాలనీ మహిళాసంఘం నేతలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాలనీలోని సంక్షేమ సంఘం భవనంలో ప్రముఖ పంచాంగకర్త సీహెచ్‌వీ అనంత్ ద్వారా పంచాంగం వినిపించారు.

దుస్తుల పంపిణీ



మహిళలకు దుస్తులు పంపిణీ చేస్తున్న కేవీఎస్ శర్మ

లిబర్టీ: ఉగాది పర్వదినం పురస్కరించుకొని శ్రీ క్రోధి నామ సంవత్సరం సందర్భంగా భారతీయ ధార్మిక సేవాసమితి జాతీయ అధ్యక్షులు కేవీఎస్ శర్మ మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. కొత్త తెలుగు సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో జీవనం సాగించాలని, అన్ని రకాలుగా వృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

వాటర్ క్యాన్ల వితరణ



వాటర్ క్యాన్లతో కేబీఆర్ పార్కు ఇంటర్‌సెప్టర్ వాహన పోలీసులు

బంజారాహిల్స్: కేబీఆర్ పార్కు చుట్టూ రక్షణ, వాకర్ల భద్రత కోసం ఏర్పాటు చేసిన పోలీస్ ఇంటర్‌సెప్టర్ వాహనాల సిబ్బందికి వేసవికాలంలో మంచినీటిని అందించేందుకు పలువురు వాకర్లు వాటర్‌క్యాన్స్ పంపిణీ చేశారు. విశ్రాంత ఐపీఎస్ అధికారిణి అరుణ బహుగుణ, డాక్టర్ అల్కాపాండే, శ్రీపర్ణాదాస్‌తోపాటు పలువురు యానిమల్ యాక్టివిస్టులు ఈ సాయం చేశారు.

‘ఎంపీఎం’ మాల్ యజమానిపై కేసు

బంజారాహిల్స్: జీహెచ్ఎంసీ అనుమతి తీసుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా బోర్ ఏర్పాటు చేసుకుని ఇద్దరు వ్యక్తుల ప్రమాదానికి కారణమైన ఎంపీఎం టైమ్స్ స్క్వేర్ మాల్ యజమానిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్డునెంబర్-1లోని పంజగుట్ట శ్మశానవాటికను ఆనుకుని నాగార్జున సర్కిల్‌లో ఎంపీఎం టైమ్స్ స్క్వేర్ మాల్ పేరుతో బహుళ అంతస్తుల భవనాన్ని నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారు. ఇదే భవనానికి జీహెచ్ఎంసీ అనుమతి లేకుండానే ఓ బోర్డును ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి అది కూలిపోయి సూరజ్‌కుమార్, పర్వేష్ అనే పాదచారులపై పడింది. దీంతో సూరజ్ తలకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. జీహెచ్ఎంసీ అడ్వర్టయిజింగ్ వింగ్ డీఈ అభిలాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఎంపీఎం మాల్ యజమానిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పంచాంగ శ్రవణం పచ్చడి సేవనం



జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీవారి ఆలయంలో ఆస్థానం వేడుకలు నిర్వహిస్తున్న అర్చకులు



మాగంటి కాలనీ ఆంజనేయస్వామి ఆలయంలో ఉగాది పచ్చడి రుచి చూస్తున్న ఎమ్మెల్యే దానం

- తెలుగు సంవత్సరాదిన ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- వేకువజాము నుంచే అర్చనలు, పంచాంగ శ్రవణాలు
- టీటీడీ ఆలయంలో శ్రీవారికి ఆస్థానం వేడుకలు

బంజారాహిల్స్: తెలుగు సంవత్సరాది శ్రీ క్రోధి నామసంవత్సరం ఉగాది వేడుకలు ఆలయాల్లో వైభవంగా జరిగాయి. భక్తులు కోటి ఆశలు, కొత్త ఆకాంక్షలతో ఆలయాలకు తరలి వచ్చారు. ఎల్లెడలా కొత్త ఉత్సాహం వెల్లివిరిసింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, శ్రీనగర్ కాలనీ, పంజగుట్ట, హిమాయత్‌నగర్ ప్రాంతాల్లోని ప్రధాన ఆలయాల్లో మంగళవారం వేకువజాము నుంచే భక్తుల సందడి కనిపించింది. దాదాపుగా అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. శ్రీనగర్‌కాలనీ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రామయ్య ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేకంగా ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఖైరతాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో టీపీసీసీ కార్యదర్శి పి.విజయారెడ్డి పాల్గొని నేతలు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఫిలింనగర్ మాగంటి కాలనీలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్థానిక నేతలతో కలిసి ఆయన ఉగాది పచ్చడి రుచి చూశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేత మామిడి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆస్థానం వేడుకలను ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు పెద్దఎత్తున భక్తులు రావడంతో ఆలయానికి వచ్చే రహదారులన్నీ రద్దీగా మారాయి. ఫిలింనగర్ దైవసన్నిధానంలో పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు హాజరై తమ రాశీ ఫలాల గురించి ఆలయ అర్చకుడు నెలరాజు శర్మను అడిగి తెలుసుకున్నారు.



పంచాంగ శ్రవణం చేస్తున్న ఫిలింనగర్ దైవసన్నిధానం అర్చకుడు నెలరాజు శర్మ

శ్రీసీతారామస్వామి దేవాలయంలో...

జూబ్లీహిల్స్ శ్రీసీతారామస్వామి దేవాలయంలో ఉగాది ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చక స్వాములు పంచాంగ శ్రవణం చేశారు.



ఖైరతాబాద్ కాంగ్రెస్ కార్యాలయంలో ఉగాది వేడుకల్లో విజయారెడ్డి



శ్రీనగర్‌కాలనీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చనల్లో పాల్గొన్న భక్తులు



జూబ్లీహిల్స్ టీటీడీ టెంపుల్‌లో స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

ఆనందోత్సాహాల మధ్య ఉగాది వేడుకలు



మధురానగర్‌లో పచ్చడి పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ దేదీప్య విజయ్

వెంగళరావునగర్: తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీలప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్‌లో వాసవీ యువజన సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక నేత వి.చిన్నశ్రీశైలం యాదవ్ ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు పుట్టా రామకృష్ణ, సూర్యరావు, శ్రీనివాసరావు, బుజ్జి, ప్రసాద్‌బాబు, సునీల్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ కాలనీలో కార్పొరేటర్ దేదీప్య విజయ్ ప్రత్యేక పూజలు చేసి పచ్చడి పంపిణీ చేశారు. కాంగ్రెస్ జూబ్లీహిల్స్ నాయకులు వి.నవీన్‌యాదవ్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమం జరిగింది. వాసవీ సేవా సంఘం రూపొందించిన పంచాంగ శ్రవణం, రాశిఫలాల పుస్తకాలను పంపిణీ చేశారు.



యూసుఫ్‌గూడలో పంచాంగం, రాశిఫలాల పుస్తకాలు పంపిణీ చేస్తున్న నవీన్‌యాదవ్



శ్రీకృష్ణానగర్‌లో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న చిన్న శ్రీశైలం యాదవ్

ఉగాది నాటకోత్సవాలు షురూ

ఫిలింనగర్: ఫిలింనగర్ ఫిలింఛాంబర్ ఆవరణలోని రామానాయుడు కళామండపంలో ఉగాది పండుగ సందర్భంగా ప్రతియేటా నిర్వహించే రంగస్థల నాటకోత్సవాలు మంగళవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు జరిగే ఈ నాటకోత్సవాల్లో భాగంగా తొలిరోజు గుణనిధి నాటకాన్ని ప్రదర్శించారు. శ్రీకృష్ణుడిగా ఎ.కోటేశ్వర్‌రావు, అర్జునగా నంది అవార్డుగ్రహీత మంగాదేవి నర్తించారు. శ్రీనాథ కవిసార్వభౌమ కాశీఖండం మూలకథ నుంచి సేకరించిన కథతో కొట్టే వెంకటాచార్యులు నాటక రచన చేశారు. గుణనిధిగా వెంకట సాయిచంద్, యజ్ఞదత్తుడిగా కొట్టే వెంకటాచార్యులు, మార్తండవర్మగా మంతోజు సాళ్యాచారి, మతిమంతుడుగా ప్రసాదరాయ శాస్త్రి కోరుకొండ, విశారదుడుగా జంగయ్యగౌడ్ నటించారు. కాగా, ఈ నాటికకు హార్మోనియం అబ్బూరి వెంకటస్వామి, కీబోర్డు సీహెచ్ వెంకటరావు, డోలక్ వి.బ్రహ్మి, దర్శకత్వం రాజనాల సత్య సహకారం అందించారు. ఈ నాటికను ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ, సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ, నిర్వాహకులు పొత్తూరి వెంకట సుబ్బారావు హాజరై వీక్షించారు. పెద్ద ఎత్తున విచ్చేసిన కళాభిమానుల మధ్య కళాకారులు ఉత్సాహంగా నాటికను ప్రదర్శించారు.



నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు

మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవం

కాచిగూడ: వీరన్నగుట్ట శ్రీ శ్యామ్‌మందిర్, వీరభద్రస్వామి దేవాలయ ప్రాంగణంలో మంగళవారం రాత్రి శ్రీ మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాదేవి పూజ, వీరభద్రస్వామి గొలుసు తెంపుట, మల్లికార్జునస్వామి ఊరేగింపు జరిగింది. కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రోహిణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎఫ్ఎన్‌సీసీలో ఉగాది సంబరాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎఫ్ఎన్‌సీసీ అధ్యక్షుడు ఆదిశేషగిరిరావు

బంజారాహిల్స్: ఫిలింనగర్ ఎఫ్ఎన్‌సీసీలో శ్రీక్రోధి నామ ఉగాది సంబరాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సింగర్ శ్రీ లలిత - గ్రూప్ మ్యూజికల్ మెలోడీస్‌తో, గాత్రంతో అందరినీ అలరించారు. ఎఫ్ఎన్‌సీసీ అధ్యక్షుడు జి.ఆదిశేషగిరిరావు, వైస్ ప్రెసిడెంట్ టి. రంగారావు, సెక్రటరీ ముళ్ళపూడి మోహన్, జాయింట్ సెక్రటరీ వి.వి.ఎస్.ఎస్. పెద్ది రాజు, ట్రెషరర్ బి. రాజశేఖర్ రెడ్డి, కమిటీ మెంబెర్స్ రాజా సూర్యనారాయణ, కె.మురళి మోహన్‌రావు, శ్రీమతి శైలజ, జే. బాలరాజు, ఎ.గోపాలరావు, ఏడిద రాజా, మోహన్ వడపట్ల, సామా ఇంద్రపాల్ రెడ్డి, వర ప్రసాద్ రావు, కల్చరల్ కమిటీ చైర్మన్ తమ్మారెడ్డి భరద్వాజ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



కార్యక్రమంలో సాంస్కృతిక ప్రదర్శన

ప్రజలకు అన్నీ శుభాలు కలగాలి

కాచిగూడ: ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయం వద్ద పార్టీ ఎన్నికల ప్రచార రథాలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రోధినామ సంవత్సరంలో ప్రజలకు అన్నీ శుభాలు, విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. సమృద్ధిగా వానలు కురవాలని, పంటలు బాగా పండాలని, రైతులు, ప్రజలకు మేలు కలగాని కోరుకున్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండోసారి బీజేపీ విజయం సాధించేలా కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు మాట్లాడుతూ.. మే 13 వరకు పార్టీ నేతలు, కార్యకర్తలంతా ప్రజల మధ్యలోనే ఉండి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం హాట్రిక్ సాధించేలా ప్రచారం చేపట్టాలని సూచించారు. పార్టీ నేతలు చింతల రాంచంద్రారెడ్డి, శ్యామ్‌సుందర్‌గౌడ్, శ్రీనివాస్, వీరెల్లి చంద్రశేఖర్, రాజశేఖర్‌రెడ్డి, కేశబోయిన శ్రీధర్ తదితరులున్నారు.



బీజేపీ ఎన్నికల ప్రచార రథాలను ప్రారంభించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



పంజగుట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పక్కనున్న మసీదులో మంగళవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. – బంజారాహిల్స్

సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

కాచిగూడ: రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్న 8 లక్షల మంది విద్యార్థుల మెస్ బిల్లు సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సత్వరమే చెల్లించి విద్యార్థుల ఉన్నత చదువులకు బాటలు వేయాలని బీసీ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సైతం విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. విద్యార్థులు ఆకలి కేకలతో అలమటిస్తున్నా.. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. హాస్టల్స్ మెస్ బిల్లులు, భవనాల అద్దె బిల్లులు చెల్లించకపోవడంతో హాస్టళ్లు మూతపడే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పేద విద్యార్థులు విద్యకు దూరమవుతారని, దీనివల్ల ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి హాస్టళ్ల మెస్ బిల్లులు, హాస్టళ్ల భవనాల అద్దె బిల్లులు చెల్లించాలని కోరారు. పెండింగ్ బకాయి బిల్లులు చెల్లించపోతే జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్ఆర్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్ విద్యార్థులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

రాంజీ గోండు స్ఫూర్తితో పోరాడతాం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆదివాసీ విధానాలపై రాంజీ గొండు స్ఫూర్తితో పోరాడుదామని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఉపాధ్యక్షులు బండారు రవికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సామాజిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాంజీ గొండు 164వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు సింహ స్వప్నంగా ఆదివాసీ పోరాటాలు జరిగాయన్నారు. రాంజీగొండు సంతులాల్ తిరుగుబాటు ప్రజల్లో ఉత్సాహాన్ని నింపిందని కొనియాడారు. గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరామ్‌నాయక్, వివిధ సంఘాల నాయకులు ఎం.వీ.రమణ, ఆశయ్య, నరేష్, సైకిలాబ్‌బాబు, జాన్‌వేస్లీ, మూడ్ శోభన్‌నాయక్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక కోర్సులపై యువత ఆసక్తి

రాయదుర్గం: నేటి తరం యువత ఆధునిక కోర్సులకు మొగ్గు చూపుతున్నారని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు పేర్కొన్నారు. ఎమర్జింగ్ టెక్నాలజీపై అమెరికాలోని యూనివర్శిటీ ఆఫ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్‌తో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా మంగళవారం ఓ ఒప్పందం కుదుర్చుకుంది. ఇరు సంస్థలకు చెందిన అధికారులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత ఆసక్తిని చూసి ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ కోర్సులలో భాగంగా 5జీ టెక్నాలజీ, బ్లాక్‌చైన్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ టెక్నాలజీ తదితర ఆధునిక కోర్సులకు సంబంధించి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఇక్కడి యువతకు శిక్షణ ఇచ్చి వారి ఉజ్వల భవితకు తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో ఈ ఒప్పందం చేసుకున్నామన్నారు. అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన యూనివర్శిటీ ఆఫ్ ఎమర్జింగ్ టెక్నాలజీతో ఒప్పందంతో యువతకు మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్కీ కార్యాలయ చీఫ్ లక్ష్మీకాంతరావు, పలు డివిజన్లకు చెందిన హెడ్స్, యూనివర్శిటీ ఆఫ్ ఎమర్జింగ్ టెక్నాలజీ అసోసియేట్ వైస్‌చాన్స్‌లర్ చంద్ర ఎస్ దువక, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాద్ మావూడూరి, ఆర్‌డివి ప్రసాద్ పాల్గొన్నారు.

కుమార్తె కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదు

వెంగళరావునగర్: కుమార్తె కనిపించలేదని ఓ తండ్రి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రహమత్‌నగర్‌లో నివాసం ఉండే సునీల్‌కుమార్ ఆర్టీసీ ఉద్యోగి. ఈ నెల 8వ తేదీ రాత్రి అతడి కుమార్తె(19) బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్‌కాల్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దాంతో ఆందోళన చెందిన శ్రీనివాస్ మంగళవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చంద్ర రాజేశ్వర్‌రావుకు ఘన నివాళి



హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ మాజీ ప్రధానకార్యదర్శి చంద్ర రాజేశ్వర్ రావు వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సభకు సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు సురవరం సుధాకర్‌రెడ్డి, అధ్యక్షులు, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హాజరై మాట్లాడుతూ ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. ప్రజలకు కోసం నిరంతరం తపించే వ్యక్తి అని కొనియాడారు. గత నాలుగు సంవత్సరాలుగా సీఆర్ ఫౌండేషన్ లీజు పునరుద్ధరణ గత ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. నేడు ఫౌండేషన్‌తో పాటు చారిటబుల్ సంస్థ లీజు పునరుద్ధరించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చంద్ర రాజేశ్వర్‌రావుకు నివాళులర్పించిన వారిలో సీఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, కోశాధికారి చెన్నకేశవరావు, ఏఐటీయుసి మాజీ జాతీయ కార్యదర్శి విజయలక్ష్మి, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ కృష్ణకుమారి, వృద్ధాశ్రమం సలహా కమిటి సభ్యులు డాక్టర్ సరస్వతి, రాజేందర్‌రావు, మేనేజర్ శ్రీనివాస్, వృద్ధాశ్రమవాసులు ఉన్నారు.

ఉగాది వేడుకల్లో ఏపీ సీఎం వైఎస్ జగన్ దంపతులు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి వైఎస్ భారతి మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం గంటావారిపాలెం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో నిర్వహించిన ఉగాది పూజా కార్యక్రమాల్లో సీఎం జగన్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారిని వేద పండితులు ఆశీర్వదించారు. తీర్థప్రసాదాలు, ఉగాది పచ్చడిని అందజేయగా సీఎం జగన్ దంపతులు స్వీకరించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ మంచి జరగాలని సీఎం జగన్ ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. 'రాష్ట్ర ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు. శ్రీ క్రోధి నామ సంవత్సరంలో నా అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు, అవ్వాతాతలు, విద్యార్థులు అందరికీ మంచి జరిగి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నాను' అంటూ ట్వీట్ చేశారు.



పల్నాడు జిల్లా గంటావారిపాలెంలో జరిగిన ఉగాది వేడుకలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఆయన సతీమణి వైఎస్ భారతికి ఆశీర్వచనం అందజేస్తున్న వేద పండితులు



తన సతీమణి వైఎస్ భారతి రెడ్డి నుదుటిన బొట్టు పెడుతున్న సీఎం జగన్

నేను బాధితురాలిని

కోర్టులో ప్రస్తావించేందుకు రాసుకొచ్చిన 4 పేజీల లేఖలో కవిత

సాక్షి, న్యూఢిల్లీ: 'నా హక్కులకు భంగం కలగకుండా, ఈ కేసులో పేర్కొన్న విషయాల్లో నాకు ఎలాంటి ప్రమేయం లేదా ఎలాంటి ఆర్థిక ప్రయోజనం లేదని చెప్పాలనుకుంటున్నా. రెండున్నరేళ్లుగా ఈడీ/సీబీఐ దర్యాప్తు ముగింపు లేని దర్యాప్తుగా సాగడం ప్రపంచమంతా చూస్తోంది. ఈ విషయంలో మహిళా రాజకీయ నాయకురాలిగా ఇతరులకన్నా ఎక్కువ బాధితురాలిని నేనే. ఈ కేసు నా వ్యక్తిగత, రాజకీయ ప్రతిష్టను దెబ్బతీసింది. నా వ్యక్తిగత ఫోన్ నంబర్ అన్ని టీవీల్లో ప్రసారం చేయడం నా గోప్యతకు భంగం కలిగిస్తోంది. నేను దర్యాప్తు సంస్థలకు పూర్తిగా సహకరించాను. వారి ముందు నాలుగుసార్లు హాజరయ్యాను. నాకు తెలిసినంత వరకూ వారికి సమాధానమిచ్చాను. నా బ్యాంకు, వ్యాపార వివరాలు తెలియజేశాను. నా ఫోన్లు దర్యాప్తు సంస్థకు ఇచ్చి పూర్తిగా సహకరించినా వాటిని ధ్వంసం చేశానని నిందిస్తున్నారు. రెండున్నరేళ్లలో దర్యాప్తు సంస్థలు అనేక మంది విషయంలో పలుసార్లు దాడులకు పాల్పడటంతోపాటు మానసికంగా, శారీరకంగా వేధించి, బెదిరించి అరెస్టు చేశాయి. అయినప్పటికీ తమ ప్రకటనలను, రాజకీయ పొత్తులను మారుస్తూ వచ్చిన వారి నుంచి కొన్ని స్టేట్‌మెంట్లు సేకరించాయి. ఈ కేసు మొత్తం వాంగ్మూలాల మీదే ఆధారపడి ఉంది. కేసులో డబ్బు లావాదేవీలు ఎక్కడా లేవని... అవినీతికి సంబంధించిన ఆధారాలు లేవనడాన్ని తోసిపుచ్చలేమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు. సాక్షుల్ని తారుమారు చేశారని ఈడీ ఆరోపిస్తోంది. మా పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నన్నెందుకు అరెస్టు చేయలేదు. రెండున్నరేళ్ల దర్యాప్తు విఫలమైన తర్వాత సార్వత్రిక ఎన్నికలకు ముందు కేవలం స్టేట్‌మెంట్ల ఆధారంగా ఎలాంటి ఆధారాలు లేకుండా మార్చి 15న ఈడీ అరెస్టు చేసింది. నాపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ అరెస్టు చేసింది. ప్రస్తుతం ఈడీ/సీబీఐ కేసుల్లో 95 శాతం ప్రతిపక్షాలపైనే ఉన్నాయి. నిందితులు బీజేపీలో చేరితే దర్యాప్తు ఆకస్మికంగా నిలిచిపోతోంది. నోరుమెదపకండి లేకపోతే ఈడీని పంపుతామని బీజేపీ నాయకులు పార్లమెంటు వేదికగానే బెదిరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతిపక్ష పార్టీలు ఏదైనా ఉపశమనం లభిస్తుందని న్యాయస్థానాలు వైపు చూస్తున్నాయి. నేను ఈడీ ప్రక్రియ విధానాలకు సహకరించడం తప్ప ఏమీ చేయలేను. ఆ విధంగానే కొనసాగుతున్నాను. అందుకే నాకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతున్నా. నా జీవితంలో ముఖ్యమైన విషయం ఏంటంటే బాధ్యతయుతమైన తల్లిగా ఉండాలని కోరుకుంటున్నాను. నేను చాలా అర్హతలు కలిగిన వ్యక్తిని. అందుకే కుమారుడు బోర్డు పరీక్షలు, ఆప్టిట్యూడ్ పరీక్షలకు సిద్ధమవుతున్నప్పుడు నా పాత్ర ఏమిటో అర్థం చేసుకున్నాను. నేను ప్రపంచానికి దూరంగా ఉండే వ్యక్తిని కాదు. నేనేమీ ఒకే సంతానం కలిగిన తల్లిని కాదు. తల్లి స్థానాన్ని భర్తీ చేయగలమా? చదువు విషయంలో నా కుమారుడికి ఇది చాలా క్లిష్టమైన సంవత్సరం. నేను గైర్హాజరు కావడం కుమారుడిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని భయపడుతున్నా. అందుకే నా బెయిల్ అభ్యర్థన పరిశీలించాలని మళ్లీ కోరుతున్నా' అని కోర్టులో స్వయంగా ప్రస్తావించేందుకు రాసుకొచ్చిన 4 పేజీల లేఖలో కవిత పేర్కొన్నారు. అయితే ముందుగా దరఖాస్తు చేసుకోనందున కోర్టు అనుమతించకపోవడంతో ఆ లేఖను మీడియాకు విడుదల చేశారు.

అయ్యో వైష్ణవి

- మూడేళ్ల వయసులో తల్లి వదిలేసింది
- రెండేళ్ల క్రితం తండ్రి ఆత్మహత్య
- ఇప్పుడు ఆ బాలిక బలవన్మరణం
- దుండిగల్ స్ఫూర్తి ఫౌండేషన్‌లో ఘటన



వైష్ణవి (ఫైల్)

దుండిగల్: మూడేళ్ల వయస్సు ఉన్నప్పుడే తల్లి వదిలేసి వెళ్లిపోయింది.. రెండేళ్ల క్రితం తండ్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పదకొండేళ్ల వయస్సులోనే ఈ రెండు ఘటనలు ఆ బాలికను కలచివేశాయి. అయినాసరే తట్టుకుని చదువుతోంది.. కానీ ఇప్పుడు అర్థంతరంగా ఏమైందో ఏమో అనుమానాస్పద స్థితిలో అనాథాశ్రమంలో బలవన్మరణానికి పాల్పడింది. సూరారం ప్రాంతానికి చెందిన దివంగత నీలం సతీశ్ కుమార్తె వైష్ణవి(11) దుండిగల్‌లోని స్ఫూర్తి ఫౌండేషన్‌లో ఆరవ తరగతి చదువుతూ అక్కడే ఉంటోంది. వదిన పెళ్లి ఉండటంతో ఈ నెల 3న ఇంటికి వెళ్లిన వైష్ణవి అక్కడ బంధువులతో సంతోషంగా గడిపింది. 8న తిరిగి ఫౌండేషన్‌కు వచ్చింది. ఉదయం తోటి స్నేహితులతో కలిసి ఆనందంగా ఆటలు ఆడింది. అదే రోజు మధ్యాహ్నం తన గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, వైష్ణవి ఉరి వేసుకున్న గదిలోనే గతేడాది మరో బాలిక ఇదే విధంగా ఆత్మహత్యకు పాల్పడటంపై మృతురాలి బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇంటికి వచ్చినప్పుడు సంతోషంగా ఉందని, 8వ తేదీ మధ్యాహ్నం వరకు స్నేహితులతో ఆటలు ఆడిందని, ఇంతలోనే ఆత్మహత్య చేసుకోవడం వెనుక తమకు అనుమానాలు ఉన్నాయని అంటున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా సమగ్ర దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

'టెట్' దరఖాస్తు గడువు పెంపు!

▶ మొదటి పేజీ తరువాయి

దరఖాస్తులొచ్చాయి. ఈ మధ్య కాలంలో బీఈడీ చేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. అయినప్పటికీ పదోన్నతుల కోసం సర్వీస్ టీచర్లు కూడా టెట్ రాయాలన్న నిబంధన ఉండటంతో ఈసారి 3 లక్షల అప్లికేషన్లు వస్తాయని అధికారులు అంచనా వేశారు.

ఎన్‌సీటీఈ నుంచి సమాధానం వస్తేనే స్పష్టత..: 80 వేల మంది టీచర్లు టెట్ అర్హత కోసం దరఖాస్తు చేయాల్సి ఉండగా వారు ముందుకు రాలేదు. సెకండరీ గ్రేడ్ నుంచి స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్‌కు టెట్ అవసరం. కానీ ఎస్‌జీటీగా ఉన్న వ్యక్తి ప్రాథమిక స్కూల్ హెచ్‌ఎంగా వెళితే, అది సమాన హోదాగా టీచర్లు చెబుతున్నారు. మరోవైపు స్కూల్ అసిస్టెంట్లు ప్రాథమిక, ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా వెళ్ళినా హోదాలో మార్పు ఉండదనే వాదన టీచర్లు లేవనెత్తారు. అలాంటప్పుడు టెట్‌తో అవసరం ఏమిటనే దానిపై ఉపాధ్యాయ సంఘాలు స్పష్టత కోరాయి. ఈ నేపథ్యంలో పాఠశాల విద్య అధికారులు దీనిపై స్పష్టత ఇవ్వాలని నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ)కి లేఖ రాశారు. ఒకటి రెండు రోజుల్లో దీనికి సమాధానం వస్తుందని ఆశిస్తున్నారు.

పరీక్ష తేదీల్లో మార్పులు ఉండవు..: కేవలం దరఖాస్తు చేసుకోవడానికి, ఆన్‌లైన్ ఫీజు చెల్లింపుకు మాత్రమే గడువు పెంచే ఆలోచనలో ఉన్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. అంతే తప్ప పరీక్ష తేదీల్లో మార్పు ఉండదని స్పష్టం చేస్తున్నారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం టెట్ పరీక్ష మే 20 నుంచి జూన్ 3వ తేదీ వరకూ జరుగుతుంది. ఫలితాలను జూన్ 12న వెల్లడిస్తారు. ఇందులో అర్హత సాధించిన వారు డీఎస్సీ రాసేందుకు వీలుగా ఆ పరీక్ష గడువునూ పెంచారు.

డీఎస్సీకీ అంతే.. పెద్దగా దరఖాస్తుల్లేవ్ ..: డీఎస్సీ జులై 17 నుంచి 31వ తేదీ వరకూ జరుగుతుంది. అయితే డీఎస్సీకి కూడా ఇప్పటి వరకూ పెద్దగా దరఖాస్తులు రాలేదు. పోస్టులు పెరిగినా కొత్తగా వచ్చిన దరఖాస్తులు తక్కువగానే ఉన్నాయి. రాష్ట్రంలో 11,062 టీచర్ పోస్టుల భర్తీకి సర్కారు డీఎస్సీని ప్రకటించింది. దీనికి కొత్తగా వచ్చిన దరఖాస్తులు 37,700. గతేడాది 5,089 పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్ కోసం 1.77 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరు మళ్ళీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు.

గడువు పెంచాల్సిందే

టెట్ అప్లికేషన్స్ గడువు పెంచి ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలి. ఉగాది, రంజాన్ సెలవుల కారణంగా రాష్ట్రంలో మీ సేవ సెంటర్లు అందుబాటులో ఉండటం లేదు. మొబైల్‌లో టెట్ దరఖాస్తులు పూర్తి చేయడం ఇబ్బందిగా ఉంది.

– రావుల మనోహర్ రెడ్డి (డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు)

జూన్ వరకు నీటి సమస్య రాదు

▶ మొదటి పేజీ తరువాయి

అధికారులను నియమించిన విషయాన్ని గుర్తు చేసింది.

ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందన..: తాగునీటి సమస్య ఉన్నట్లు ఫిర్యాదులు వచ్చినా, వార్తలు వచ్చినా వెంటనే అధికార యంత్రాంగం స్పందిస్తోందని ఆ మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రంలో మొత్తం 143 మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు ఉంటే.. అందులో 130 మునిసిపాలిటీల్లో సాధారణ రోజులతో పోలిస్తే పదిశాతం మేరకు నీటి కొరత ఉన్నా.. ప్రజలకు సరిపడే తాగునీటి సరఫరా జరుగుతోందని వివరించింది. సాధారణ రోజుల్లో ఈ పట్టణాల్లో సగటున 1398.05 ఎంఎల్‌డీ(మిలియన్స్‌లీటర్స్ పర్ డే) తాటి సరఫరా జరిగితే ప్రస్తుతం 1371 ఎల్‌ఎండీల నీటి సరఫరా జరుగుతోందని, 26.31 ఎల్‌ఎండీల కొరత ఏర్పడిందని స్పష్టం చేసింది. పది మునిసిపాలిటీలతోపాటు, రెండు కార్పొరేషన్లలో అధికంగా నీటి ఎద్దడి ఉన్నట్లు గుర్తించినట్లు ప్రభుత్వం పేర్కొంది.

ఖమ్మం, కరీంనగర్‌లో ప్రత్యామ్నాయ చర్యలు..: ఖమ్మం, కరీంనగర్‌లో ఎండలు ముదిరే కొద్ది నీటి ఎద్దడి పెరుగుతుందన్న అంచనాతో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. 27 పట్టణాల్లో 135 ఎల్ పీసీడీ(లీటర్స్ పర్ పర్సన్ పర్‌డే) కంటే ఎక్కువ నీటి సరఫరా జరుగుతుంటే, 48 పట్టణాల్లో 100 నుంచి 135 ఎల్‌పీసీడీల మధ్య, 67 మునిసిపాలిటీల్లో 100 ఎల్‌పీసీడీ కంటే తక్కువ సరఫరా జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో 23,839 ఆవాసాలకు మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా జరుగుతుందని, గ్రామాల్లో నీటి ఎద్దడి లేదని భగీరథ అధికారవర్గాలు చెబుతున్నాయి.

నీటి మట్టాలు తగ్గడం వల్లనే ఎద్దడి..: గడిచిన అక్టోబర్ నుంచి వర్షాలు లేకపోవడం, గోదావరి, కృష్ణా రిజర్వాయర్లలో నీటి మట్టాలు తగ్గడం వల్ల తాగునీటి సమస్య ఉత్పన్నం అయినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

అందుబాటులో గ్రిడ్, స్టాండ్ బై పంపులు

మంచినీటి సమస్య ఎక్కడైనా తలెత్తితే గ్రిడ్ పంప్‌లతో పాటు, స్టాండ్‌బై పంపులు అందుబాటులో ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. జిల్లా స్థాయిలో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులకు జిల్లా కలెక్టర్లకు మొత్తం రూ. 100 కోట్లు నిధులు విడుదల చేసినట్లు తెలిపింది. నాగార్జునసాగర్ నుంచి పాలేరు, ఉదయ సముద్రం రిజర్వాయర్ల నుంచి నల్గొండ, ఖమ్మం పట్టణాలకు నీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేట్టింది. మిడ్ మానేర్, లోయర్ మానేరు నుంచి కరీంనగర్ నగరానికి నీటిని అందించే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. అవసరమైతే కర్ణాటకలోని నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి కొంత నీటిని విడుదల చేయాలంటూ అక్కడి ప్రభుత్వాన్ని కోరాలని ఇరిగేషన్ విభాగం ప్రతిపాదనలు సిద్ధం చేసుకుంది. నారాయణపూర్ నుంచి జూరాల రిజర్వాయర్‌కు వచ్చే నీటితో గద్వాల మిషన్ భగీరథకు తాగునీటి సరఫరా చేసుకోవచ్చని భావిస్తున్నట్లు అధికారవర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు 131 పట్టణాల్లో 294 ప్రభుత్వ ట్యాంకర్లతో పాటు 97 ట్యాంకర్లను అద్దెకు తీసుకుని, అత్యవసరమైతే ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది.

కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

▶ మొదటి పేజీ తరువాయి

కవితను బెయిల్‌పై విడుదల చేస్తే సాక్ష్యాలు తారుమారయ్యే అవకాశం ఉందన్నారు. చార్జిషీటులో కవిత పాత్రపై స్పష్టత ఇవ్వడానికి మరో 14 రోజుల గడువు కావాలని కోరారు. అయితే కస్టడీ పొడిగింపు ద్వారా ఈడీ తెలుసుకోవాల్సిన విషయాలేవీ లేవని కవిత తరఫు న్యాయవాది నితీష్ రాణా వాదించారు. ఈ కేసులో రెండేళ్లుగా దర్యాప్తు కొనసాగుతున్నా ఈడీ ఆధారాలేవీ చూపలేదన్నారు. కవితకు స్వయంగా మాట్లాడే అవకాశం ఇవ్వాలని కోరారు. కానీ అందుకు న్యాయమూర్తి నిరాకరించారు. నిందితులకు నేరుగా మాట్లాడే హక్కు ఉందని కవిత న్యాయవాది తెలపగా అందుకోసం దరఖాస్తు చేసుకోవాలని న్యాయమూర్తి సూచించారు. వాదనల అనంతరం కవిత జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 23 వరకు పొడిగిస్తూ జడ్జి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కోర్టు అనుమతితో కవితను ఆమె భర్త, మామ కలిసి కాసేపు మాట్లాడారు.

నగర వార్తలు


ఓయూ వేదికగా కొత్త పార్టీ ఏర్పాటు!

- 15న ఆర్ట్స్ కాలేజీలో రౌండ్‌టేబుల్ సమావేశం
- ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసే దిశగా అడుగులు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో మరో కొత్త రాజకీయ పార్టీ పురుడు పోసుకునే సూచనలు కన్పిస్తున్నాయి. దానికి ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా మారనుంది. నూతన రాజకీయ పార్టీ ఏర్పాటుకు విద్యార్థి నేతలు కసరత్తు చేస్తున్నారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న జాతీయ, రాష్ట్ర పార్టీలలో నాయకత్వ మార్పు జరగడం లేదని, సంపన్న వర్గాల చేతుల్లోనే విధాన నిర్ణయాలు కొనసాగుతున్నాయని గ్రహించిన విద్యార్థి నేతలు కొత్త పార్టీ స్థాపనకు నడుంబిగించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థి నేతలను విస్మరించి పార్టీలు మారే నాయకులకు, సీనియర్లు, వారసులకే రాజకీయ అవకాశాలు కల్పిస్తున్నాయని వారు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త పార్టీ ఏర్పాటు చేసి పార్లమెంట్ ఎన్నికల్లో సైతం పోటీ చేయాలనే యోచనలో ఉన్నారు. సామాజిక న్యాయాన్ని తుంగలో తొక్కి డబ్బు గల వ్యక్తులకే రాజకీయ అవకాశాలు కల్పిస్తున్న ప్రస్తుత పార్టీలకు భిన్నంగా అమెరికా, యూకే, రష్యా తదితర విదేశాల మాదిరి ఖర్చు లేకుండా సేవాభావంతో కొనసాగే నాయకుల కోసం పార్టీని ఏర్పాటు చేయడానికి రంగం సిద్ధం చేశారు. ఈ నెల 15న ఆర్ట్స్ కాలేజీలో నూతన పార్టీ ఏర్పాటుపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్‌లోకి జంపన

మైనంపల్లితో భేటీ అనంతరం ప్రకటన



కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో బీజేపీకి మరో షాక్ తగలనుంది. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైంది. కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జ్ మైనంపల్లి హన్మంతరావు మంగళవారం సాయంత్రం జంపనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో చేరాల్సిందిగా ఆహ్వానించారు. ఇందుకు అంగీకరించిన జంపన బుధవారం తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరేందుకు సుముఖత వ్యక్తం చేశారు. బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ప్రతాప్ స్పష్టం చేశారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జైప్రకాశ్, సామల రాఘవరెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో కొత్త కోర్సుకు శ్రీకారం

ఏఐ/ఎంఎల్‌పై కొత్త కోర్సు

- ఐహబ్-డాటా ద్వారా 6 నెలల శిక్షణ
- దరఖాస్తు గడువు మే 5వ తేదీ
- తరగతులు మే 19 నుంచి ప్రారంభం

రాయదుర్గం: హైదరాబాద్ ట్రిపుల్ ఐటీలో కొత్త కోర్సుకు శ్రీకారం చుట్టారు. ట్రిపుల్ ఐటీలోని ఏర్పాటు చేసిన టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్(ఐ హబ్) డాటా ద్వారా ఆరు నెలల శిక్షణకు అడ్మిషన్లు కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/ మెషీన్ లెర్నింగ్‌పై ఈ కొత్త కోర్సు ఏర్పాటు చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ చాటిన వారి కోసం ఏఐ/ఎంఎల్‌పై ఆరు మాసాల శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేశారు. అన్ని ఆదివారాల్లో షెడ్యూల్ చేయబడిన తరగతులకు, కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థుల భౌతిక హాజరు అవసరం, ఆరు నెలల కోర్సులో ఆధునిక ఏఐ/ఎంఎల్ గురించిన సిద్ధాంతం, ట్యూటోరియల్‌లు, ప్రాజెక్టులకు సంబంధించిన కాన్సెప్ట్‌ల వివేకవంతమైన మిశ్రమంగా దీన్ని రూపొందించారు. కోర్సు కోసం దరఖాస్తు నమోదు చేసుకోవడానికి మే 5 చివరితేదీ అని పేర్కొన్నారు. తరగతులను మే 19 నుంచి ప్రారంభించనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు కోఆర్డినేటర్ ఫాతిమత్ రిఫ్నాను 040-66531787 నంబర్‌లో సంప్రదించాలి. కోర్సుపై మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ ihubdata.ai ను సంప్రదించవచ్చు.

ఎంఎల్ సాంకేతికతలపై విద్యార్థులకు శిక్షణ

◆ ట్రిపుల్ ఐటీ రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ సీవీ జవహర్ ఆధునిక మెషిన్ లెర్నింగ్‌లో అత్యాధునిక సాంకేతికతలపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం, సన్నద్ధం చేయడం మా లక్ష్యాలలో ఒకటని, ఈ క్రమంలోనే ట్రిపుల్‌ఐటీ, ఐహబ్ డాటా ఆధ్వర్యంలో ఈ కోర్సుకు శ్రీకారం చుట్టామని ట్రిపుల్ ఐటీ రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ సీవీ జవహర్ పేర్కొన్నారు. కొత్త కోర్సు ప్రారంభ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ నగరంలో పెద్ద సంఖ్యలో కార్పొరేట్ సంస్థలు ఈ కార్యక్రమం ద్వారా పరోక్షంగా ప్రయోజనం పొందుతాయన్నారు. ఐహబ్ డేటా ఎడ్యుకేషనల్ ప్రోగ్రామ్స్ హెడ్ సీకే రాజు మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో నిర్వహించే వారాంతపు శిక్షణ కార్యక్రమం ఇది మూడవ ఎడిషన్ అని పేర్కొన్నారు.

మన దేశ సంస్కృతి చాలా గొప్పది

గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

శంషాబాద్ రూరల్: 'భారత దేశంలో భాషలు వేరైనా ప్రజల భావం ఒక్కటే..ధర్మ భావమే ప్రజలందరినీ ఐక్యంగా ఉంచుతుంది..అదే మన సంస్కృతి గొప్పదనం, దేశ బలం' అని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో మంగళవారం నిర్వహించి క్రోధి నామ ఉగాది వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. నిర్మాణం ఎంత అందంగా ఉన్నా దాని పటిష్టత మనం వేసే పునాదులపై ఉంటుందన్నారు. అలాగే ప్రతి మనిషి గర్వపడే తన మూలాలను ఉగాది పండగ గుర్తు చేస్తుందన్నారు. తెలుగు భాష వినసొంపైనదని, తెలుగులో కీర్తనలు వింటే మనసు ప్రశాంతం అవుతుందన్నారు. తమిళనాడులో ఉగాది వేడుకలను కొత్త సంవత్సరంలా కాకుండా గ్రామీణ దేవతలను గ్రామస్తులు పూజించి తీర్థం తీసుకుంటారని తెలిపారు.

దేశ ప్రగతికి అందరూ కృషి చేయాలి

దేశం అజేయ శక్తిగా..ప్రబల ఆర్థిక శక్తిగా ఎదగడానికి ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. ఉగాది పురస్కరించుకుని ప్రతి ఒక్కరు ఇందుకోసం సంకల్పం తీసుకోవాలన్నారు. దేశం అంతర్జాతీయ సూపర్ పవర్‌గా అవతరించే దిశలో వేగంగా అడుగులు వేస్తుందన్నారు. వివిధ రాష్ట్రాలో వేర్వేరు పేర్లతో ఉగాది వేడుకలు జరుపుకుంటారని.. ఏ పేరుతో పిలిచినా ఉగాది పండగ కాలం ప్రాధాన్యాన్ని తెలియజేస్తుందన్నారు. యువతరానికి పండగల ప్రాముఖ్యత తెలియాల్సిన అవసరం ఉందన్నారు. క్రోధి నామ సంవత్సరం అందరి జీవితాల్లో ఆనందాన్ని, ఆరోగ్యాన్ని, సానుకూల మార్పులను తీసుకురావాలని ఆకాంక్షించారు.. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ క్రోధి నామ సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా కురిసి దేశ, రాష్ట్ర ప్రజలు పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. అంతకు ముందు మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి ఉగాది ప్రాశస్త్యాన్ని వివరించగా..చిర్రావూరి విజయానంద శర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు సిహెచ్.కృష్ణప్రసాద్, గ్రాన్యూల్స్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.ఉమ తదితరులు పాల్గొన్నారు.



ఉగాది వేడుకలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

కేబుల్ బ్రిడ్జిపై అర్ధరాత్రి వరకు స్పెషల్ డ్రైవ్

- 23 మందికి చలానాలు
- రెండో సారి పునరావృతం అయితే కేసు నమోదు



కేబుల్ వంతెనపై పార్కింగ్ చేసిన వారికి చలానా విధిస్తున్న పోలీసులు

గచ్చిబౌలి: కేబుల్ బ్రిడ్జిపై అర్ధరాత్రి సెల్ఫీ దిగుతూ ఓ యువకుడు మృతి చెందిన ఘటనతో పోలీసులు అప్రమత్తమయ్యారు. మాదాపూర్ ట్రాఫిక్ సీఐ నర్సింహ్మా, లా అండ్ ఆర్డర్ సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం అర్ధరాత్రి దాటే వరకు ఇక్కడ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బ్రిడ్జిపై వాహనాలు పార్కింగ్ చేసిన 23 మందికి చలానా విధించారు. రెండో సారి పట్టుబడితే కేసు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. రాత్రి సమయంలో దుర్గం చెరువు అందాలను తిలకించేందుకు నగరం నలుమూలల నుంచి కేబుల్ బ్రిడ్జిపైకి జనం తండోపతండాలుగా వస్తున్నారు. వీకెండ్, సెలవు దినాల్లో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. బ్రిడ్జిపై వాహనాలు పార్కింగ్ చేయడం, బర్త్ డేలు జరుపుకోవడం, సెల్ఫీలు దిగడం సరి కాదని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు. వాహనాలను బ్రిడ్జి బయట పార్కింగ్ చేసి రెండు వైపులా ఉన్న పాత్ వేలోనే సందర్శకులు ఉండాలని పేర్కొంటున్నారు.

క్రాస్ కంట్రీ టోర్నీ విజేత ఆస్ట్రేలియా జట్టు




ఆస్ట్రేలియా జట్టును సన్మానించిన మహేందర్‌ముదిరాజ్, గోవర్ధన్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్: దేహదారుఢ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని కాంగ్రెస్ పార్టీ మత్స్యకార్మిక సంఘం చైర్మన్ జిల్లా నారాయణపురం మహేందర్ ముదిరాజ్ అన్నారు.

హైదరాబాద్ ఆఫ్ తెలంగాణ, ఆస్ట్రేలియాకు సంబంధించిన జట్ల మధ్య బాకారంలో రెండు రోజులపాటు క్రాస్ కంట్రీ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన ఆస్ట్రేలియా జట్టుకు నిర్వాహకుడు గోవర్ధన్‌రెడ్డితో కలిసి మంగళవారం ట్రోఫీ అందజేశారు. ఇరు జట్ల క్రీడాకారులను శాలువాలతో సత్కరించారు. బాకారం వంటి చిన్న గ్రామంలో జరిగిన టోర్నీలో హైదరాబాద్ ఆఫ్ తెలంగాణ, ఆస్ట్రేలియా జట్లు పాల్గొనడంతో స్థానికులు ఆసక్తిగా మ్యాచ్ తిలకించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇమ్మడి మధుసూదన్‌రెడ్డి, ఇమ్మడి రవీందర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, మహ్మద్ జఫార్, కిట్టు, క్రికెట్ కోచ్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచచరిత్ర గతిని మార్చిన రచయిత మార్క్స్

జస్టిస్ చంద్రకుమార్



'భారత జాతీయవాదం- మతోన్మాద ప్రమాదం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ చంద్రకుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రపంచ చరిత్రగతిని మార్చిన గొప్ప రచయిత కారల్ మార్క్స్ అని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ప్రముఖ రచయిత రామ్‌పునియాని రచించిన, ప్రజాశక్తి మాజీ సంపాదకులు ఎస్.వినయ్‌కుమార్ అనువాదం చేసిన 'భారత రాజకీయవాదం- మతోన్మాద ప్రమాదం', కోమాకుల సూరిబాబు సేకరణ అలనాటి సినీనాటక రంగ ప్రముఖుల పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ఒక పుస్తకం రాయాలంటే ఎంతో ఒడిదుడుకులను ఎదుర్కోవాల్సి వస్తుందని కారల్‌మార్క్స్ «దాస్ క్యాపిటల్»అనే పుస్తకాన్ని రాయడానికి ఎంతో కష్టపడాల్సి వచ్చిందని చెప్పారు. ఎంగిల్స్ సహకారంతో మార్క్స్ పుస్తకాన్ని రచించారన్నారు. మతం అనేది మనిషి ఆత్మవిశ్వాసాన్ని పెంచే విధంగా ఉండాలే తప్ప ఉన్మాదిగా మారేవిధంగా ఉండకూడదని చెప్పారు. నేటి భారత రాజకీయాలు ప్రజలకు జవాబుదారీతనంగా లేవని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త విజయదుర్గా, ఎస్‌వీకే ట్రస్ట్ కార్యదర్శి వినయ్‌కుమార్, కోమాకుల సూరిబాబు, కళాకారులు అక్కిరాజు సుందరరామకృష్ణ, మల్లాది రామకృష్ణ, బీడీఎల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

మహనీయుల జయంతి ఉత్సవాల పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న కృష్ణయ్య తదితరులు

మలక్‌పేట: తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్స్ అసోసియేషన్ (టీఎస్ఎస్ఏ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహనీయుల జయంతి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఎంపీ ఆర్.కృష్ణయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ల మహేష్‌కుమార్ మాట్లాడుతూ..ఈ నెల 14 తేదీన మూసారంబాగ్ చౌరస్తాలో మహాత్మా జ్యోతిరావు పూలే, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ కృష్ణయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరవుతారని అన్నారు. పేదలకు అన్నదానం కార్యక్రమం ఉంటుందన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. విద్యార్థి నాయకులు ప్రవీణ్‌కుమార్, యశ్వంత్, సతీష్‌లాల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



హన్సా యోగేంద్ర

వయసు 76 ఉత్సాహం 16

మన దేశంలో యోగా గురువులంటే పురుషులే కనిపిస్తుంటారు. కాని హన్సా యోగేంద్ర యోగా గురువుగా చేసిన కృషి ఎవరికీ తక్కువ కానిది. ముఖ్యంగా వయోవృద్ధులలో నైరాశ్యం తొలగి జీవన ఉత్సాహం ఏర్పడాలంటే ఏం చేయాలో ఆమె వీడియో పాఠాల ద్వారా తెలియచేస్తుంది. ఆలోచన, ఆహారం, ఆరోగ్యం ఈ మూడింటికీ మార్గదర్శి హన్సా యోగేంద్ర.

ముందు మనం హన్సా యోగేంద్ర రోజువారీ జీవితం చూద్దాం. ఆమె ఉదయం 5 గంటలకు నిద్ర లేస్తారు. కాసేపు మంచం మీదే పవన ముక్తాసన వంటి ఒకటి రెండు ఆసనాలు వేస్తారు. కొన్ని నిమిషాల ప్రాణాయామం చేస్తారు. ఓంకార ధ్వని చేస్తారు. 'ఇది సృష్టిలోని శక్తిని మీకు అనుసంధానిస్తుంది' అంటారు. అప్పుడు 'మార్నింగ్ డ్రింక్' తాగుతారు. అంటే టీ, కాఫీ కాదు. రాత్రంతా వెండిగ్లాసులో ఉంచిన నీటిని కాచి దానిలో ఉసిరి, అల్లం, మిరియాలు, పసుపు, అశ్వగంధ మిశ్రమాల పొడిని కొద్దిగా కలిపి కాస్త నిమ్మకాయ పిండి ఆ కషాయాన్ని తీసుకుంటారు. 'ఇది జఠరాగ్నికి చాలా మంచిది' అంటారామె. ఆ తర్వాత కాసేపు మత్స్యాసనం, భుజంగాసనం, శలభాసనం వేస్తారు. సరిగ్గా 8.30 అల్పాహారం తీసుకుంటారు. అల్పాహారం అంటే రాత్రి నానబెట్టిన డ్రైఫ్రూట్స్. చివరలో పాలు. ఆ తర్వాత ఆమె యోగా వీడియోలు రికార్డు చేస్తారు. లేదంటే తమ మానసిక శారీరక బాధలు చెప్పుకోవడానికి వచ్చే అనుయాయుల సమస్యలు విని కౌన్సెలింగ్ చేస్తారు. మధ్యాహ్నం భోజనంలో ఒక రోటీ, పప్పు, ఏదైనా కూర. 'నేను భోజన బల్ల మీద నీళ్ల గ్లాస్ పెట్టుకోను. మజ్జిగ గ్లాసు పెట్టుకుంటాను. నీళ్ల కంటే మజ్జిగ మన జీర్ణక్రియకు మంచిది' అంటారామె. ఆ తర్వాత పనిలో పడతారు. సాయంత్రం కాసేపు వాకింగ్ చేస్తారు. ఉడకబెట్టిన పప్పులేవైనా తీసుకుంటారు. రాత్రి సూప్‌తో పాటు, ఇడ్లీ సాంబార్ లాంటివి భుజిస్తారు. రాత్రి సరిగ్గా 10.30కు నిద్ర పోతారు. 'జీవితం ప్రశాంతంగా గడవాలంటే సిస్టమేటిక్‌గా ఉండాలి' అంటారామె.


హన్సా యోగేంద్ర

■ యోగా గురువు

హన్సా యోగేంద్ర ముంబైలో పుట్టి పెరిగింది. చిన్న వయసులోనే యోగా పట్ల ఆకర్షితురాలైంది. బిఎస్సీ, ఎల్ఎల్‌బీ చేసినా మనసు యోగా వైపుకు లాగడంతో ప్రఖ్యాత యోగా గురువు యోగేంద్ర స్థాపించిన 'ది యోగా ఇన్‌స్టిట్యూట్'కు తరచూ వెళ్లేది. అక్కడే ఆమె యోగేంద్ర కుమారుడు జయదేవ యోగేంద్ర దగ్గర యోగా నేర్చుకుంది. ఆ తర్వాత జయదేవను వివాహం చేసుకుంది. ఈ పెళ్లికి ఆమెవైపు పెద్దలు అంగీకరించలేదు. కాని తన జీవితాన్ని యోగాకు అంకితం చేయాలన్న నిశ్చయంతో ఆమె జయదేవను వివాహం చేసుకుంది. ఆ తర్వాత భర్తతో కలిసి యోగా కేంద్రాన్ని వృద్ధిలోకి తెచ్చింది. ఇప్పుడు ఆమె 76 సంవత్సరాలు. గత ముప్పై, నలభై ఏళ్లలో ఆమె సంస్థ ద్వారా తయారైన యోగా టీచర్లు, ఆమె ద్వారా కనీసం లక్షమంది ప్రపంచవ్యాప్తంగా ఉన్నారు. ఇవాళ ఆమె చేసే వీడియోలు లక్షల్లో చూస్తున్నారు. జీవితాన్ని ఆనందమయం చేసుకోవడానికి యోగా ఉత్తమ మార్గం అంటారామె.

■ అలవాట్లు.. ఆలోచనలు

అలవాట్లు. ఆలోచనల మీద నియంత్రణ అన్నది జీవితాన్ని అదుపులో ఉంచుతుందని అంటారు హన్సా. అర్థవంతంగా జీవించడం ప్రతి ఒక్కరి అవసరం అని చెబుతారు. విపరీతమైన పరుగులాట, వేళకాని వేళ భోజనం, వేళకాని వేళలో నిద్ర... ఇవి జీవితానికి, ఆరోగ్యానికి ప్రధాన శత్రువులంటారామె. ఇవే అనవసర వృద్ధాప్యాన్ని తెస్తున్నాయని అంటారు. ప్రకృతిలో దొరికే అందరికీ తెలిసిన పదార్థాలతోనే అకాల వృద్ధాప్యాన్ని నిరోధించవచ్చంటారు. కాఫీ, టీ వంటివి కూడా శరీరానికి అక్కర్లేదని అవి అలవాటుగా మారి నాడీ వ్యవస్థను డీలా పరుస్తాయంటారు. 'ఐదు ముఖ్యమైన ఉదయపు అలవాట్లు', 'మంచినీరు తాగాల్సిన పద్ధతి', 'ప్రతి స్త్రీ వేయాల్సిన ఐదు ఆసనాలు', 'స్నానం చేయాల్సిన పద్ధతి', 'ఎలాంటి ఆహారం తీసుకోవాలి', 'జబ్బులు రానివ్వని ఐదు ముద్రలు'... ఆమె చేసిన ఇలాంటి వీడియోలన్నీ పెద్దఎత్తున ఆదరణ పొందాయి. సాత్విక ఆహారం గురించి 'ది సాత్విక్ కిచెన్' అనే పుస్తకం రాశారామె. 'ఆధ్యాత్మికత, ఆసనాలు మన జీవితానికి మార్గం చూపుతాయి. మిమ్మల్ని మీరు తెలుసుకోండి. తెలుసుకొని ఆధ్యాత్మికంగా మీ బలహీనతలను జయించండి' అంటారు హన్సా. 'జీవితం విసిరే సవాళ్లకు సిద్ధంగా ఉండి రిస్క్ తీసుకునైనా నిజాయితీగా పోరాడితే జీవితం కచ్చితంగా మీకు సంతోషాలనే ఇస్తుంది. జీవితాన్ని అనవసర జంజాటాల్లో పడేయకండి' అంటారామె. హన్సా కుమారుడు రిషి జయదేవ్ యోగేంద్ర కూడా యోగ సాధనలో ఉన్నాడు. 'అతన్ని చూసి నేను గర్విస్తున్నాను' అంటారామె.

యూత్ పల్స్

100 అవర్ రూల్



డబ్బును పెట్టుబడిగా పెట్టడమే ఎక్కువమందికి తెలుసు. 'టైమ్'ను పెట్టుబడిగా పెడితే? 'ఫలితాలు మనల్ని ఎక్కడికో తీసుకువెళతాయి' అంటుంది 100–అవర్ రూల్. బ్యూటీబ్రాండ్ 'మామా ఎర్త్' కో–ఫౌండర్ గజల్ అలఘ్ 'ఎక్స్'లో షేర్ చేసిన '100–అవర్ రూల్' పోస్ట్ యువలోకంలో చక్కర్లు కొడుతుంది. కంఫర్ట్ జోన్ నుంచి బయటికి వచ్చి కొత్త స్కిల్స్ వేగంగా నేర్చుకోవడంపై దృష్టి పెట్టే '100–అవర్ రూల్'పై యువతరం ఆసక్తి ప్రదర్శిస్తోంది. ఆ రూల్‌ను ఆచరణలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది...

'మనకు చాలా సహజంగా వినిపించే ప్రశ్న... అరే అది ఎలా నేర్చుకున్నావు? అని. ఇలాంటి వారికి నేను వెంటనే ఇచ్చే సమాధానం... 100–అవర్ రూల్. కొత్త స్కిల్‌ను సొంతం చేసుకోవడానికి వంద గంటలు పూర్తిగా కేటాయించండి' అంటుంది గజల్ అలఘ్.

'వ్యక్తిత్వ వికాసం, స్కిల్ డెవలప్‌మెంట్‌పై 100– అవర్ రూల్ సానుకూల ప్రభావం చూపుతుంది' అని చెబుతున్న గజల్ ఆ రూల్‌ని స్వయంగా ఆచరించి సత్ఫలితాలను సొంతం చేసుకుంది.

ఆమె దృష్టిలో 100–అవర్ రూల్ అనేది గేమ్ చేంజర్.

గజల్ పోస్ట్ చూసి 'ఐ విల్ హ్యావ్ టు ట్రై ఇట్' అన్న అనేకమందిలో బెంగళూరుకు చెందిన హాసిని ఒకరు. కర్నాటక సంగీతం నేర్చుకోవాలనేది తన చిరకాల కల. అయితే అది కలగానే మిగిలి పోతుంది. '100–అవర్ రూల్' గురించి చదివిన తరువాత, సోషల్ మీడియాలో ఈ రూల్‌పై వెల్లువెత్తుతున్న ఉత్సాహాన్ని చూస్తున్న తరువాత '100 అవర్ రూల్‌లో భాగంగా ఎలాగైనా సరే ఎంతోకొంత కర్నాటక సంగీతం నేర్చుకోవాల్సిందే' అని డిసైడైపోయింది.

'సంవత్సరంలో వంద గంటలు, రోజులో పద్దెనిమిది నిమిషాలు మనం నేర్చుకోవాలనుకుంటున్న దానిపై కేటాయిస్తే ఎంతోమందికి కంటే మెరుగ్గా ఉంటాం' అంటుంది 'ఎక్స్' యూజర్ విష్ణుప్రియా అరోర.

'100–అవర్ రూల్‌లో భాగంగా రోజులో కొంత సమయాన్ని నాకు ఇష్టమైన పెయింటింగ్‌కు కేటాయిస్తున్నాను' అంటున్నాడు భోపాల్‌లోని ఎంబీఏ స్టూడెంట్ అభయ్ కుమార్.

పెయింటింగ్, క్రియేటివ్ రైటింగ్, ఫొటోగ్రఫీ టెక్నిక్స్, కొత్తభాష నేర్చుకోవడం, ఇన్‌స్ట్రుమెంట్స్ ప్లే... మొదలైన వాటికి సంబంధించి ఈ టెక్నిక్ బాగా ఉపయోగపడుతుంది.

'బిగినర్స్‌ను 100 అవర్ రూల్ కాన్ఫిడెంట్ క్రియేటర్‌గా ట్రాన్స్‌ఫార్మ్ చేస్తుంది' అంటున్నారు నిపుణులు.

కాస్త వెనక్కి వెళితే...

రచయిత గ్లాడ్‌వెల్ 10,000– అవర్ రూల్‌ను డెవలప్ చేశాడు. తన 'అవుట్‌లియర్స్' పుస్తకంలో 10,000– అవర్ రూల్ గురించి వివరించాడు. ఈ రూల్‌కు మంచి పాపులారిటీ వచ్చింది. ఆ తరువాత '100–అవర్ రూల్' అనేది పవర్‌ఫుల్ అనే వాదన వచ్చింది. '100–అవర్' సక్సెస్‌కు ప్రధాన కారణం మనం నేర్చుకోదల్చిన స్కిల్ లేదా ఏరియాను చిన్న కంపోనెంట్స్‌గా విభజించి దానిమీద ఫోకస్ చేయడం.

10,000 అవర్ రూల్ ప్రాక్టీస్ కొంతమందికి కష్టం కావచ్చు. మొదట ఉత్సాహంతో మొదలుపెట్టినా ఆ తరువాత మధ్యలోనే జారిపోవచ్చు. 100–అవర్‌కి అలాంటి పరిమితులు ఉండకపోవడం లాంటివి పాపులారిటీకి కారణం కావచ్చు.

'నైపుణ్యాన్ని సొంతం చేసుకునే విషయంలో 100–అవర్ రూల్ వాస్తవిక మార్గంలో ప్రయాణిస్తుంది. అయితే 10,000– అవర్ అయినా 100–అవర్ రూల్‌కు అయినా కృషి, అంకిత భావం ముఖ్యం' అంటున్నారు నిపుణులు.

అవలీలగా...

వ్యక్తులు కొత్త స్కిల్స్‌ను సొంతం చేసుకోవడానికి 100–అవర్ రూల్ ఉపయోగపడుతుంది. సాధనకు సంబంధించి వారి పరిధిని మరింత విస్తరిస్తుంది. ఒకప్పుడు సాధించలేని, సాధించలేమని అపోహ పడిన వాటిని కూడా సాధించేలా చేస్తుంది. నా వ్యక్తిగత విషయానికి వస్తే ఈ రూల్‌ను అనుసరించడం ద్వారా ఉత్తమఫలితాలు అందుకున్నాను. కష్టపడి పనిచేస్తే, దేనికైనా తగినంత సమయం కేటాయిస్తే ఎలాంటి స్కిల్ అయినా అవలీలగా సొంతం అవుతుంది.

– గజల్ అలఘ్, 'మామా ఎర్త్' కో–ఫౌండర్



అవకాశాలను సృష్టించుకోవాలి!

మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఆరుషి ఢిల్లీ వాసి. కాలేజీ రోజుల నుంచే ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా ఫ్యాషన్ డ్రెస్సులు, జ్యువెలరీ అమ్మకాలు చేపట్టింది. ఏడేళ్ల క్రితం 30 వేల రూపాయలతో 'లావిష్' పేరుతో సొంతంగా కంపెనీ ఏర్పాటు చేసి, విదేశాలకూ తన ఉత్పత్తులను సరఫరా చేస్తోంది. పాతికమందికి పైగా మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించింది. దేశంలో గ్రామీణ మహిళా కళాకారులను గుర్తించి, వారితో నెట్‌వర్కింగ్ ఏర్పాటుచేసి, ఉపాధి కల్పిస్తోంది. 'అవకాశాలను వెతకడం కాదు, మనమే సృష్టించుకోవాలి' అంటున్న ఆరుషి నేటి తరానికి స్ఫూర్తిదాయకం.


ఆరుషి

''నేను ఫ్యాషన్ డ్రెస్సులు, కస్టమైజ్డ్ జ్యువెలరీ, డెకరేటివ్ వస్తువులు, పిల్లల బట్టలు, ఇతర ఉపకరణాలను ఎగుమతి చేస్తుంటాను. నాకు మొదటి నుంచి బిజినెస్ అంటే ఇష్టం. కాలేజీ రోజుల్లో అమ్మతో కలిసి అనేక ఈ–కామర్స్ సైట్‌లలో చీరలు, సూట్‌లు అమ్మేదానిని. కానీ, చాలా పోటీ అనిపించేది. ఏదైనా సరే భిన్నంగా చేయాలనే కోరిక ఉండేది. కానీ, సరైన మార్గం దొరికేది కాదు. కాలేజీలో చదువుతూనే ఓ కంపెనీలో ఉద్యోగం కూడా చేశాను. కానీ, నాకు నేనుగా నిరూపించుకునే పనిచేయాలనుకునేదాన్ని. దీంతో ఆ ఉద్యోగాన్ని వదిలేసి పూర్తి సమయాన్ని వ్యాపారానికి కేటాయించాలనుకున్నాను. ఉద్యోగం ద్వారా సంపాదించిన మొత్తంతో సొంతంగా వ్యాపారం చేయాలనుకున్నాను. 30 వేల రూపాయలతో 'లావిష్' అనే పేరుతో కంపెనీని రిజిస్టర్ చేయించాను. అమెజాన్‌తో కలిసి చీరలు, ఫ్యాషన్ జ్యువెలరీ వంటివి అమ్మడం మొదలుపెట్టాను. రెండేళ్లు ఈ పనులు ఇలాగే కొనసాగాయి.

■ అంతర్జాతీయంగా..

అమ్మే ఉత్పత్తులకు నా సొంత ఆలోచనను జోడించాను. సొంతంగా డిజైన్లు చేయడంతో పాటు కొనుగోలుదార్లు అడిగే డిజైన్లపైనా పనిచేయడం మొదలుపెట్టాను. కస్టమైజ్డ్ డిజైన్లు అవడంతో ఆర్డర్లు విరివిగా రావడం మొదలయ్యాయి. దేశంలోనే కాదు అంతర్జాతీయంగానూ కొనుగోలుదార్లు పెరిగారు. పాతికలక్షలకు పైగా టర్నోవర్ సాధిస్తున్నాను.

■ మహిళలు మాత్రమే

నా కంపెనీలో మహిళలు మాత్రమే పనిచేస్తున్నారు. దేశంలోని గ్రామాల నుండి కళాకారుల సమాచారం సేకరిస్తాను. వారి నైపుణ్యాలను మెరుగుపరుస్తాను. అక్కడ ఉత్పత్తులను తయారు చేయించి, వాటిని విక్రయిస్తాను. మహిళలు మాతో కనెక్ట్ అవడానికి ప్రత్యేక ప్రయోజనం కూడా ఉంది. తమ ఉత్పత్తులను మార్కెటింగ్ చేయనవసరం లేదు. అమ్ముకోవడం కోసం బయటికి వెళ్లనక్కరలేదు. ఇంట్లో కూర్చొని ఉపాధి పొందవచ్చు. అంతేకాదు, వారి నైపుణ్యాలను ప్రపంచం గుర్తిస్తుంది. దీనిద్వారా ఎంతోమంది మహిళలకు ఉపాధి లభిస్తుంది. మన హస్తకళలకు ముఖ్యంగా ఆభరణాలకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. విదేశీ మహిళలకు రాజస్తానీ వస్త్రధారణ, బంజారా నగలు అంటే పిచ్చి. వారు భారతీయ సంస్కృతిని చాలా ఇష్టపడతారు. దీని కారణంగానే వారు భారతీయ డ్రెస్సులు, ఆభరణాలవైపు ఆకర్షితులవుతారు.

■ ఒంటరి తల్లి

నా సక్సెస్ వెనక మా అమ్మ మద్దతు చాలా ఉంది. నేను ముందడుగు వేయడంలో అమ్మ ఎప్పుడూ ప్రోత్సహిస్తుంటుంది. మా చెల్లినీ, నన్ను అమ్మ ఒంటరిగా చాలా కష్టపడి పెంచింది. ఆ కష్టంలో... నేను నా మార్గం కనుక్కోవడానికి ధైర్యాన్ని కూడా ఇచ్చింది. అందుకే ఈ రోజు వరకు 12 దేశాలకు ఒంటరిగా వెళ్లి, సందర్శించగలిగాను.

■ ఇంటి పేరుకు నో!

నా పేరుకు ఇంటిపేరు జోడించకూడదని నా సొంత నిర్ణయం. అందుకే, నా పేరుకు ముందు సర్‌నేమ్ ఉండదు. ఒక వ్యక్తి చేసే పనే వారి గుర్తింపు అవుతుంది. అందుకే, ఇంటి పేరును జత చేసుకోవాల్సిన అవసరం లేదని నేను భావించాను. అందుకు మా అమ్మ కూడా మద్దతు తెలిపింది. కానీ, ముఖ్యమైన పేపర్లలో సర్‌నేమ్ లేకుండా ఇవ్వలేమనే నిబంధనలతో చాలా సమస్యలను ఎదుర్కోవాల్సి వచ్చింది. స్కూల్లో, కాలేజీలో ప్రతిచోటా ఈ సమస్య ఎదురైంది. కానీ, నా నిర్ణయాన్ని మార్చుకోలేనని స్పష్టంగా చెప్పాను. అందుకు, చట్టపరంగానూ, న్యాయసలహాలు తీసుకున్నాను. దీంతో నా సర్టిఫికెట్లన్నింటిలోనూ నా పేరు మాత్రమే ఉంటుంది.

■ ఒంటరి యాత్రికురాలిని

నాకు ప్రయాణాలు అంటే ఇష్టం. ప్రకృతి అందమైన ప్రపంచాన్ని మన ముందుంచింది. దానిని ఆస్వాదించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి అనుకుంటాను. స్వదేశంలో లేదా విదేశంలో ఎక్కడ సందర్శనకు వెళ్లినా ప్రతిచోటా వారి సంస్కృతి, కళల గురించి తెలుసుకుంటాను. గ్రామాల్లో దాగి ఉన్న సాంస్కృతిక, కళాత్మక ప్రతిభను తెలుసుకొని, నైపుణ్యాలను మెరుగుపరిచి, ప్రపంచం ముందుకు తీసుకువస్తుంటాను'' అని తన విజయపథాన్ని వివరించింది ఆరుషి.

బ్యూటిప్



అరటిపండు గుజ్జులో కొద్దిగా కొబ్బరి నూనె వేసి, ఈ రెండింటినీ కలిపి ముఖానికి పట్టించాలి. ఇరవై నిమిషాల తరువాత మర్దన చేసి నీటితో కడిగేయాలి. ఇది మంచి క్లెన్సర్‌గా పనిచేయడమేగాక, చర్మానికి తేమనందిస్తుంది.



గెలుపు దారి

టెక్ తేజం


తేజ

ఫీల్డ్ మారడం అనేది మంచి నీళ్లు తాగినంత సులభం కాదు. కాస్త అటూ ఇటూ అయితే మూడు చెరువుల నీళ్లు తాగాల్సి ఉంటుంది. 'నేను సాధించగలను' అనే పట్టుదల ఉన్న వారికి మాత్రం ఏ ఫీల్డ్ అయినా ఒకటే. అలాంటి ప్రతిభావంతులలో తేజ ఒకరు. ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్‌గా పనిచేసిన తేజ ఐటీ రంగంలోకి అడుగుపెట్టి టెక్ లీడర్‌గా మంచి పేరు సంపాదించింది.

కర్ణాటకలోని బెల్గాంలో పెరిగిన తేజ మనకమె డాక్టర్ అయిన తండ్రి నుంచి విజ్ఞానప్రపంచానికి సంబంధించిన ఎన్నో విషయాలు తెలుసుకునేది. డిఐవై (డూ ఇట్ యువర్ సెల్ఫ్) ప్రాజెక్ట్స్ చేసేది. కర్ణాటక యూనివర్శిటీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ కోర్సు చేసింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ తొలిసారిగా నాన్–మెడికల్ ఏరియాలలో మహిళల కోసం ద్వారాలు తెరుస్తున్న సమయం అది. తన సీనియర్స్ ఎయిర్ ఫోర్స్‌లో చేరిపోయారు. వారిని యూనిఫామ్‌లో చూడడం తేజాకు ఎగ్జయిటింగ్‌గా అనిపించింది. వారి స్ఫూర్తితోనే ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లోకి వచ్చింది. బెంగళూరులోని ఎయిర్ ఫోర్స్ టెక్నికల్ కాలేజీలో ప్రాథమిక శిక్షణ తరువాత మౌంట్ అబూలో పోస్టింగ్ ఇచ్చారు. మౌంట్ అబూ స్టేషన్‌లోని ఉద్యోగులలో ఇద్దరు మాత్రమే మహిళలు. అందులో తాను ఒకరు. మహిళల కోసం ప్రత్యేక వాష్ రూమ్స్ ఉండేవి కావు. ఇలాంటి సమస్యలు ఎన్ని ఉన్నా ఎప్పుడూ నిరాశపడేది కాదు తేజ.

మౌంట్ అబూ తరువాత నాసిక్, బెంగళూరులలో కూడా పనిచేసింది.

మన దేశాన్ని ఐటీ బూమ్ తాకిన సమయం అది.

ఐటీ ఫీల్డ్‌లో ఉన్న సోదరుడు తేజాతో ఆ రంగానికి సంబంధించి ఎన్నో విషయాలు పంచుకునేవాడు. దీంతో ఐటీ రంగంపై తనకు ఆసక్తి పెరిగింది. అలా ఎయిర్ ఫోర్స్‌ను వదిలి ఐటీ రంగంలోకి అడుగు పెట్టింది. టీసీఎస్(టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్)లో డెవలపర్‌గా చేరింది. ఫ్రెషర్‌గా ఐటీ రంగంలో కెరీర్ మొదలు పెట్టిన తేజ అక్కడ ఎన్నో విషయాలు నేర్చుకుంది. ఆ తరువాత విప్రో టెక్నాలజీస్‌లో పనిచేసింది. 2005లో డెల్ టెక్నాలజీలో మేనేజర్‌గా చేరింది. ఒక్కోమెట్టు ఎక్కుతూ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ (ఐటీ) స్థాయికి చేరింది.

జెండర్ స్టీరియో టైప్స్‌ను బ్రేక్ చేస్తూ డెల్ ఐటీ–ఇండియాలో కీలక స్థానంలో చేరిన తొలి మహిళగా గుర్తింపు పొందింది.

డెల్ ఫౌండేషన్‌లో సేల్స్ అండ్ మార్కెటింగ్, సప్లై చైన్, డేటా సైన్స్... మొదలైన విభాగాల్లో పట్టు సాధించింది. సీఎస్ఆర్ యాక్టివిటీస్‌పై బాగా ఆసక్తి చూపేది. 'టెక్నాలజీ సహాయంతో ఎన్నో మంచిపనులు చేయవచ్చు' అంటున్న తేజ రకరకాల స్వచ్ఛంద సంస్థలతో కలిసి ఎన్నో మంచి కార్యక్రమాలు చేసింది.

కోవిడ్ మహమ్మారి సమయంలో బుద్ధ ఫౌండేషన్‌తో కలిసి వలస కార్మికులకు పునరావాసం కల్పించింది.

'ప్రతి మహిళకు ఒక రోల్‌మోడల్, మెంటర్ ఉండాలి. అప్పుడే ఎన్నో విజయాలు సాధించగలరు' అంటున్న తేజ డెల్‌లో 'మెంటర్ సర్కిల్ కాన్సెప్ట్'ను అమలు చేసింది. ప్రతి సర్కిల్‌లో కొందరు మహిళలు ఉంటారు. వారికో మెంటర్ ఉంటారు. ఈ సర్కిల్‌లో తమ సమస్యలను చర్చించుకోవచ్చు, సలహాలు తీసుకోవచ్చు. ఒకరికొకరు సహాయంగా నిలవచ్చు.

'ఇంజినీరింగ్ కాలేజీలో క్లాసులో నలుగురు అమ్మాయిలు మాత్రమే ఉండేవాళ్లం. ఇప్పటి పరిస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మా కుటుంబంలో నేను ఫస్ట్ ఉమెన్ ఇంజనీర్‌ని. ఇప్పుడు ఎంతోమంది ఉన్నారు. ఒక ముక్కలో చెప్పాలంటే సమాజంలో చాలా మార్పు వచ్చింది. ఇది ఆహ్వానించదగిన మార్పు. నేను నేర్చుకున్న విషయాల ద్వారా ఇతరులకు ఏ రకంగా సహాయం చేయగలను అని ఎప్పటికప్పుడు ఆలోచిస్తుంటాను. టైమ్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ఎన్నో సమావేశాలు నిర్వహించాను' అంటుంది తేజ.

రజతంగా ఐశ్వర్య కాంస్యం



గత ఏడాది జరిగిన ఆసియా క్రీడల్లో 400 మీటర్ల పరుగులో భారత అథ్లెట్ ఐశ్వర్య మిశ్రా కాంస్యం సాధించింది. అయితే ఇప్పుడు ఆమె ప్రదర్శనకు రజత పతకంగా ప్రమోషన్ దక్కింది. ఈ ఈవెంట్‌లో రజతం సాధించి ఉజ్బెకిస్తాన్ అథ్లెట్ ఫరీదా సొలియెవా డోపింగ్ పరీక్షలో పట్టుబడింది. దాంతో అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య ఆమెపై 3 ఏళ్ల నిషేధం విధించింది. ఫలితంగా ఐశ్వర్య టైమింగ్ (53.07)ను రెండో స్థానంగా గుర్తిస్తూ ఆమె కాంస్యాన్ని రజతంగా మార్చారు.

భారత మహిళల శుభారంభం

ప్రతిష్టాత్మక బిల్లీ జీన్ కింగ్ కప్‌లో భారత మహిళల టెన్నిస్ జట్టు శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన పోరులో భారత్ 3–0 తేడాతో పసిఫిక్ ఓషియానియా జట్టును ఓడించింది. తొలి సింగిల్స్‌లో రుతుజ భోసలే 6–0, 6–0తో తరనీ కమోను చిత్తు చేయగా...రెండో సింగిల్స్‌లో అంకితా రైనా 6–1, 6–3తో సవోర్స్ బ్రీన్‌పై విజయం సాధించింది. డబుల్స్‌లో భారత జంట భమిడిపాటి శ్రీవల్లి రష్మిక – ప్రార్థనా తోంబరే 6–1, 6–1తో మెహతీయ బూసీ – రూబి కాఫిన్ జోడీని ఓడించింది. పసిఫిక్ మహాసముద్రంలోని ఫిజీ తదితర చిన్న దేశాలు కలిపి బిల్లీ జీన్ కింగ్ కప్‌లో 'పసిఫిక్ ఓషియానియా' జట్టు పేరుతో బరిలోకి దిగుతున్నాయి.

నితీశ్ 'షో'

- వైజాగ్ కుర్రాడి మెరుపు ప్రదర్శన
- ఉత్కంఠ పోరులో సన్‌రైజర్స్ గెలుపు
- 2 పరుగులతో ఓడిన పంజాబ్



నితీశ్ కుమార్

ముల్లన్‌పూర్: ఐపీఎల్‌లో ఇప్పటి వరకు ఇంట గెలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇపుడు రచ్చ గెలిచింది. పంజాబ్ గడ్డపై ఆంధ్ర బ్యాటర్ నితీశ్ కుమార్ రెడ్డి (37 బంతుల్లో 64; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగాడు. దీంతో హైదరాబాద్ 2 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై విజయం సాధించింది. ముందుగా సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. నితీశ్‌తో పాటు అబ్దుల్ సమద్ (12 బంతుల్లో 25; 5 ఫోర్లు) ధాటిగా ఆడారు. అర్ష్‌దీప్‌కు 4 వికెట్లు దక్కాయి. అనంతరం పంజాబ్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసి ఓడింది. శశాంక్ సింగ్ (25 బంతుల్లో 46; 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించగా, అశుతోష్ (15 బంతుల్లో 33 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. ఆఖరి ఓవర్లో 29 పరుగులు కావాల్సి ఉండగా బౌలర్ ఉనాద్కట్ పట్టు తప్పాడు. వైడ్లతో పాటు పేలవ బంతులు వేయడంతో ఉత్కంఠ పెరిగింది. చివరకు పంజాబ్ 3 సిక్స్‌లు సహా 26 పరుగులే రాబట్టడంతో హైదరాబాద్ ఊపిరి పీల్చుకుంది.

నితీశ్ వీరబాదుడు...

ఓపెనర్ ట్రవిస్ హెడ్ (15 బంతుల్లో 21; 4 ఫోర్లు), మార్క్‌రమ్ (0)లను ఒకే ఓవర్లో అర్ష్‌దీప్ అవుట్ చేయగా, అభిషేక్ శర్మ (16)కు సామ్ కరన్ క్లీన్ వేశాడు. 39 పరుగులకే టాప్ 3 వికెట్లను కోల్పోయింది. రాహుల్ త్రిపాఠి (11) 'ఇంపాక్ట్' చూపలేకపోయాడు. సగం (10) ఓవర్లు ముగిసే సరికి జట్టు 66/4 స్కోరు చేసింది. అయితే నాలుగో ఓవర్లోనే క్రీజులోకి వచ్చిన నితీశ్ పదో ఓవర్‌దాకా చేసిన స్కోరు 14! ఒకటే బౌండరీ కొట్టాడు. ఇలా ఆడిన విశాఖ కుర్రాడు ధనాధన్‌కు స్విచ్ఛాన్ చేసినట్లుగా 11వ ఓవర్ నుంచి అనూహ్యంగా దంచేశాడు. హర్‌ప్రీత్ బౌలింగ్‌లో 4, 6 బాదగా, క్లాసెన్ ఓ ఫోర్ కొట్టడంతో 15 పరుగులు వచ్చాయి. రబడ, సామ్ కరన్ ఓవర్లలో చెరో సిక్సర్‌తో దూకుడు పెంచాడు. క్లాసెన్ (9) అవుటయ్యాక సమద్ రావడంతో దూకుడు 'డబుల్' అయింది. హర్‌ప్రీత్ 15వ ఓవర్‌నూ పూర్తిగా ఎదుర్కొన్న నితీశ్ 0, 4, 6, 4, 6, 2లతో 22 పరుగులు పిండుకున్నాడు. దీంతో 32 బంతుల్లోనే అతని ఫిఫ్టీ పూర్తయ్యింది. 17వ ఓవర్ వేసిన అర్ష్‌దీప్ 3 బంతుల వ్యవధిలో సమద్, నితీశ్‌లను అవుట్ చేయడంతో రైజర్స్ డెత్ ఓవర్లలో ఆశించినన్ని పరుగుల్ని చేయలేకపోయింది.

దెబ్బకొట్టిన భువీ...

ఓపెనర్ బెయిర్‌స్టో (0)ను రెండో ఓవర్లోనే కమిన్స్ డకౌట్ చేయగా, భువనేశ్వర్ వరుస ఓవర్లలో ప్రభ్‌సిమ్రన్ (4)తో పాటు మరో శిఖర్ ధావన్ (14)ను పెవిలియన్ చేర్చాడు. దీంతో 20 పరుగులకే టాపార్డర్ కూలింది. సామ్ కరన్ (22 బంతుల్లో 29; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), సికందర్ రజా (22 బంతుల్లో 28; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కాసేపు పోరాడారు. నటరాజన్ పదో ఓవర్లో సామ్ కరన్ బౌండరీ కోసం ప్రయత్నించగా మిడాఫ్‌లో కమిన్స్ కళ్లు చెదిరే క్యాచ్‌తో అతని ఆట ముగించాడు. జట్టు స్కోరు 91 పరుగుల వద్ద రజా నిష్క్రమించడంతో సన్‌రైజర్స్ గెలుపు దాదాపుగా ఖాయమైంది. అయితే ఆఖరి ఓవర్లో ఉనాద్కట్ 3 వైడ్లు వేయడంతో 2 బంతుల్లో 10 పరుగుల సమీకరణం పంజాబ్‌కు అవకాశమిచ్చింది. అశుతోష్ మరో షాట్ ఆడగా డీప్ మిడ్ వికెట్ వద్ద రాహుల్ త్రిపాఠి క్యాచ్ జారవిడిచాడు. ఒకే పరుగు రావడంతో ఇక ఆఖరి బంతికి 9 పరుగులు అసాధ్యమవడంతో హైదరాబాద్ గెలిచింది. అయితే చివరి బంతిని శశాంక్ సిక్స్ కొట్టడంతో సన్‌రైజర్స్ 2 పరుగులతో నెగ్గింది.

సన్‌రైజర్స్ జట్టులో విజయకాంత్

శ్రీలంక యువ లెగ్‌స్పిన్నర్ విజయకాంత్ వియస్కాంత్ ఐపీఎల్ టీమ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. గాయంతో టోర్నీకి దూరమైన లంక లెగ్‌స్పిన్నర్ వనిందు హసరంగ స్థానంలో కనీస విలువ రూ. 50 లక్షలకు రైజర్స్ యాజమాన్యం విజయ్‌కాంత్‌ను ఎంచుకుంది. 22 ఏళ్ల విజయ్‌కాంత్ ఆసియా క్రీడల్లో లంక తరపున ఒకే ఒక అంతర్జాతీయ టి20 ఆడాడు.

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: హెడ్ (సి) ధావన్ (బి) అర్ష్‌దీప్ 21; అభిషేక్ (సి) శశాంక్ (బి) సామ్ కరన్ 16; మార్క్‌రమ్ (సి) జితేశ్ (బి) అర్ష్‌దీప్ 0; నితీశ్ కుమార్ (సి) రబడ (బి) అర్ష్‌దీప్ 64; రాహుల్ త్రిపాఠి (సి) జితేశ్ (బి) హర్షల్ 11; క్లాసెన్ (సి) సామ్ కరన్ (బి) హర్షల్ 9; సమద్ (సి) హర్షల్ (బి) అర్ష్‌దీప్ 25; షాబాజ్ నాటౌట్ 14; కమిన్స్ (బి) రబడ 3; భువనేశ్వర్ (సి) బెయిర్‌స్టో (బి) సామ్ కరన్ 6; ఉనాద్కట్ నాటౌట్ 6; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 182. వికెట్ల పతనం: 1–27, 2–27, 3–39, 4–64, 5–100, 6–150, 7–151, 8–155, 9–176. బౌలింగ్: రబడ 4–0–32–1, అర్ష్‌దీప్ 4–0–29–4, సామ్ కరన్ 4–0–41–2, హర్షల్ 4–0–30–2, హర్‌ప్రీత్ బ్రార్ 4–0–48–0.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ధావన్ (స్టంప్) క్లాసెన్ (బి) భువనేశ్వర్ 14; బెయిర్‌స్టో (బి) కమిన్స్ 0; ప్రభ్‌సిమ్రాన్ (సి) నితీశ్ (బి) భువనేశ్వర్ 4; సామ్ కరన్ (సి) కమిన్స్ (బి) నటరాజన్ 29; సికందర్ రజా (సి) క్లాసెన్ (బి) ఉనాద్కట్ 28; శశాంక్ నాటౌట్ 46; జితేశ్ (సి) అభిషేక్ (బి) నితీశ్ 19; అశుతోష్ నాటౌట్ 33; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 180. వికెట్ల పతనం: 1–2, 2–11, 3–20, 4–58, 5–91, 6–114. బౌలింగ్: భువనేశ్వర్ 4–1–32–2, కమిన్స్ 4–0–22–1, నటరాజన్ 4–0–33–1, నితీశ్ కుమార్ 3–0–33–1, ఉనాద్కట్ 4–0–49–1, షహబాజ్ 1–0–10–0.

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ × గుజరాత్
వేదిక: జైపూర్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	4	4	0	8	1.120
కోల్‌కతా	4	3	1	6	1.528
లక్నో	4	3	1	6	0.775
చెన్నై	5	3	2	6	0.666
హైదరాబాద్	5	3	2	6	0.344
పంజాబ్	5	2	3	4	-0.196
గుజరాత్	5	2	3	4	-0.797
ముంబై	4	1	3	2	-0.704
బెంగళూరు	5	1	4	2	-0.843
ఢిల్లీ	5	1	4	2	-1.370

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, నె.ర.రే–నెట్ రన్‌రేట్

అదరగొట్టాడు

ఏడేళ్ల క్రితం...బీసీసీఐ అండర్–16 టోర్నీ విజయ్‌మర్చంట్ ట్రోఫీ..రాజ్‌కోట్‌లో నాగాలాండ్‌తో ఆంధ్ర మ్యాచ్. అద్భుత బ్యాటింగ్‌తో చెలరేగిన నితీశ్ కుమార్ రెడ్డి 345 బంతుల్లో ఏకంగా 441 పరుగుల స్కోరు సాధించి సంచలనం సృష్టించాడు. ఈ క్వాడ్రపుల్ సెంచరీ మాత్రమే కాకుండా టోర్నీ మొత్తం అదరగొట్టిన అతను 8 ఇన్నింగ్స్‌లలో 4 సెంచరీలు, 2 అర్ధసెంచరీలు సహా 176.71 సగటుతో ఏకంగా 1237 పరుగులు నమోదు చేశాడు. విజయ్‌మర్చంట్ ట్రోఫీ చరిత్రలో ఒక్క సీజన్‌లో ఎవరూ చేయని పరుగుల రికార్డు అది. ఆ ఏడాది బీసీసీఐ వార్షిక అవార్డుల్లో 'బెస్ట్ అండర్–16 క్రికెటర్'గా నిలవడంతో దేశవాళీ క్రికెట్‌లో అందరి దృష్టీ ఈ కుర్రాడిపై పడింది. ఓపెనర్‌గా కెరీర్ మొదలు పెట్టిన నితీశ్ అండర్–19 స్థాయి వినూ మన్కడ్ ట్రోఫీ, చాలెంజర్ టోర్నీ వరకు అలాగే కొనసాగించాడు. అయితే మరో వైపు మీడియం పేస్ బౌలింగ్‌పై కూడా దృష్టి పెట్టిన అతను కొత్త బంతితో బౌలింగ్ చేశాడు. దాంతో భారం ఎక్కువ కావడంతో అతని భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మిడిలార్డర్‌లోకి మార్చారు. వైజాగ్‌లో పుట్టిన నితీశ్ ఏజ్ గ్రూప్ టోర్నీల్లో సత్తా చాటిన తర్వాత 2020–21 సీజన్‌లో ఆంధ్ర తరపున రంజీ ట్రోఫీలోకి అడుగు పెట్టి ఆల్‌రౌండర్‌గా జట్టుకు కీలకంగా మారాడు. రెండేళ్ల తర్వాత రంజీ సీజన్‌లో 25 వికెట్లు పడగొట్టిన నితీశ్ తన బౌలింగ్ పదును కూడా చూపించాడు. తాజా సీజన్ రంజీ ట్రోఫీలో రెండు సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేసిన నితీశ్ బాధిత బ్యాటర్లలో పుజారా, రహానే, శ్రేయస్ అయ్యర్ ఉన్నారు. బ్యాటింగ్‌లో చెలరేగుతూ మీడియం పేస్ బౌలింగ్ చేసే హార్దిక్ పాండ్యాను అతను అభిమానిస్తాడు. తండ్రి ముత్యాల రెడ్డి హిందుస్తాన్ జింక్ సంస్థలో ఉద్యోగిగా పని చేసేవాడు. అయితే రాజస్తాన్‌కు బదిలీ కావడంతో ఆయన ఉద్యోగంకంటే కొడుకు భవిష్యత్తే ముఖ్యమని భావిస్తూ రాజీనామా చేశారు. ఆ తర్వాత పూర్తిస్థాయిలో నితీశ్‌కు మార్గనిర్దేశం చేసి నడిపించారు. ఇప్పుడు ఐపీఎల్‌లో మెరుపు ఇన్నింగ్స్‌తో నితీశ్ అందరికీ తెలిశాడు. 2023 సీజన్‌లో సన్‌రైజర్స్ తరఫున 2 మ్యాచ్‌లు ఆడినా బ్యాటింగ్ రాకపోగా, వికెట్ కూడా దక్కలేదు. ఈ సీజన్‌లో చెన్నైతో మ్యాచ్‌లో 8 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 14 పరుగులు చేసి ట్రైలర్ చూపించిన నితీశ్ తానేంటో ఈ మ్యాచ్‌లో అసలు షో ప్రదర్శించాడు. చాలా కాలం తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో ఒక స్థానిక ఆటగాడు చెలరేగి జట్టును గెలిపించడం మరో విశేషం.

(సాక్షి క్రీడా విభాగం)

'ఓల్డ్ ఈజ్ గోల్డ్'



మోంటెకార్లో: భారత ఆటగాడు రోహన్ బోపన్న 44 ఏళ్ల వయసులో టెన్నిస్ వరల్డ్ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో ఇటీవలే నంబర్‌వన్‌కు చేరాడు. సింగిల్స్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్ కూడా తాజా ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా నిలిచిన అతి పెద్ద వయస్కుడిగా (36 ఏళ్లు) గుర్తింపు తెచ్చుకున్నాడు. ఈ ఇద్దరు ఆటగాళ్ల మధ్య తమ వయసుకు సంబంధించిన ఆసక్తికర సంభాషణ జరిగింది. 'టెన్నిస్ మనకు ఎంతో నేర్పించింది. అనుభవం మంచి విజయాలు అందిస్తుంది. ఇప్పుడు మనకు కావాల్సినంత ఉంది' అని బోపన్న వ్యాఖ్యానించగా... 'అనుభవం మాత్రమే కాదు. ప్రతీ రోజు ఆట పట్ల అంకితభావం చూపడమే మనల్ని ఈ స్థానంలో నిలిపింది' అని జొకోవిచ్ బదులిచ్చాడు. ఇద్దరు నంబర్‌వన్ ఆటగాళ్లు కలిసిన అరుదైన ఘట్టం సెర్బియా, భారత టెన్నిస్‌కు సంబంధించి ప్రత్యేకమైందన్న జొకోవిచ్...త్వరలోనే భారత గడ్డపై ఆడాలని అనుకుంటున్నట్లు చెప్పాడు. ఓల్డ్ ఈజ్ గోల్డ్ అంటూ తమ సంభాషణను నమస్తేతో జొకోవిచ్ ముగించాడు.

మెయిన్ 'డ్రా'కు మాళవిక

నింగ్బో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్‌లో భారత యువ షట్లర్ మాళవిక బన్సోద్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది. మంగళవారం ఆమె తన రెండు క్వాలిఫయింగ్ మ్యాచ్‌లలో కూడా విజయం సాధించింది. తొలి పోరులో నూరాని అజహర (యూఏఈ)ని 21–18, 21–10తో ఓడించిన మాళవిక తన రెండో మ్యాచ్‌లో సోఫియా జకిరోవా (ఉజ్బెకిస్తాన్)ను 21–4, 21–5తో చిత్తు చేసింది.

ఆమిర్ పునరాగమనం



లాహోర్: లెఫ్టార్మ్ పేస్ బౌలర్ మొహమ్మద్ ఆమిర్ నాలుగేళ్ల తర్వాత పాకిస్తాన్ జట్టులో మళ్లీ చోటు దక్కించుకున్నాడు. సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో జరిగే ఐదు టి20 మ్యాచ్‌ల సిరీస్ కోసం మంగళవారం పాక్ సెలక్టర్లు జట్టును ప్రకటించారు. ఆమిర్ చివరిసారిగా 2020లో పాక్ తరఫున అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. ఏడాది క్రితం జట్టులో స్థానం కోల్పోయిన ఆల్‌రౌండర్ ఇమాద్ వసీమ్‌కు కూడా అవకాశం దక్కింది. ఈ సిరీస్‌తో బాబర్ ఆజమ్ మళ్లీ కెప్టెన్సీ పగ్గాలు చేపట్టనున్నాడు. జట్టు హెడ్ కోచ్‌గా మాజీ ప్లేయర్ అజహర్ మహమూద్‌ను ఎంపిక చేయడం విశేషం.

సినిమా

విక్టరీ వినోదం



● వెంకటేశ్

'ఎఫ్ 2', 'ఎఫ్ 3' (ఈ చిత్రాల్లో వరుణ్ తేజ్ మరో హీరో) చిత్రాల తర్వాత హీరో వెంకటేశ్–దర్శకుడు అనిల్ రావిపూడిల కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనుంది. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ ఈ సినిమాను నిర్మించనున్నారు. ఉగాది సందర్భంగా ఈ సినిమాను అధికారికంగా ప్రకటించి, 2025 సంక్రాంతికి విడుదల చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. ''వెంకటేశ్‌గారితో మూడోసారి, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌తో ఆరోసారి, భీమ్స్‌తో తొలిసారి.. 2025 సంక్రాంతికి 'విక్టరీ వినోదం'తో కలుద్దాం'' అని ఈ సినిమా గురించి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు దర్శకుడు అనిల్ రావిపూడి. ఓ మాజీ పోలీస్ ఆఫీసర్, అతని మాజీ ప్రేయసి, అతని భార్య... ఈ ముగ్గురి పాత్రల చుట్టూ సాగే క్రైమ్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉంటుందని ఈ చిత్రం యూనిట్ పేర్కొంది.

వేడుకలో...



● సాయికుమార్, నాని

నాని హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'సరిపోదా శనివారం'. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ప్రియాంకా మోహన్ కథానాయిక. సాయికుమార్, ఎస్‌జే సూర్య కీలక పాత్రల్లో నటిస్తున్నారు. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి నాని, సాయికుమార్ ఉన్న కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు. సూర్యగా నాని, శంకరంగా సాయికుమార్ సంప్రదాయ దుస్తుల్లో చిరునవ్వులు చిందిస్తూ కనిపించారు. సినిమాలో ఏదైనా వేడుకకు సంబంధించిన ఫొటో అన్నట్లుగా ఈ పోస్టర్ ఉంది. ''హై బడ్జెట్‌తో రూపొందిస్తోన్న ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఆగస్టు 29న రిలీజ్ చేస్తాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, కెమెరా: మురళి జి.

రవన్న దావత్‌కి రెడీ అయిపోండ్రి



● రవితేజ

హీరో రవితేజ ల్యాండ్ మార్క్ మూవీ 'ఆర్‌టీ 75' (వర్కింగ్ టైటిల్) ప్రకటన వెలువడింది. భాను భోగవరపు దర్శకత్వంలో ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించనున్నారు. ఈ చిత్రం ప్రకటించిన సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్ మీద 'రవన్న దావత్ ఇస్తుండు.. రెడీ అయిపోండ్రి' అని ఉంది. ఈ సినిమాలో లక్ష్మణ భేరి అనే పాత్రలో రవితేజ కనిపిస్తారు. ఈ పాత్ర తీరు ఎలా ఉంటుందో ఉగాది పంచాంగం రూపంలో చెప్పారు. 'ఆదాయం: చెప్పను తియ్, ఖర్చు: లెక్క జెయ్యన్, రాజ్యపూజ్యం: అన్‌లిమిటెడ్, అవమానం: జీరో' అంటూ రాసుకొచ్చారు. ఈ చిత్రాన్ని వచ్చే సంక్రాంతికి రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్, కెమెరా: కార్తీక్ ఘట్టమనేని.

ఫుల్ కామెడీ



● శ్రీవిష్ణు

శ్రీ విష్ణు హీరోగా జానకి రామ్ మారెళ్ల దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. ప్రముఖ రచయిత–నిర్మాత కోన వెంకట్, దర్శకుడు బాబీ కొల్లి సమర్పణలో అనూష ద్రోణవల్లి, సీతాకుమారి కొత, గోపాలం లక్ష్మీ దీపక్ నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం మంగళవారం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు అనిల్ రావిపూడి కెమెరా స్విచ్ఛాన్ చేయగా, నిర్మాత 'దిల్' రాజు క్లాప్ ఇచ్చారు. దర్శకుడు వీవీ వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాత నవీన్ యెర్నేని, దర్శకురాలు నందినీ రెడ్డి, దర్శకుడు కిశోర్ తిరుమల స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందజేశారు. ''ఇది చాలా మంచి ప్రాజెక్ట్ అవుతుందని బలంగా నమ్ముతున్నాను'' అని శ్రీవిష్ణు అన్నారు. ''శ్రీ విష్ణుతో సినిమా చేయడం హ్యాపీగా ఉంది'' అన్నారు కోన వెంకట్. ''నా 'పవర్' సినిమా నుంచి జానకి రామ్ నా దగ్గర అసోసియేట్‌గా చేస్తున్నాడు. ఈ కథ హిలేరియస్‌గా, ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుంది'' అన్నారు బాబీ. ఈ సినిమాకు సంగీతం: విజయ్ బుల్గానిన్, కెమెరా: సాయి శ్రీరామ్.

వినూత్న షణ్ముఖ





● ఆది, మనోజ్ నందం

ఆది సాయికుమార్, అవికా గోర్ జంటగా నటిస్తున్న చిత్రానికి 'షణ్ముఖ' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ చిత్రానికి షణ్ముగం సాప్పని దర్శకుడు. సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేశ్ యాదవ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆది సాయికుమార్ మాట్లాడుతూ– ''కంటెంట్ ఈజ్ కింగ్ అని నమ్మి చేస్తున్న ఈ చిత్రం అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''ఇప్పటికి 70 శాతం షూటింగ్ పూర్తయింది'' అన్నారు షణ్ముగం సాప్పని. ''మా సినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు తులసీరామ్ సాప్పని. ''షణ్ముగంకు సినిమా మీద ఉండే ఆసక్తే రాజకీయాల్లో ఉన్న నన్ను ఈ సినిమా నిర్మించేలా చేసింది'' అన్నారు నిర్మాత, ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్. ''ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం హైలైట్‌గా ఉంటుంది'' అన్నారు నటుడు మనోజ్ నందం.

రాయలసీమ నేపథ్యంలో...



● మహేశ్ విటా

హాస్య నటుడు మహేశ్ విటా హీరోగా నటిస్తున్న చిత్రం 'ఉత్తుత్త హీరోలు'. మహేశ్ విటా స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజైంది. ఈ సందర్భంగా హీరో, దర్శక–నిర్మాత మహేశ్ విటా మాట్లాడుతూ– ''కామెడీ, సస్పెన్స్ ప్రధానాంశాలుగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాను. రాయలసీమ ప్రాంతంలో జరిగే ఓ ఆసక్తికరమైన ఘటన చుట్టూ సీమ భాష, యాసతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జాన్ కె. జోసఫ్, నేపథ్య సంగీతం: జీవన్ బాబు (జేబీ).

బలంగా అనుకుంటే జరుగుతుంది – విశ్వక్ సేన్

''మనం ఏదైనా బలంగా అనుకుంటే అది జరుగుతుంది. 'లవ్ మౌళి' చిత్రంలోలా నేను ఒక్కడినే ట్రిప్స్‌కి వెళ్లిపోతాను.. ముఖ్యంగా కొండ ప్రాంతాలకు. నేను ఒక ప్లేస్‌లో కూర్చుని జీవితంలో ఎలా ఎదగాలి అనుకున్నానో.. కొన్నేళ్ల తర్వాత అదే ప్రదేశంలో షూటింగ్ చేశాను. 'లవ్ మౌళి' చిత్రం నవదీప్‌కి మంచి విజయం ఇవ్వాలి'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. నవదీప్ హీరోగా, పంఖురి గిద్వాని, భావనా సాగి హీరోయిన్లుగా నటించిన చిత్రం 'లవ్ మౌళి'. అవనీంద్ర దర్శకత్వంలో సి స్పేస్, నైరా క్రియేషన్స్, శ్రీకర స్టూడియోస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు విశ్వక్ సేన్. ''లవ్ మౌళి' కోసం ఏడాది పాటు గడ్డం, జుట్టుతో పాటు బాడీ పెంచాను'' అన్నారు నవదీప్. ''ఇందులో మౌళి పాత్రకి నవదీప్ సరిగ్గా సరిపోయాడు'' అన్నారు అవనీంద్ర.



● నవదీప్, విశ్వక్ సేన్

ప్రేమించడం నేర్పిస్తుంది – విజయ్ ఆంటోని



విజయ్ ఆంటోని, మృణాళినీ రవి హీరో హీరోయిన్లుగా వినాయక్ వైద్యనాథన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'లవ్ గురు'. మీరా విజయ్ ఆంటోని సమర్పణలో విజయ్ ఆంటోని నిర్మించిన ఈ చిత్రాన్ని తెలుగులో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ ఈ 11న రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా విజయ్ ఆంటోని మాట్లాడుతూ– ''ఈ కథలో తనంటే ఇష్టం లేని అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు ఓ అబ్బాయి. పెళ్లి తర్వాత తనను అర్థం చేసుకుంటుందని భావిస్తాడు. కానీ పెళ్లి తర్వాత కూడా ఆ అబ్బాయిపై ఆ అమ్మాయికి ఇష్టం ఏర్పడదు. అప్పుడు ఆ అబ్బాయి ఏం చేస్తాడు? ఆ అమ్మాయి ప్రేమను ఎలా గెలుచుకోవాలనుకుంటాడు? అన్నదే ఈ చిత్రకథ. ఈ సినిమాలో ఓ ఎమోషనల్ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ కూడా ఉంది. మా సినిమా ప్రేక్షకులకు ప్రేమించడం ఎలాగో నేర్పిస్తుంది. 'లవ్ గురు' సినిమా కోసం మైత్రీతో అసోసియేట్ కావడం సంతోషంగా ఉంది. ఇక మా ప్రొడక్షన్‌లో మూడు సినిమాలు లైనప్‌లో ఉన్నాయి. నా దర్శకత్వంలోనే 'బిచ్చగాడు 3' ఉంటుంది. 2026 సమ్మర్ రిలీజ్ ప్లాన్ చేస్తున్నాం'' అని చెప్పుకొచ్చారు.

కొత్తవారితో కమిటీ కుర్రోళ్లు

నటి – నిర్మాత నిహారిక కొణిదెల సమర్పణలో యదు వంశీ దర్శకత్వంలో రూపొందిన చిత్రానికి 'కమిటీ కుర్రోళ్లు' అనే టైటిల్ ఖరారైంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్ పతాకాలపై పద్మజ కొణిదెల, ఫణి, జయలక్ష్మి అడపాక నిర్మించిన ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను హీరో సాయి దుర్గా తేజ్ విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిహారిక మాట్లాడుతూ– ''మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌పై వస్తున్న తొలి చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. కొత్తవారితో సినిమా చేయడాన్ని బాధ్యతగా భావిస్తున్నాం'' అన్నారు. ''ఈ చిత్రం ద్వారా పదకొండు మంది హీరోలు, నలుగురు హీరోయిన్లని పరిచయం చేస్తున్నాం'' అన్నారు యదు వంశీ. ''మంచి కంటెంట్ ఉన్న సినిమాలను నిర్మించాలనుకుంటున్నాం'' అన్నారు ఫణి, జయలక్ష్మి.

రహస్య నిధి కోసం...



● అవినాష్

'కేజీఎఫ్' ఫేమ్ అవినాష్ ఓ లీడ్ రోల్‌లో అఘోరాగా నటిస్తున్న చిత్రం 'నాగబంధం'. 'ది సీక్రెట్ ట్రెజర్' అనేది ఉపశీర్షిక. ఆధ్యాత్మిక, సాహసోపేతమైన అంశాలతో ఈ సినిమాకు స్క్రిప్ట్ అందించి, దర్శకత్వం వహిస్తున్నారు నిర్మాత అభిషేక్ నామా. దేవాన్ష్ సమర్పణలో అభిషేక్ పిక్చర్స్, థండర్ స్టూడియోస్ పతాకాలపై మధుసూదన్ రావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. ''ఈ చిత్రంలో ఓ నిధి కోసం సాగే థ్రిల్లింగ్ అన్వేషణ ఆసక్తికరంగా ఉంటుంది. ఈ సినిమాను 2025లో తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: అభే, సహనిర్మాత: దేవ్ బాబు గండి (బుజ్జి), కెమెరా: సౌందర్ రాజన్. ఎస్.

పురాణం.. విజ్ఞానం



● అరవింద్ కృష్ణ

'శుక్ర, మాటరాని మౌనమిది' చిత్రాల దర్శకుడు సుకు పూర్వజ్ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'ఎ మాస్టర్ పీస్'. అరవింద్ కృష్ణ, జ్యోతి పూర్వజ్, ఆషూ రెడ్డి లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. శ్రీకాంత్ కండ్రేగుల, మనీష్ గిలాడ, ప్రజయ్ కామత్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ''మైథాలజీ, సైన్స్ (పురాణం.. విజ్ఞానం) ఫిక్షన్ కలిసిన ఒక న్యూ కాన్సెప్ట్ మూవీ ఇది. క్లైమాక్స్ మినహా షూటింగ్ పూర్తయింది. ఈ ఏడాదే సినిమాని రిలీజ్ చేస్తాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి కెమెరా: శివరామ్ చరణ్, సంగీతం: ఆశీర్వాద్, సుమన్ జీవరతన్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	59	74,684
నిఫ్టీ ▽	24	22,643

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,253	▽	1
డోజోన్స్	38,776	▽	116
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,935	▽	9
డాక్స్	18,078	▽	241
షాంఘై	3,049	△	2
నికాయ్	39,760	△	445

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్లు)	71,730
బంగారం (22 క్యారెట్లు)	65,750
వెండి (కిలో)	84.500

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధాయిచెకే	81.49	85.17
£	బ్రిటన్ పౌండ్	ధాయిచెకే	102.99	107.94
€	యూరో	ధాయిచెకే	88.25	92.74
¥	జపాన్ ఎన్ (100)	ధాయిచెకే	42.00	68.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ధాయిచెకే	52.62	57.46
S$	సింగపూర్ డాలర్	ధాయిచెకే	59.63	64.19
SAR	సౌదీ రియాల్	ధాయిచెకే	21.32	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	ధాయిచెకే	21.80	23.58
¥	చైనా యువాన్	ధాయిచెకే	10.40	12.47

పసిడి.. వెండి పోటాపోటీ

- న్యూఢిల్లీలో సరికొత్త రికార్డులు
- రూ.71,840కి బంగారం అప్
- వెండి కూడా కొండపైకి...
- కేజీ రూ.84,500



న్యూఢిల్లీ: పసిడి పరుగు వరుసగా రెండవ రోజూ కొనసాగింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో సోమవారం రూ.350 పెరిగి, రూ.71,700కు చేరిన 10 గ్రాముల ధర, మంగళవారం మరో రూ.140 జతచేసుకుని రూ.71,840 రికార్డు హైకి చేరింది. ఇక వెండి ధర కూడా సరికొత్త రికార్డులు చూసింది. కేజీ ధర ఒకేరోజు రూ.500 పెరిగి రూ.84,500కు చేరింది. సోమవారం వెండి ధర మొదటిసారి రూ.84,000కు చేరిన సంగతి తెలిసిందే.

కారణాలు ఇవీ..



అమెరికా ఫెడ్ వడ్డీరేట్లు తగ్గించవచ్చన్న అంచనాలు, ఈజీ మనీ, ద్రవ్యోల్బణం భయాలు, సెంట్రల్ బ్యాంక్‌ల కొనుగోళ్లు, భౌగోళిక ఉద్రిక్తతలు పసిడి, వెండి పరుగునకు కారణమవుతున్నాయి. ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులకు ఈ మెటల్స్ సురక్షితమైనవిగా పరిగణిస్తున్నారు. దేశీయంగా రూపాయి బలహీన ధోరణి కూడా బులిష్ ధోరణికి దోహదపడుతోంది.

ఫ్యూచర్స్ మార్కెట్‌లో మెరుపులు...

అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్‌లో పసిడి ఔన్స్ (31.1గ్రాములు) ధర మంగళవారం జూన్ కాంట్రాక్ట్ సరికొత్త రికార్డు 2,384 డాలర్లకు ఎగసింది. ఈ వార్త రాసే రాత్రి 9 గంటల సమయంలో క్రితం ముగింపుతో పోల్చితే 16 డాలర్ల పెరుగుదలతో 2,368 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇక దేశీయ ఫ్యూచర్స్ ఎంసీఎక్స్‌లో పసిడి జూన్ కాంట్రాక్ట్ ధర క్రితం ముగింపుతో పోల్చితే రూ.523 పెరిగి రూ.71,435 రికార్డు స్థాయిల వద్ద ట్రేడవుతోంది. ఒక దశలో రూ.71,739ని సైతం తాకింది. వెండి విషయానికివ వస్తే, క్రియాశీలక మే కాంట్రాక్ట్ ధర క్రితం ముగింపుతో పోల్చితే రూ.366 ఎగసి రూ. 82,241 సరికొత్త రికార్డుల వద్ద ట్రేడవుతోంది. ఒక దశలో రూ.83,000 దాటింది.

విదేశీ మార్కెట్లకు ఓలా గుడ్‌బై

న్యూఢిల్లీ: దేశీయంగా కార్యకలాపాలపై మరింతగా దృష్టి పెట్టే ఉద్దేశంతో విదేశీ మార్కెట్ల నుంచి తప్పుకోవాలని వాహన సేవల సంస్థ ఓలా నిర్ణయించుకుంది. దీని ప్రకారం న్యూజిల్యాండ్, ఆస్ట్రేలియా, బ్రిటన్‌లో కార్యకలాపాలను నిలిపివేయాలని నిర్ణయించుకున్నట్లు ఓలా మాతృ సంస్థ ఏఎన్ఐ టెక్నాలజీస్ వెల్లడించింది. భారత్‌లో విస్తరణకు గణనీయంగా అవకాశాలు ఉన్నాయని పేర్కొంది.

యాక్సిస్ బ్యాంక్‌లో బెయిన్ వాటాల విక్రయం




న్యూఢిల్లీ: యాక్సిస్ బ్యాంక్‌లో ప్రైవేట్ ఈక్విటీ సంస్థ బెయిన్ క్యాపిటల్ 1.08 శాతం వాటాలను విక్రయించింది. ఓపెన్ మార్కెట్ ద్వారా నిర్వహించిన ఈ డీల్ విలువ రూ. 3,574 కోట్లు. బీఎస్ఈ గణాంకాల ప్రకారం బెయిన్ క్యాపిటల్‌లో భాగమైన బీసీ ఏషియా ఇన్వెస్ట్‌మెంట్స్ సెవెన్, ఇంటిగ్రల్ ఇన్వెస్ట్‌మెంట్స్ సౌత్ ఏషియా ఫోర్ 3.33 కోట్ల షేర్లను సగటున షేరు ఒక్కింటికి రూ. 1,071 రేటు చొప్పున విక్రయించాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-4-2024 ఫామ్ ధర...

విశాఖ	405-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	390-00
విజయవాడ	390-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	375-00
వరంగల్	377-00
రిటైల్ ధర	4.35

- రికార్డు స్థాయిల వద్ద లాభాల స్వీకరణ
- నష్టాల్లో ముగిసిన మార్కెట్లు
- 59 పాయింట్లు తగ్గిన సెన్సెక్స్
- నిఫ్టీ 24 పాయింట్లు క్షీణత



చిన్న షేర్లు డౌన్

- బీఎస్ఈలో మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం తగ్గింది. ట్రేడైన షేర్లలో 2,288 నష్టపోగా.. 1,554 లాభపడ్డాయి.
- నగదు విభాగంలో ఎఫ్‌పీఐలు రూ. 593 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించగా.. దేశీ ఫండ్స్ రూ. 2,257 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి.

తొలిసారి 75,000పైకి సెన్సెక్స్

ముంబై: దేశీ స్టాక్ మార్కెట్ చరిత్రలో తొలిసారి సెన్సెక్స్ 75,000 పాయింట్ల మైలురాయిని అధిగమించింది. తొలుత ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఎగబడటంతో 382 పాయింట్లు జంప్‌చేసింది. 75,124ను దాటింది. ఆపై మిడ్‌సెషన్ నుంచీ అమ్మకాలు ఊపందుకోవడంతో లాభాలను వీడి నష్టాలలోకి ప్రవేశించింది. చివరికి 59 పాయింట్లు తక్కువగా 74,684 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 24 పాయింట్ల క్షీణతతో 22,643 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో నిఫ్టీ 102 పాయింట్లు ఎగసి 22,768 వద్ద కొత్త గరిష్టాన్ని తాకింది. తదుపరి 22,612 పాయింట్ల వద్ద కనిష్టాన్నీ చవిచూసింది. సరికొత్త రికార్డుల వద్ద ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటం మార్కెట్లను దెబ్బతీసినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.

ఆర్‌ఐఎల్ వీక్ : ఎన్ఎస్ఈలో మీడియా, పీఎస్‌యూ బ్యాంక్స్, కన్జూమర్ డ్యూరబుల్స్, ఎఫ్ఎంసీజీ 1.3–0.6 శాతం మధ్య నీరసించగా.. మెటల్, రియల్టీ, ప్రయివేట్ బ్యాంక్స్ 1–0.5 శాతం మధ్య బలపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో టైటన్, హీరోమోటో, కోల్ ఇండియా, ఆర్‌ఐఎల్, ఏషియన్ పెయింట్స్, బీపీసీఎల్, ఇండస్‌ఇండ్, టాటా కన్జూమర్, శ్రీరామ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్, సిప్లా, టెక్ ఎం, విప్రో 2–1 శాతం మధ్య క్షీణించాయి. అయితే అపోలో హాస్పిటల్స్, హిందాల్కో, ఐసీఐసీఐ, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్, టాటా స్టీల్ 3–0.5 శాతం మధ్య పుంజుకున్నాయి. కాగా గతేడాది క్యూ4(జనవరి–మార్చి)లో నికర లాభం భారీగా దూసుకెళ్లి రూ. 24 కోట్లకు చేరడంతో క్యుపిడ్ షేరు 5 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకి రూ. 134 వద్ద ముగిసింది.

ఘనంగా రిలయన్స్ డిజిటల్ డిస్కౌంట్ల పండుగ



హైదరాబాద్: రిలయన్స్ డిజిటల్ ఈ నెల 6వ తేదీన ప్రారంభించిన డిజిటల్ డిస్కౌంట్ డేస్ సేల్‌కు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ నెల 15వ తేదీ వరకూ ఈ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. రిలయన్స్ డిజిటల్ స్టోర్స్‌తో పాటు మై జియో స్టోర్స్‌లోనూ ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. బ్యాంకింగ్ దిగ్గజ కార్డులపై కస్టమర్లు 10 శాతం వరకూ డిస్కౌంట్, ఫ్లెక్సిబుల్ ఈఎంఐ ఆప్షన్లతో కన్జూమర్ డ్యూరబుల్ లోన్స్‌పై రూ.15,000 వరకూ క్యాష్ బ్యాక్ వంటి ఆఫర్లను పొందవచ్చు.

పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఎండీ రాజీనామా



న్యూఢిల్లీ: ఆర్‌బీఐ ఆంక్షలతో సమస్యల్లో చిక్కుకున్న పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్) ఎండీ, సీఈవో పదవి నుంచి సురీందర్ చావ్లా తప్పుకున్నారు. వ్యక్తిగత కారణాలతో పాటు ఇతరత్రా మెరుగైన కెరియర్ అవకాశాలపై దృష్టి పెట్టేందుకు ఏప్రిల్ 8న ఆయన రాజీనామా చేసినట్లు పేటీఎం బ్రాండ్ యాజమాన్య సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ తెలిపింది. జూన్ 26 వరకు ఆయన బాధ్యతల్లో కొనసాగుతారని వివరించింది. సురీందర్ చావ్లా గతేడాది జనవరిలో పీపీబీఎల్‌లో చేరారు. నిబంధనలను పదే పదే ఉల్లంఘించినందుకు గాను దాదాపు కార్యకలాపాలన్నీ నిలిపివేయాలంటూ ఈ ఏడాది జనవరి 31న కంపెనీని ఆదేశించింది. ఇందుకు ముందుగా ఫిబ్రవరి 29ని డెడ్‌లైన్‌గా విధించగా, ఆ తర్వాత మార్చి 15 వరకు పొడిగించింది.

‘ఇన్వెస్కో’లో హిందుజా సంస్థకు వాటాలు

ఇండస్‌ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్‌కు 60%



సంతకాల కార్యక్రమంలో ఇన్వెస్కో ఆసియా పసిఫిక్ సీనియర్ ఎండీ, సీఈఓ ఆండ్రూ, ఐఐహెచ్‌ఎల్ చైర్మన్ అశోక్ హిందుజా, సీఈఓ మోసెస్ హార్డింగ్ (ఎడమ నుంచి కుడికి)

ముంబై: మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్కో అసెట్ మేనేజ్‌మెంట్ ఇండియా (ఐఏఎంఐ)లో 60 శాతం వాటాలు కొనుగోలు చేస్తున్నట్లు హిందుజా గ్రూప్ సంస్థ ఇండస్‌ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ (ఐఐహెచ్‌ఎల్) వెల్లడించింది. ఇందుకు సంబంధించి జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేసేందుకు ఐఐహెచ్‌ఎల్, ఇన్వెస్కో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించింది. దీని ద్వారా ఐఏఎంఐలో ఐఐహెచ్‌ఎల్‌కు 60 శాతం, ఇన్వెస్కోకు 40% వాటాలు ఉంటాయి. 1.6 లక్షల కోట్ల డాలర్ల విలువ చేసే అసెట్స్‌ను నిర్వహించే అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ దిగ్గజం ఇన్వెస్కోకి ఐఏఎంఐ భారత విభాగంగా ఉంది. లోటస్ ఇండియా అసెట్ మేనేజ్‌మెంట్‌ను కొనుగోలు చేయడం ద్వారా 2008 ఆఖర్లో భారత మార్కెట్లో కార్యకలాపాలు ప్రారంభించింది. 2024 మార్చి 31 నాటికి ఐఏఎంఐ ఏయూఎం (నిర్వహణలో ఉన్న ఆస్తులు) రూ. 85,393 కోట్లుగా ఉండగా, దేశవ్యాప్తంగా 40 నగరాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. సంస్థకు హైదరాబాద్‌లో ఎంటర్‌ప్రైజ్ సెంటర్ కూడా ఉంది. ఇందులో 1,700 మంది పైచిలుకు ఉద్యోగులు ఉన్నారు.

గో ఫస్ట్ దివాలా ప్రక్రియకు గడువు పెంపు

న్యూఢిల్లీ: విమానయాన సంస్థ గో ఫస్ట్ దివాలా పరిష్కార ప్రక్రియను (సీఐఆర్‌పీ) పూర్తి చేసేందుకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) గడువును జూన్ 3 నాటికి పొడిగించింది. 60 రోజుల్లోగా దీన్ని ముగించాలని ఆదేశించింది. వాస్తవానికి ఈ గడువు ఏప్రిల్ 4తో ముగిసింది. దీనికి సంబంధించిన గడువును పొడిగించడం ఇది మూడోసారి. గతేడాది మే 3 నుంచి గో ఫస్ట్ కార్యకలాపాలు నిల్చిపోయాయి. 2023 మే 10న సంస్థ దివాలా ప్రక్రియకు అనుమతించాలంటూ కంపెనీ స్వచ్ఛందంగా దాఖలు చేసిన పిటీషన్‌ను ఎన్‌సీఎల్‌టీ స్వీకరించింది.

గ్లాండ్ ఫార్మా వాటా విక్రయం

డీల్ విలువ రూ. 1,412 కోట్లు

న్యూఢిల్లీ: ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా గ్లాండ్ ఫార్మాలో రెండు సంస్థలు 4.9% వాటాను విక్రయించాయి. ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం షేరుకి రూ. 1,735–1,739 ధరల శ్రేణిలో 81.20 లక్షల షేర్లను విక్రయించాయి. తద్వారా లకుమి ట్రస్ట్, నికొమాక్ మెషీనరీ సంయుక్తంగా రూ. 1,412 కోట్లు సమకూర్చుకున్నాయి. లకుమి 61.65 లక్షల షేర్లు, నికొమాక్ 19.55 లక్షల షేర్లు(1.18 శాతం వాటా) అమ్మివేశాయి. దీంతో నికొమాక్ కంపెనీ నుంచి పూర్తిగా వైదొలగింది. ప్రస్తుతం గ్లాండ్ ఫార్మాలో చైనా ప్రమోటర్ సంస్థ ఫోజమ్ ఫార్మా 57.86%వాటాను కలిగి ఉంది. ఎన్ఎస్ఈలో గ్లాండ్ ఫార్మా షేరు 3% తగ్గి రూ. 1,807 వద్ద ముగిసింది.

డిక్సన్ చేతికి ఇస్మార్టు ఇండియా

50.1% వాటా కొనుగోలుకి డీల్ ● ఐటెల్, ఇన్ఫినిక్స్, టెక్నో బ్రాండ్లు సొంతం



న్యూఢిల్లీ: కన్జూమర్ డ్యూరబుల్స్ కాంట్రాక్ట్ తయారీ దిగ్గజం డిక్సన్ టెక్నాలజీస్ ఎలక్ట్రానిక్స్, మొబైల్స్ తయారీ కంపెనీ ఇస్మార్టు ఇండియాను సొంతం చేసుకోనుంది. తొలి దశలో భాగంగా నగదు రూపేణా 50.1 శాతం వాటా కొనుగోలుకి షేరు కొనుగోలు ఒప్పందం(ఎస్‌పీఏ) కుదుర్చుకున్నట్లు డిక్సన్ టెక్ వెల్లడించింది. ఇందుకు ఇస్మార్టు సింగపూర్, ట్రాన్సిషన్ టెక్నాలజీ, 5ఏ అడ్వయి జర్స్ ఎల్ఎల్‌పీతో ఎస్‌పీఏపై సంతకాలు చేసినట్లు పేర్కొంది. 90 రోజుల్లోగా సొంతం చేసుకోనున్న ఈ వాటా కోసం రూ. 238 కోట్లకుపైగా వెచ్చించనున్నట్లు తెలియజేసింది. తదుపరి రెండో దశలో భాగంగా 2026–27కల్లా 1.6–5.9 శాతం మధ్య అదనపు వాటాను కొనుగోలు చేసేందుకు హక్కులను పొందనున్నట్లు వెల్లడించింది. వెరసి ఇస్మార్టు ఇండియాలో ఇస్మార్టు సింగపూర్ 42.75–47.05 శాతం మధ్య వాటాను మిగిల్చుకోనుంది. కాగా.. ఈ డీల్‌కు కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) అనుమతి పొందవలసి ఉంది.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

డీఎస్ఎస్ఎస్‌బీ, ఢిల్లీలో 414 గ్రూప్-3, గ్రూప్-4 పోస్టులు

ఢిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డ్ (డీఎస్ఎస్ఎస్‌బీ).. వివిధ శాఖలు, విభాగాలు, స్థానిక సంస్థల్లో గ్రూప్-3, గ్రూప్-4 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 414
» పోస్టుల వివరాలు: డ్రైవర్(డ్రగ్స్ కంట్రోల్)- 01, స్టాఫ్ కార్ డ్రైవర్(లా, జస్టిస్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్)-01, స్టాఫ్ కార్ డ్రైవర్ (లోకాయుక్త)-01, స్టాఫ్ కార్ డ్రైవర్ (డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్)-03, స్టాఫ్ కార్ డ్రైవర్(జనరల్ అడ్మినిస్ట్రేషన్)-12, డ్రైవర్(ఎల్ఎంవీ)-01, స్టాఫ్ కార్ డ్రైవర్(ఢిల్లీ జైల్స్)-11, ల్యాబ్ టెక్నీషియన్ (గ్రూప్-3)-38, ల్యాబ్ టెక్నీషియన్ (గ్రూప్-4)-06, ల్యాబ్ టెక్నీషియన్-10, ల్యాబొరేటరీ టెక్నీషియన్-01, ఫార్మసిస్ట్(డిస్పెన్సర్)-110, ఫార్మసిస్ట్ (అల్లోపతి) -18, ఆక్సిలరీ నర్స్/మిడ్ వైఫ్(మున్సిపల్ కార్పొరేషన్)-144, ఆక్సిలరీ నర్స్/మిడ్ వైఫ్(మున్సిపల్ కౌన్సిల్)-08, డ్రాఫ్ట్స్‌మన్ గ్రేడ్3 (సివిల్)-10, స్టోర్ కీపర్-01, స్టోర్ సూపర్‌వైజర్-01, ఫార్మసిస్ట్(అగ్రి మార్కెటింగ్)-02, జూనియర్ ఫార్మసిస్ట్-03, అసిస్టెంట్ శానిటరీ ఇన్‌స్పెక్టర్-32.
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, 10+2, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. పని అనుభవం ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 19.04.2024.
» వెబ్‌సైట్: https://dsssb.delhi.gov.in/

అలిమ్‌కో, కాన్పూర్‌లో 142 పోస్టులు

కాన్పూర్‌లోని ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎల్ఐఎంసీవో).. కాంట్రాక్ట్ ప్రాతిపదికన దేశ వ్యాప్తంగా ఉన్న అలిమ్‌కో కేంద్రాల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 142
» పోస్టుల వివరాలు: సీనియర్ కన్సల్టెంట్-01, మేనేజర్-01, డిప్యూటీ మేనేజర్-01, అసిస్టెంట్ మేనేజర్-04, జూనియర్ మేనేజర్-17, ఆడియాలజిస్ట్-50, ప్రోస్థెటిక్స్ అండ్ ఆర్థోటిక్స్-47, స్పెషల్ ఎడ్యుకేటర్- 05, క్లినికల్ సైకాలజిస్ట్-05, ఆప్టోమెట్రిస్ట్- 05, సీఎస్ఆర్ కన్సల్టెంట్-01, క్యూసీ అసిస్టెంట్-04, ఫైనాన్స్ అసిస్టెంట్-01.
» అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, పీజీ, బీఈడీ/ఎంఈడీ, ఎంఫిల్, డిప్లొమా, సర్టిఫికేట్ కోర్సు, సీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: ఆడియాలజిస్ట్, ప్రోస్థెటిక్స్ అండ్ ఆర్థోటిక్స్, స్పెషల్ ఎడ్యుకేటర్, క్లినికల్ సైకాలజిస్ట్, ఆప్టోమెట్రిస్ట్, సీఎస్ఆర్ కన్సల్టెంట్ పోస్టులకు 40 ఏళ్లు, క్యూసీ అసిస్టెంట్, ఫైనాన్స్ అసిస్టెంట్, క్యూసీ అసిస్టెంట్, జూనియర్ మేనేజర్ పోస్టులకు 45 ఏళ్లు, మేనేజర్, డిప్యూటీ మేనేజర్ పోస్టులకు 50 ఏళ్లు, సీనియర్ కన్సల్టెంట్‌కు 62 ఏళ్లు మించకూడదు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 16.04.2024.
» వెబ్‌సైట్: https://alimco.in/

నైపర్ మొహాలీలో టీచింగ్ పోస్టులు

పంజాబ్ మొహాలీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్).. తాత్కాలిక ప్రాతిపదిక టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 32
» పోస్టుల వివరాలు: ప్రొఫెసర్ 13 పోస్టులు , అసోసియేట్ ప్రొఫెసర్ 12 పోస్టులు , అసిస్టెంట్ ప్రొఫెసర్ -7 పోస్టులు.
» విభాగాలు: ఫార్మకో ఇన్ఫర్మేటిక్స్, నేచురల్ ప్రొడక్ట్స్, ఫార్మస్యూటికల్ అనాలసిస్, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, ఫార్మాస్యూటిక్స్, ఫార్మసీ ప్రాక్టీస్, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ-ఫార్ములేషన్స్, బయోటెక్నాలజీ, మెడికల్ డివైసెస్, మెడిసినల్ కెమిస్ట్రీ, క్లినికల్ రీసెర్చ్.
» అర్హత: పీహెచ్‌డీతోపాటు బోధన/రీసెర్చ్/ఇండస్ట్రియల్ అనుభవం ఉండాలి.
» వయసు: గరిష్ఠ వయో పరిమితి 50 ఏళ్లకు మించరాదు.
» వేతనం: ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,59,100–రూ.2,20,200; అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,39,600–రూ.2,11,300; అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.రూ.1,01,500–రూ.1,67,400.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
» దరఖాస్తు తేది: 06.05.2024
» వెబ్‌సైట్: https://niper.gov.in/

నాణ్యమైన విద్యకు కేరాఫ్.. కేవీలు!

దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాలు.. ఒకటో తరగతి నుంచే క్రియేటివ్ లెర్నింగ్‌కు ప్రాధాన్యమిస్తూ విద్యార్థులకు బోధన సాగిస్తున్నాయి. సీబీఎస్ఈ కరిక్యులం, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్, లెర్నింగ్ బై డూయింగ్‌ల ద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నాయి. ఇలాంటి వినూత్న బోధన అందిస్తున్న కేంద్రీయ విద్యాలయాల్లో.. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. కేవీల ప్రత్యేకత, అడ్మిషన్ విధానం, అర్హతలు తదితర వివరాలు..

» 2024కు కేవీల్లో ప్రవేశాలకు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
» 9వ తరగతి మినహా అన్ని తరగతుల్లో నేరుగా ప్రవేశం
» 9వ తరగతి ప్రవేశాలకు పరీక్ష నిర్వహణ
» చదువుతోపాటు ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్

కేంద్రీయ విద్యాలయాలను ఆరు దశాబ్దాల క్రితం కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రారంభంలో రక్షణ శాఖ ఉద్యోగుల పిల్లల కోసం సెంట్రల్ స్కూల్స్ పేరుతో వీటిని నెలకొల్పారు. ఆ తర్వాత సాధారణ పౌరుల పిల్లలకు కూడా ప్రవేశం కల్పించేలా నిబంధనలు మార్చారు. దేశ వ్యాప్తంగా నెలకొల్పిన కేవీలను పర్యవేక్షించేందుకు కేంద్రీకృత విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇందుకోసం కేంద్రీయ విద్యాలయ సంఘటన్ అనే ప్రత్యేక పర్యవేక్షణ సంస్థను ఏర్పాటు చేశారు.

లెర్నింగ్ బై డూయింగ్

కేంద్రీయ విద్యాలయాల్లో ప్రస్తుతం ఒకటో తరగతి నుంచి +2(సీబీఎస్ఈ) వరకు బోధన అందిస్తున్నారు. పూర్తిగా ఇంగ్లిష్ మీడియంలో.. యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌కు ప్రాధాన్యం ఇస్తూ బోధన సాగుతోంది. యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ కారణంగా విద్యార్థులు ఒకటో తరగతి నుంచే ఆయా అంశాలపై ఆసక్తిని పెంచుకునే అవకాశం ఉంటుంది. ఫలితంగా పాఠ్యాంశాలపై పట్టు సాధించేందుకు ఆస్కారం ఏర్పడుతుంది.

ఒకటో తరగతి..లాటరీ విధానం

కేంద్రీయ విద్యాలయాల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు లాటరీ విధానంలో విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్ విధానంలోనే దరఖాస్తులను స్వీకరిస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్ పోర్టల్ ను అందుబాటులోకి తెచ్చారు. ఈ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా గరిష్ఠంగా మూడు కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా లాటరీ విధానంలో సంబంధిత కేంద్రీయ విద్యాలయాలు విద్యార్థులను ఎంపిక చేస్తాయి.

తొమ్మిదో తరగతికి.. ప్రవేశ పరీక్ష

ఎనిమిదో తరగతి వరకు ఎలాంటి ప్రవేశ పరీక్షలు లేకుండా విద్యార్థుల మెరిట్, అందుబాటులో ఉన్న సీట్ల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నారు. కాని తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి మాత్రం అడ్మిషన్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. మూడు గంటల వ్యవధిలో వంద మార్కులకు ఈ ప్రవేశ పరీక్ష ఉంటుంది. హిందీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, సోషల్ సైన్స్, సైన్స్‌లలో ఒక్కో సబ్జెక్ట్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. ఇందులో 33 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఆ తర్వాత సంబంధిత కేంద్రీయ విద్యాలయ అధికారులు మెరిట్ జాబితా రూపొందించి.. కేటగిరీల వారీగా ప్రాధాన్యత క్రమంలో ప్రవేశాలు కల్పిస్తారు.

11, 12 నేరుగా ప్రవేశం

11వ తరగతి (సీబీఎస్ఈ +1), 12వ తరగతి (సీబీఎస్ఈ +2)లలో అందుబాటులో ఉన్న సీట్లకు నేరుగా ప్రవేశం కల్పిస్తారు. ఎలాంటి పరీక్ష ఉండదు. అదే విధంగా ఎలాంటి వయో పరిమితి నిబంధన కూడా లేదు. పదో తరగతి ఉత్తీర్ణులైన సంవత్సరంలోనే 11వ తరగతికి దరఖాస్తు చేసుకోవాలి. 11వ తరగతిలో బ్రేక్ లేని వారికి 12వ తరగతిలో ప్రవేశాలు కల్పిస్తారు.

ప్రవేశాల్లో.. ప్రాధాన్యతలు

- కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు సంబంధించి.. విద్యార్థుల తల్లిదండ్రుల వృత్తికి అనుగుణంగా ప్రాధాన్యతనిస్తారు. అయిదు కేటగిరీలుగా వీటిని పరిగణిస్తారు.
- బదిలీయైన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, సాధారణ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, మాజీ సైనికోద్యోగుల పిల్లలు.
- కేంద్ర ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి సంస్థలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ ఆఫ్ ది ఇండియన్ గవర్నమెంట్‌కు సంబంధించి బదిలీయైన, సాధారణ ఉద్యోగుల పిల్లలు.
- బదిలీయైన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, సాధారణ ఉద్యోగుల పిల్లలు.
- రాష్ట్ర ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి సంస్థలు, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్, రాష్ట్ర ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్‌కు సంబంధించి బదిలీయైన, సాధారణ ఉద్యోగుల పిల్లలు.
- పై కేటగిరీలకు చెందని, ఇతర వర్గాలకు చెందిన పిల్లలు.



కేవీల్లో ప్రవేశాలు

ప్రాధాన్యత విధానం

ప్రవేశాల ఖరారు, ఎంపికలో ప్రాధాన్యత విధానాన్ని అమలు చేస్తున్నారు. తల్లిదండ్రులకు ఒకే ఆడపిల్లగా ఉన్న విద్యార్థినికి, రాష్ట్ర ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్‌లు /సీబీఎస్ఈలతోపాటు జాతీయ/ రాష్ట్ర స్థాయి క్రీడల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుంది. స్పెషల్ ఆర్ట్స్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో గుర్తింపు పొందిన విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలకు ప్రాధాన్యం ఉంటుంది. అదే విధంగా..పరమ్ వీర్ చక్ర, మహావీర్ చక్ర తదితర మెడల్స్ పొందిన ఉద్యోగుల పిల్లలకు, పోలీస్ మెడల్స్ పొందిన ఉద్యోగుల పిల్లలకు ప్రాధాన్యం ఇస్తారు.

వయో పరిమితి ఇలా

- కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్దిష్ట వయో పరిమితులను నిర్దేశించారు. వీటిని నూతన విద్యా విధానానికి అనుగుణంగా నిర్ధారించారు. అవి..
- ఒకటో తరగతి: 6–8 ఏళ్లు ◆ రెండో తరగతి: 7–9 ఏళ్లు ◆ మూడో తరగతి: 8–10 ఏళ్లు ◆ నాలుగో తరగతి: 8–10 ఏళ్లు ◆ ఐదో తరగతి: 9–11 ఏళ్లు ◆ ఆరో తరగతి: 10–12 ఏళ్లు ◆ ఏడో తరగతి: 11–13 ఏళ్లు ◆ ఎనిమిదో తరగతి: 12–14 ఏళ్లు ◆ తొమ్మిదో తరగతి: 13–15 ఏళ్లు ◆ పదో తరగతి: 14–16 ఏళ్లు ఉండాలి.
- ఎన్ఈపీ మార్గదర్శకాలను అనుసరించి 3, 4 తరగతులకు వయో పరిమితిని ఒకే విధంగా (8–10 ఏళ్లు)గా పేర్కొన్నారు. విద్యార్థులు 2024, మార్చి 31వ తేదీ నాటికి ఈ వయో శ్రేణుల మధ్యలో ఉండాలి.

బోధన వినూత్నం

కేవీల్లో వినూత్న విద్యా విధానం అమలవుతోంది. ముఖ్యంగా కొత్తగా చేరే పిల్లలు స్కూల్ వాతావరణానికి అలవాటుపడేలా చేసేందుకు ఆరు వారాల వ్యవధితో 'స్కూల్ రెడీనెస్ ప్రోగ్రామ్'ను రూపొందించాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తయిన అనంతరం టీచర్లు విద్యార్థుల్లో పలు దృక్పథాల్లో ఆశించిన ఫలితాలు వచ్చాయా లేదా అనే విషయాలను పరీక్షిస్తారు. పరిసరాలను అర్థం చేసుకోవడం; ఆత్మవిశ్వాసం, పరిశీలన సామర్థ్యం, పరస్పర సంబంధాలు, వర్గీకరణ , ప్యాట్రన్‌లను అర్థం చేసుకొని అనుకరించగలగడం, భావ వ్యక్తీకరణ, అవగాహన, క్రియేటివ్ స్కిల్స్ పొందేలా బోధన ఉంటుంది.

ముఖ్య సమాచారం:

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» ఒకటో తరగతి ప్రవేశ దరఖాస్తు చివరి తేదీ: 2024, ఏప్రిల్ 15
» 2వ తరగతి నుంచి(11వ తరగతి) ఆఫ్‌లైన్ దరఖాస్తు తేదీలు: ఏప్రిల్ 1 -10
» 11వ తరగతి ప్రవేశాలకు చివరి తేదీ: కేవీల్లో చదువుతున్న విద్యార్థులు ఎస్ఎస్‌సీ ఫలితాలు వచ్చిన పది రోజుల్లోగా, కేవీల్లో చదవని విద్యార్థులు సీబీఎస్ఈ ఫలితాలు వచ్చిన 30 రోజుల్లోగా ఆన్‌లైన్ అడ్మిషన్‌ను ఖరారు చేసుకోవాలి.
» పూర్తి వివరాలకు వెబ్‌సైట్: kvsangathan.nic.in/admission/

ఫీజులు నామమాత్రం

కేంద్రీయ విద్యాలయాల్లో ఫీజులు నామ మాత్రమని చెప్పొచ్చు. అడ్మిషన్ ఫీజు రూ.25. విద్యాలయ వికాస నిధి(రూ.500), ట్యూషన్ ఫీజు, కంప్యూటర్ ఎడ్యుకేషన్ తదితర ఫీజులు ఉంటాయి. ఒకటి నుంచి అయిదో తరగతి విద్యార్థులకు అన్ని ఫీజులు కలిపి నెలకు రూ.500–600, ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.1000 లోపు అవుతుంది. బాలికలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేంద్రీయ విద్యాలయ ఉద్యోగుల పిల్లలకు ట్యూషన్ ఫీజు మినహాయింపు ఉంటుంది.

రేపు రంజాన్ పండుగ

కనిపించని నెలవంక ● బుధవారంతో ఉపవాసాల ముగింపు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా మంగళవారం నెలవంక కనిపించినట్టు ఎక్కడి నుంచి కూడా సమాచారం రాలేదని, దీంతో గురువారం ఏప్రిల్ 11వ తేదీన ఈద్‌–ఉల్‌–ఫితర్ (రంజాన్ పండుగ) జరుపుకోవాలని రుహియతే హిలాల్ కమిటీ (నెలవంక నిర్ధారణ కమిటీ) కన్వీనర్ సయ్యద్ ఇబ్రహీం హుస్సేనీ సజ్జాద్‌పాషా తెలిపారు. మొజంజాహీ మార్కెట్‌లోని కమిటీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నగరంతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని నెలవంక నిర్ధారణ కమిటీల ద్వారా నెలవంక కనబడినట్లు సమాచారం అందలేదన్నారు. బుధవారం రంజాన్ చివరి రోజుగా పరిగణించి ఉపవాసం పాటించాలని, గురువారం షవ్వాల్ 1వ తేదీ (ఏప్రిల్ 11)గా పరిగణించి రంజాన్ పండుగ జరుపుకోవాలని సూచించారు. పండుగను శాంతిపూర్వక వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రజలందరికీ కమిటీ తరుపున రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.



బండెనక బండి.. పండుగ సందడి

ఉగాది ఉత్సవాలు అంబరాన్ని అంటాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంలో మంగళవారం భారీ సంఖ్యలో ఎడ్లబండ్లను ప్రదర్శించారు. కుల, యువజన, ఆయా సంఘాల ఆధ్వర్యంలో సుమారు 50కిపైగా ఎడ్లబండ్లను ప్రదర్శించారు. పోటాపోటీగా ఎడ్లను, బండ్లను అందంగా తయారు చేశారు. జిల్లా కేంద్రంలోని వీక్లీ మార్కెట్‌లోని రాజరాజేశ్వర మాత, పోచమ్మ, పెద్దమ్మ తదితర ఆలయాల చుట్టూ ఎడ్లబండ్ల ప్రదక్షిణలు చేయించారు. ఈ ఉత్సవాలను వీక్షించడానికి ఆయా మండలాలు, పట్టణం నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణ అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ ఆలయం ముందు పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. ఎడ్లబండ్ల నిర్వాహకులను ఘనంగా సన్మానించారు. - కామారెడ్డి టౌన్/సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



మామిడి.. ఇబ్బడిముబ్బడి

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలోని మోదాల గంగయ్య భూమిలోని మామిడి చెట్టు కొమ్మకు 54 కాయలు కాశాయి. ఈ కాయలను గ్రామస్తులు ఆసక్తిగా చూస్తున్నారు. - గరిడేపల్లి

బండరాయితో ఢీ అంటే ఢీ

● 120 కిలోల బండరాయిని ఎత్తిన పాలమూరు మొనగాళ్లు



గుండ్రని బండరాయిని భుజంపైకి ఎత్తుకున్న దాస్

పద్మారావునగర్ (హైదరాబాద్): పాలమూరు యువకుల బలప్రదర్శన కార్యక్రమం కనుల పండువగా జరిగింది. ఉగాది పర్వదినాన ఈ పోటీలు నిర్వహించడం ఆనవాయితీ. 120 కిలోల బండరాయిని ఎత్తిన వారిని మొనగాళ్లుగా గుర్తించి సన్మానిస్తారు. 50 ఏళ్ల క్రితం పాలమూరు జిల్లా నుంచి నగరానికి వలస వచ్చి బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని హమాల్‌బస్తీలో అనేక కుటుంబాలు స్థిరపడ్డాయి. సొంతూరిలో ఉగాది నాడు కొనసాగే సంప్రదాయాన్ని ఇక్కడ కూడా పాటిస్తున్నారు. హమాల్‌బస్తీలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ప్రాంగణం వద్ద మంగళవారం బలప్రదర్శన పోటీలు నిర్వహించారు. 120 కిలోల గుండ్రని బండరాయిని ఎత్తే పోటీల్లో 20 మంది యువకులు పాల్గొన్నారు. అయితే ఈ పోటీల్లో విజయ్, శ్రీనివాస్, దాస్ మాత్రమే ఈ బండరాయిని భుజంపైకి ఎత్తుకున్నారు. ఈ ముగ్గురు విజేతలను బస్తీలో ఘనంగా సత్కరించారు.

అమెరికాలో కిడ్నాపైన నాచారం విద్యార్థి అర్ఫాత్ మృతి

- ఓహాయోలోని క్లీవ్‌ల్యాండ్‌లో మృతదేహం లభ్యం
- లభించిన ఆధారాలతో గుర్తించిన పోలీసులు
- కిడ్నాపర్లే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్టు అనుమానం



అబ్దుల్ అర్ఫాత్

మల్లాపూర్ (హైదరాబాద్): అమెరికాలో కిడ్నాప్ అయిన హైదరాబాద్‌లోని నాచారానికి చెందిన విద్యార్థి మహమ్మద్ అబ్దుల్ అర్ఫాత్(25) ఓహాయోలోని క్లీవ్‌ల్యాండ్‌లో మృతి చెందాడు. అక్కడి సరస్సులో లభ్యమైన మృతదేహం నడుము చుట్టూ పాస్‌పోర్ట్, మొబైల్‌ఫోన్, కొన్ని పత్రాలు కట్టి ఉన్నాయి. వాటిని పరిశీలించిన పోలీసులు అర్ఫాత్‌గా గుర్తించారు. ఈ విషయాన్ని న్యూయార్క్‌లోని భారత దౌత్య కార్యాలయం మంగళవారం 'ఎక్స్'లో వెల్లడించింది. అర్ఫాత్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామని, ఈ ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసేందుకు పోలీసులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు ప్రకటించింది. అర్ఫాత్ మృతదేహాన్ని భారత్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పింది.

మార్చి 7న కిడ్నాప్: నాచారానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ అర్ఫాత్ గత మార్చి 7న అదృశ్యమయ్యాడు, ఉన్నత చదువులకు అమెరికా వెళ్లిన అర్ఫాత్ క్లీవ్‌ల్యాండ్ విశ్వవిద్యాలయంలో ఐటీ మాస్టర్స్ డిగ్రీ చదువుతున్నాడు. అయితే కిడ్నాప్‌నకు కొద్ది రోజుల ముందు తనకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు ఫోన్‌కాల్ వచ్చిందని అర్ఫాత్ తన తండ్రి మహమ్మద్ సలీంకు ఫోన్ చేసి చెప్పాడు, దీంతో వారు ఆందోళన చెందారు. ఇది జరిగిన కొద్దిరోజులకే అర్ఫాత్ కిడ్నాప్ అయ్యాడు. 1200 డాలర్లు ఇస్తేనే విడిచి పెడతామని బెదిరించారని, లేకుంటే అర్ఫాత్ కిడ్నీలు విక్రయిస్తామని కిడ్నాప్ చేసినవారు సలీంను ఫోన్‌లో బెదిరించారు. అయితే అర్ఫాత్‌ను రక్షించుకునేందుకు తండ్రి సలీం అంగీకరించి,...అర్ఫాత్ మీ దగ్గర ఉన్నట్టు ఆధారాలు ఉన్నాయా అని అడిగాడు. దీంతో కిడ్నాపర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఫోన్ పెట్టేశారని, వారి నుంచి మళ్లీ కాల్ రాలేదని సలీం తెలిపారు. కిడ్నాపర్ మాట్లాడటానికి ముందు ఫోన్‌లో ఎవరిదో ఏడుపు వినిపించిందని..అదే చివరి గొంతు అన్నారు. కిడ్నాపర్ల ఫోన్‌నంబరు అమెరికాలోని తమ బంధువులకు పంపి క్లీవ్‌ల్యాండ్ పోలీసులకు అందజేయాలని సలీం చెప్పారు. అర్ఫాత్ అదృశ్యంపై అతడి బంధువులు మార్చి 8న క్లీవ్‌ల్యాండ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో లుకౌట్ నోటీసు జారీ చేశారు. ఇది జరిగిన దాదాపు నెలరోజుల తర్వాత విషాదవార్త వినాల్సి వచ్చిందని కుటుంబసభ్యులు రోదిస్తూ చెప్పారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.